


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




శనివారం | 7-12-2019 | పేజీలు: 14 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 232 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి పూర్తి; నక్షత్రం: రేవతి రా. 1.28 తదుపరి అశ్వని; వర్జ్యం: మ. 12.13-1.59; దుర్ముహూర్తం: ఉ. 6.37-8.05; అమృతఘడియలు: రా. 10.49-12.35; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 5.37 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో నిందితుల మృతదేహాలు... పరిశీలిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది



# అక్కడే... అంతం

## దిశ హత్యాచారం కేసులో మలుపు

**అదే దిశ.. ఆఖరి దశ.. మొదలైన చోటే ముగింపు**

**దిశను దహనం చేసినచోటే కాల్చివేత**

**ఆమెను కాల్చిన సమయంలోనే ఘటన**

**సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌కు నలుగురు నిందితులు**

**ఘటనాస్థలికి 250 మీటర్ల దూరంలో ఆరిఫ్, నవీన్, శివ, చెన్నకేశవులు హతం**

**20 మీటర్లలో చెల్లాచెదురుగా మృతదేహాలు**

హైదరాబాద్, షాద్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'దిశ' మరణించి శుక్రవారానికి తొమ్మిది రోజులు! ఆమెను దహనం చేసిన అదే స్థలంలో.. దాదాపు అదే సమయంలో 'దిశ'పై అత్యాచారం చేసి చంపేసిన ఆ నలుగురు నిందితులూ హతమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు వారిని ఎన్‌కౌంటర్ చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ' హత్యాచార ఉదంతం నిందితులకు ఉరే సరైనదంటూ బాధిత

మిగతా 11వ పేజీలో...

*దిశ హత్యాచారం కేసు.. మొదలైన చోటే ముగిసింది!*

చీకటి మాటున కాటు వేసిన చీడపురుగులు ఆమెను దహనం చేసిన చోటే.. నిందితులపై ఆఖరి వేటు పడింది!!

*ఆమెను కాల్చేసిన 'తెల్లవారుజాము' సమయంలోనే.. ఆ నలుగురూ పోలీసుల కాల్పుల్లో హతమయ్యారు!*

నేడు 'దిశ' దశ దిన కర్మ. ఆమె ప్రాణాలను బలిగొన్నవారు.. పదిరోజుల్లోపే అంతమయ్యారు!!

*నాడు పోలీసుల నిష్క్రియపై విమర్శలు కురిపించినవారే.. ఖాకీలపై పూల జల్లు కురిపించారు!*

మదమెక్కిన మగపులేనుగుల నేలకూల్చి 'దిశ'కు న్యాయం చేసిందంటూ కేసీఆర్ ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు!!

*అప్పుడు.. బ్రిడ్జి కింద కాలిపోతున్న 'దిశ'ను చూసింది పాలవ్యాపారి సత్యం.*

ఇప్పుడూ.. బ్రిడ్జి దగ్గర ఎన్‌కౌంటర్ గురించి ముందు తెలిసింది కూడా పాలవ్యాపారి సత్యానికే!

*అప్పుడూ.. ఇప్పుడూ.. 'సత్యమే' సాక్షి!!*



## ఆ నలుగురు ఎన్‌కౌంటర్

**సాహో సజ్జనార్**

**జనం నీరాజనం**







# వెళ్లారు.. వచ్చారు

జగన్‌కు టైమ్ ఇవ్వని అమిత్‌షా

రమ్మని చెప్పి మరీ కలవని వైనం

అర్ధరాత్రి దాకా ఎదురుచూపులు

**ఉదయమూ 'నో అపాయింట్‌మెంట్'**

**15 గంటలు ఉండి తిరుగు ప్రయాణం**

**ప్రత్యేక విమానంలో వెళ్లినా దక్కని ఫలం**

**విస్మరణపై వైసీపీ ఎంపీల్లో చర్చలు**

**కలవడం ఇష్టంలేకే షా ఇలా చేశారా!?**



ప్రత్యేక విమానంలో సీఎం జగన్ ఢిల్లీకి వెళ్లారు... తిరిగి వచ్చారు! కలవాలనుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మాత్రం కలవలేకపోయారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ అసలే లభించలేదు. జగన్‌ను గురువారం రాత్రి పది తర్వాత రమ్మని చెప్పిన అమిత్ షా... శుక్రవారం ఉదయం కూడా సమయం ఇవ్వలేదు. జగన్ విషయంలో ఇలా జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

10



## వెయ్యి తెగల జన్యుపటాలు సిద్ధం

**జన్యులోపంతో వచ్చే వ్యాధులకు సంజీవని**

**దేశ వ్యాప్తంగా ఏడు కోట్ల మందికి ఊరట**

**సాంకేతికతను అభివృద్ధి చేసిన సీఎస్ఐఆర్**

12



10

కొబ్బరికాయ కొట్టి పార్టీ కొత్త కార్యాలయంలోకి చంద్రబాబు

**ప్రభుత్వ వైఫల్యాలపై..**

# సమర భేరి

21 అంశాలపై అసెంబ్లీలో నిలదీద్దాం

**టీడీపీ శాసనసభాపక్ష నిర్ణయం**

**కొత్త భవనంలో తొలి భేటీ**

**అందరూ చర్చల్లో పాల్గొనాలి**

**ఆరు నెలల గడువు ముగిసింది**

**ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి**

**ఎమ్మెల్యేలకు బాబు సూచన**












పరంజ్యోతి

# ధర్మఘంట.. శ్రీమద్భగవద్గీత



*అంతర్ బహిశ్చ తత్‌సర్వం వ్యాప్యనారాయణ స్థితః*

..అంటుంది 'నారాయణ సూక్తం'. భగవంతుడు సర్వాంతర్యామి అని, అంతటా వ్యాపించి ఉన్నాడని చెబుతుంది. విశ్వమంతటా వ్యాపించి ఉన్న భగవంతుడే.. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడి రూపంలో అవతరించి, కురుక్షేత్రంలో అర్జునుడికి రథసారథిగా వ్యవహరించాడు! నైరాశ్యంలో కూరుకుపోయిన పార్థుడికి.. జగద్గురువుగా 'గీతోపదేశం' చేశాడు. మార్గశిర శుద్ధ దశమినాడు అలా ఆ భగవంతుడి ముఖతః ప్రపంచానికి అందిన అమృతభాండం, మానవులను తట్టి లేపే ధర్మఘంట.. శ్రీమద్భగవద్గీత. భగవత్ సంబంధాన్ని పొందితే ఏ విషాదమైనా 'యోగం' అవుతుంది. అప్పుడసలు దుఃఖమే ఉండదు. దైవసంబంధం లేకుండా నరుడు విషయాల కోసం విలపిస్తే దుఃఖించవలసినదే. సుఖదుఃఖాలు బాహ్య ప్రపంచం నుండి రావు. అవి మనలోనే ఉంటాయి. వీరు ఇష్టులు.. వీరు అయిష్టులని, మనసు మాయ వలన రాగద్వేషాలకు లోనవుతుంది. వశమౌతుంది. దాని ఫలితమే మానవునకు సుఖదుఃఖాలు. కావుననే జీవులందరూ భగవత్ సంబంధం కలిగి ఉండాలి. భగవద్గీత అదే చెబుతుంది.

భగవంతునికి దూరమైతే విషాదం. శరణాగతి చేస్తే యోగం అవుతుంది. మనసులోని భగవంతుడు విశ్వాసానికి ప్రతీక. విశ్వంలోని భగవంతుడు అనుభవానికి ఆధారం. భగవత్ సంబంధాన్ని పొందినప్పుడే విషాదం.. విషాద యోగం అవుతుంది. కర్మ-కర్మయోగం, భక్తి.. భక్తి యోగం, జ్ఞానం- జ్ఞాన యోగం అవుతాయి. భగవంతుడికి దూరంగా ఉండే మనసును.. ఆ స్వామి చెంతకు చేర్చే ప్రక్రియే యోగం. సమస్త ప్రాణులూ అనుకునే 'నేను'.. నిజానికి భగవంతుడే. ఈ విషయాన్ని ఆ పరమాత్మే భగవద్గీతలో వివరించారు. సాకారంగా ఉండే ఆ భగవత్‌శక్తి తిరోహితం కాగానే జీవులు భగవంతుని దగ్గరకు చేరుతున్నారు. తైత్తిరీయ ఉపనిషత్తు కూడా..

*యతోవా ఇమాని భూతాని జాయంతే*
*యేన జాతాని జీవన్తి యత్ ప్రయన్త్యభి*

సంవశంతీతి తద్విజిజ్ఞాసస్వ తత్‌బ్రహ్మేతి

దేని నుంచి సమస్త జీవులూ పుడుతున్నాయో, పుట్టినవి దేని చేత జీవిస్తున్నాయో, నశించినప్పుడు దేన్ని చేరుతున్నాయో అదే బ్రహ్మ అని చెప్పింది. 'ఎవ్వనిచే జనించు.. జగమెవ్వనిలోపలనుండు లీనమై..' అని ఆంధ్ర మహాభాగవతంలో బమ్మెర పోతానామాత్యులవారు ఆ సర్వాంతర్యామిని అద్భుతంగా వర్ణించారు. అలాంటి సర్వాంతర్యామిని చేరాలంటే.. ఆ శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన గీతోపదేశ సారాన్ని తనివితీరా గ్రోలి, ఆయన కృపకు పాత్రులు కావాలి. గీతామృత సారమే ధర్మఘంటారవళి అని భగవంతుని ధర్మ సందేశం.

*శ్రీకృష్ణశ్శరణం మమ.. ఓం నమో భగవతే వాసుదేవాయ*

**- పి.వి.సీతారామమూర్తి, 9490386015**

# అరుచుకున్న ఐఏఎస్‌లు

## సచివాలయంలోని చాంబర్‌లో సీనియర్ అధికారుల వాగ్వాదం

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ సీనియర్ ఐఏఎస్ అధికారులు! వారి వారి స్థాయిల్లో ఇద్దరూ ప్రముఖులే! నాలుగురోజుల క్రితం ఒక సాయంత్రం వారు గొడవపడ్డారు. మామూలుగా కాదు, కార్యాలయం గోడలు దద్దరిల్లేలా అరుచుకున్నారు. అందులో ఒకరు ముక్కుసూటిగా వెళ్తారని పేరున్న అధికారి. మరొకరు ముఖ్య పార్టీకి అనుకూలంగా వెళ్తారని పేరున్న అధికారి. సీన్ కట్ చేస్తే ఈ ఇద్దరి గొడవకూ ఒక కారణం ఉంది. ప్రభుత్వం మారిన దరిమిలా అందరు అధికారులకు వారి వారి శాఖలు మారాయి. ముక్కుసూటి అధికారి గత ప్రభుత్వం హయాంలో ఒక శాఖలో పనిచేసేవారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఆ అధికారిని ఇంకో శాఖకు బదిలీ చేశారు. మరో శాఖ నుంచి ఓ అధికారి ఈ ముక్కుసూటి అధికారి శాఖకు వచ్చారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పాత ప్రాజెక్టుల తవ్వకాల్లో భాగంగా వెలుగుచూస్తున్న విషయాలకు సంబంధించి...ఈ ఇద్దరు సీనియర్ల మధ్య మాటామాటా పెరిగింది. వివాదమంతా అప్పట్లో ముక్కుసూటి అధికారి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఒక ప్రాజెక్టు గురించేనని సమాచారం. సాధారణంగా ఒక ఐఏఎస్ అధికారిని కలవడానికి మరో ఐఏఎస్ అధికారి, ఆయన చాంబర్ వరకు వచ్చారంటేనే, ఏవో కీలకమైన అంశాలు ఉండుంటాయని భావిస్తారు. సిబ్బంది కూడా ఇలాంటి సమావేశాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. కానీ, ఈ ఇద్దరు అధికారుల సమావేశం తీరుకు సిబ్బందే బిత్తరపోయారు. చాంబర్‌లో మాటల పరిధి దాటి వారు అరుచుకున్నారు, కేకలేసుకున్నారు. సీనియర్ అధికారులిద్దరూ ఈ స్థాయిలో మాటలతో విరుచుకుపడడం ఉద్యోగుల్లో విస్మయం కలిగిస్తోంది. సచివాలయంలో ఇప్పుడిదే తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# టీటీడీలో కొలువులు

## భర్తీకి 200 పోస్టులు సిద్ధం: ఈవో



తిరుమల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): టీటీడీలో జూనియర్ అసిస్టెంట్ కన్నా పైస్థాయి ఉద్యోగాల భర్తీకి నెలాఖరులోగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. టీటీడీలో దాదాపు 200 ఖాళీ పోస్టులను గుర్తించామన్నారు. జూనియర్ అసిస్టెంట్ కిందిస్థాయి ఉద్యోగాల నియామకానికి సంబంధించి జిల్లా వాసులకు 75% రిజర్వేషన్ కల్పించాలన్న బోర్డు ఆమోదాన్ని ప్రభుత్వానికి నివేదించినట్టు చెప్పారు. టీటీడీ అధికారుల వినియోగానికి 45 ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేసేందుకు టెండర్లను ఆహ్వానించామన్నారు. జనవరి 6, 7 తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి భక్తుల రద్దీకి దీటుగా ఏర్పాట్లు చేయనున్నట్టు చెప్పారు. డిసెంబరు 30, 31, జనవరి 1న, వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జనవరి 4 నుంచి 7వ తేది వరకు దాతలకు ప్రత్యేక దర్శనాలు, వసతి రద్దు చేసినట్టు తెలిపారు. కాగా, ఈ నెల 26న సూర్యగ్రహణం సందర్భంగా 13 గంటల పాటు శ్రీవారి ఆలయం, అన్నప్రసాద తయారీ కేంద్రాలను మూసివేస్తున్నట్లు సింఘాల్ చెప్పారు. 25, 26 తేదీల్లో తిరుమల ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. దివ్యదర్శనం భక్తులకు ఇచ్చే ఉచిత లడ్డూను కొనసాగిస్తామన్నారు. అమరావతిలో శ్రీ వారి ఆలయ నిర్మాణం ఫస్ట్‌ఫేజ్ పూర్తయిన తర్వాతే రెండో విడతకు టెండర్లు ఖరారు చేస్తామని తెలిపారు. శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు పది రోజుల పాటు తెరిచివుంచే విషయం బోర్డు నిర్ణయిస్తుందన్నారు. ఆగమ సలహామండలి అనుమతితోనే కపిలతీర్థంలో ప్రైవేటు యాగాలకు అంగీకరించినట్లు తెలిపారు. కాగా, గత 8 నెలల్లో హుండీ ద్వారా రూ.777.78 కోట్ల ఆదాయం లభించిందని చెప్పారు. 803 కిలోల బంగారం, 3,852 కిలోల వెండి కూడా సమకూరిందన్నారు.

## ఆ మూడు సేవలకు బ్రేక్?

తిరుమల, డిసెంబరు 6: తిరుమల ఆలయంలో శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామి బింబ పరిరక్షణ నిమిత్తం పలు ఆర్జితసేవలను రద్దు చేయబోతున్నారా అనే అంశంపై కొంత స్పష్టత వచ్చింది. ఉత్సవమూర్తులు అరిగిపోతున్న కారణంగా స్నపన తిరుమంజనం నిర్వహించే నిత్యసేవ వసంతోత్సవం, వారసేవలు విశేషపూజ, సహస్ర కలశాభిషేకం అర్జిత సేవలను రద్దు చేస్తారనే వార్తలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఉత్సవమూర్తుల బింబ పరిరక్షణకు ఆగమ సలహామండలి ఈ సూచన చేసిందని విపరీతమైన ప్రచారం జరిగింది. అయితే అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదని టీటీడీ తెలిపింది. కాగా, ప్రతినెలా మొదటి శుక్రవారం జరిగే డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో 3నెలల ముందు ఆన్‌లైన్ ఆర్జిత సేవల కోటాను విడుదల చేయటం ఆనవాయితీ. శుక్రవారం ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత 2020 మార్చి కోటాను టీటీడీ విడుదల చేసింది. దానిలో వసంతోత్సవం, విశేషపూజ సేవల ప్రస్తావన లేకపోవడంతో ఆ మూడు ఆర్జిత సేవలను రద్దుచేసే నిర్ణయం దాదాపు ఖరారైనట్లేనని ప్రచారం జరుగుతోంది. అయితే సేవల రద్దు విషయంలో ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. కాగా, మార్చి నెలకు సంబంధించి మొత్తం 52,748 ఆర్జిత సేవాటికెట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

## 'ఆంధ్రజ్యోతి' జర్నలిస్టు హత్యపై పీసీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబరులో జరిగిన 'ఆంధ్రజ్యోతి' జర్నలిస్టు హత్య సంఘటనపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేపట్టిందని కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ స్పష్టం చేశారు. లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని నాని అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి శుక్రవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు జర్నలిస్టు సంక్షేమ పథకం కింద నష్టపరిహారం అందిస్తున్నామని ఆయన వివరించారు.

## టాప్-10 పోలీస్ స్టేషన్లలో ఏపీకి దక్కని చోటు

న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అత్యుత్తమ సేవలందించిన టాప్-10 పోలీస్ స్టేషన్ల జాబితాలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్క స్టేషన్‌కు కూడా చోటు దక్కలేదు. ఈ జాబితాల్లో అండమాన్ నికోబార్, గుజరాత్, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. కాగా.. తెలంగాణలోని కరీంనగర్ జిల్లా చొప్పదండి (ఎం) పోలీస్ స్టేషన్‌కు 8వ ర్యాంకు దక్కింది. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ జిల్లా ఏజేకే బుర్హాన్‌పూర్ స్టేషన్‌కు 3, షెయోపూర్ జిల్లా భార్గవ స్టేషన్‌కు 10వ స్థానం దక్కడం విశేషం. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ క్షేత్రస్థాయి వాస్తవిక సమాచారం ఆధారంగా ఒక సర్వే నిర్వహించి దేశవ్యాప్తంగా 10 అత్యుత్తమ పోలీస్ స్టేషన్లను ఎంపిక చేసింది.

# లోకం తీరు




### చలికాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కర్నూలు | 30.2 | 19.3 |
| ఒంగోలు | 29.8 | 21.7 |
| గుంటూరు | 29.6 | 19.5 |
| విజయవాడ | 29.3 | 20.4 |
| హైదరాబాద్ | 26.6 | 17.6 |

### పెరిగిన చలి

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర, ఈశాన్య దిశ నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. దీంతో ఒడిశా దానికి ఆనుకుని ఉత్తర కోస్తాలో చలి తీవ్రత పెరిగింది. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో చలి ఎక్కువగా ఉంది. అనేకచోట్ల మంచు కురుస్తోంది. రాయలసీమలో కూడా పలుచోట్ల చలి తీవ్రత నెలకొంది. శుక్రవారం విశాఖలో 19 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో ఉత్తర కోస్తాలో చలి పెరిగి రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.



### ప్రస్తుత చట్టాలు చాలవు

దిశ ఉదంతం మన ఆడపడుచుల రక్షణకు ప్రస్తుతం ఉన్న చట్టాలు సరిపోవని హెచ్చరిస్తోంది. రాత్రివేళ నలుగురు ముష్కరుల మధ్య దిశ ఎంత నరకాన్ని చూసిందో తలుచుకుంటేనే ఆవేశం, ఆక్రోశం, ఆవేదనతో శరీరం ఉడికిపోతోంది. జాతి యావత్తూ తక్షణ న్యాయం కోరుకోవడానికి ఈ ఆవేదనే కారణం. మరే బిడ్డకూ ఇటువంటి పరిస్థితి రాకుండా, ఆడపిల్ల వైపు వక్రబుద్ధితో చూడాలంటేనే భయపడేంత కఠినమైన చట్టాలు రావాలి.

- పవన్ కల్యాణ్, జనసేన అధ్యక్షుడు



### ప్లీజ్.. రెండు బెత్తం దెబ్బలు

'దిశకు న్యాయం చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, పోలీసులకు థ్యాంక్స్. ఇలాగే నాతోపాటు పలువురు మహిళలను మోసం చేసిన కొంతమంది సినీ అలియాస్ రాజకీయ నాయకులను శిక్షిస్తారని భావిస్తున్నాను. ప్లీజ్.. రెండు బెత్తం దెబ్బలు'

- పూనమ్ కౌర్, సినీనటి

(అయితే ఈ ట్వీట్‌ను కొద్దిసేపటికే పూనమ్ తొలగించారు)



### వ్యాయామంతో.. మెదడుకు అదనపు ఆక్సిజన్

వాషింగ్టన్, డిసెంబరు 6 : మెదడుకు ఆక్సిజన్ లభ్యత పెరగాలంటే వ్యాయామం చేయాలని అమెరికాలోని పెన్ న్యూరోసైన్స్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో ఈవిషయం వెల్లడైందన్నారు. వ్యాయామంతో ఉశ్వాసనిశ్వాసాల రేటు పెరుగుతుంది. అయితే దీనికి అనుగుణంగా శరీరంలో రక్తప్రసరణ, నాడీకణాల చర్యల రేటూ పెరుగుతుంది. ఈ ప్రభావాల ఫలితంగా రక్తం ద్వారా ఎలుకల మెదడుకు అందే ఆక్సిజన్ మోతాదు కూడా గణనీయంగా పెరిగిందని అధ్యయనంలో గుర్తించారు.

### భావోద్వేగాలను పసిగట్టే రోబో

**వ్యోమగాముల కోసం ఐఎస్ఎస్‌కు పయనం**

వాషింగ్టన్, డిసెంబరు 6: ఈ రోబో మనిషి మాట తీరుని బట్టి అతడి భావోద్వేగాలను గుర్తిస్తుంది. అంతరిక్ష పరిశోధనల్లో వ్యోమగాముల మధ్య విభేదాలొచ్చి, ఎవరైనా ఒంటరిగా ఉంటే ఇది గుర్తించగలదు. వారితో మాట్లాడగలదు. గోళాకారంలో ఉన్న ఈ రోబోకు 'సైమన్ 2'గా పేరు పెట్టారు. ఇందులో మైక్రోఫోన్లు, కెమెరాలతో పాటు భావోద్వేగాలను గుర్తించే సాఫ్ట్‌వేర్ ఉంది. గురువారం అమెరికాలోని ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్. 'ఫాల్కన్ 9' రాకెట్ ప్రయోగాన్ని చేపట్టింది. దీని ద్వారా 'సైమన్ 2'ను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపారు.

# ఇది మనదేశపు నోబెల్

## పరిశోధనలకు రూ.3 కోట్లు ఇవ్వడం దేశంలోనే ప్రథమం



విదిత వైద్యకు కోటి రూపాయల చెక్ అందజేస్తున్న డాక్టర్ సి.నాగేశ్వరరావు, డాక్టర్ సుధ

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర పరిశోధనల కోసం రూ.3 కోట్ల అవార్డు ఇవ్వడం దేశంలోనే తొలిసారి అని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ శేఖర్ సి.మండే, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పద్మావతి వెంకటేశ్వర ఫౌండేషన్ (పీవీఎఫ్) ఇస్తున్న గ్రాంట్‌ను భారతదేశపు నోబెల్ (నోబెల్ ప్రైజ్ ఆఫ్ ది ఈస్ట్)గా అభివర్ణించారు. 'చిన్న పిల్లలపై ఒత్తిడి-మెదడుపై దుష్పరిణామం' అన్న అంశంపై పరిశోధన చేస్తున్న టీఐఎఫ్ఆర్ ప్రొఫెసర్ విదిత వైద్యకు ఎంవీఎఫ్ వ్యవస్థాపకులు నాగేశ్వర్‌రావు, సుధ, మండే తదితరులు గ్రాంట్‌ను అందించారు. ఈమెకు ఏడాదికి రూ.కోటి చొప్పున మూడేళ్లపాటు మూడుకోట్లు అందిస్తారు. వచ్చే ఏడాది నుంచి వరుసగా రెండేళ్లపాటు కొత్త విజేతలను కూడా ఎంపిక చేస్తారు. వారికీ ఏటా రూ.కోటి చొప్పున మూడేళ్లపాటు పరిశోధన కోసం గ్రాంటు ఇస్తారు. తొలి విడతగా రూ.కోటి చెక్‌ను శుక్రవారం విజయవాడలో విదిత వైద్యకు అందించారు. ఈ గ్రాంట్‌కోసం 110 దరఖాస్తులు వచ్చాయని నాగేశ్వరరావు తెలిపారు. సీఎస్ఐఆర్ కూడా ప్రజా మద్దతుతోనే ఏర్పడిందని, మానవాళికి ఉపయోగపడే ఎన్నో ఆవిష్కరణలు చేసిందని శేఖర్ సి.మండే తెలిపారు. అమెరికాలాంటి దేశాల్లో ప్రతి 10 లక్షల మందిలో 2 వేలమంది శాస్త్రవేత్తలు ఉన్నారన్నారు. చైనాలో 20 మంది ఉండగా... భారత్‌లో ఐదుగురే ఉన్నారని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రిసెర్చ్ డైరెక్టర్ బాలసుబ్రమణియన్ తెలిపారు. ఆ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ గుళ్లపల్లి ఎన్.రావు, ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్ ఎల్.ఎస్.శశిధర ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హెల్త్‌కార్డులపై అందని వైద్యం: బొప్పరాజు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులపై వైద్యం అందడం లేదని ఏపీ జేఏసీ(అమరావతి) చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరేళ్లుగా ఈ సమస్య ఇలాగే కొనసాగుతోందన్నారు. ప్రతి ఉద్యోగీ తన హోదా మేరకు రూ.90, రూ.120 వంతున ప్రీమియం చెల్లిస్తున్నా రూ.150 కోట్ల వరకూ బకాయిలు పేరుకుపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్యం చేయడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వంలోని ఉన్నతాధికారులను కలిస్తే సమస్యను పరిష్కరించకపోగా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. తమ సమస్యను విన్నవించుకుందామంటే ముఖ్యమంత్రిని కలిసే అవకాశం కలగడం లేదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్‌కార్డుల సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.



## రంగుల మైకం!

ఇప్పుడందరూ రంగుల మైకంలో పడినట్టున్నారు. బడి, గుడి, కార్యాలయం, శ్మశానాలు.. అన్నిటికీ రంగులు పులిమేస్తున్నారు. ప్రభుత్వం, పార్టీ, ప్రైవేటు కార్యక్రమం అనే తేడా లేకుండా రంగుల లోకంలో విహరిస్తున్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు కందుకూరులో ప్రారంభమైంది. విద్యాలయంలో జరుగుతున్నది ప్రభుత్వ కార్యక్రమం అయినా.. సదస్సు వేదికను వైసీపీ జెండా రంగులతో ముస్తాబు చేసి, అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు.

- కందుకూరు

# 'ఉల్లి'... సొమ్మసిల్లి!

- పోలీసుల సమక్షంలో అమ్మకాలు
- అయినా ఆగని తోపులాటలు

విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉల్లి రేటు రోజు రోజుకూ పెరిగిపోతుండటం.. రైతు బజార్ల వద్ద జనం క్యూలు పెరిగిపోయి తోపులాటలు చోటుచేసుకుంటున్న పరిస్థితుల్లో విశాఖలో అన్నిచోట్ల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం వరకు ఒకరిద్దరు కానిస్టేబుళ్లను మాత్రమే పంపిన అధికారులు.. శుక్రవారం ఒక్కో బజారుకు నలుగురైదుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు ఎస్ఐలను పంపించి ఉల్లి పంపిణీ సజావుగా జరిగేలా చేశారు. అయినాతోపులాటలు ఆగలేదు. ఈ తోపులాటలో ఎంవీపీ రైతు బజారు వద్ద క్యూలో నిలుచున్న ఓ వృద్ధురాలు సొమ్మసిల్లి పడిపోయింది.కాగా, అరకులోయలో శుక్రవారం జరిగిన వారపు సంతలో కిలో ఉల్లిని రూ.200 అమ్మారు. కాగా, ఉల్లి ధర రోజురోజుకూ రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్తుండడంతో దుకాణాల్లో ఉల్లి కనిపించడం లేదు. ఇప్పటికే రిటైల్ ధర కిలో రూ.160 నుంచి రూ.180 మధ్య పలుకుతోంది. ఈ ధర మరింత పెరుగుతుందన్న ఉద్దేశంతో చిరువ్యాపారులు ఉల్లిపాయలు లేవంటున్నారు. గ్రామీణ ప్రాంత కిరాణా వ్యాపారులు అమ్మకాలు నిలిపివేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో డిమాండ్‌గా అమ్ముతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో 60% దుకాణాల్లో స్టాక్ లేదని చెప్తున్నారు. కొన్నిదుకాణాల్లో సన్న చిన్నపాయలు పావు కిలో 40కి అమ్ముతున్నారు.



క్యూలైనులో సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలికి కానిస్టేబుల్ సపర్యలు



విశాఖ ఎంవీపీ రైతుబజార్‌లో ఉల్లి కోసం పోటెత్తిన జనం

### ఉల్లి సేకరణకు రూ.20 కోట్లు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో రాయితీపై పంపిణీ చేస్తున్న ఉల్లిపాయల సేకరణకు ప్రభుత్వం శుక్రవారం రూ.20 కోట్లు విడుదల చేసింది. రైతులు లేదా ఉత్పత్తిదారుల సంఘాల నుంచి ఉల్లిపాయలు కొనుగోలు చేసేందుకు మార్కెటింగ్ శాఖకు పరిపాలన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు ఇచ్చారు. మార్కెట్ స్థిరీకరణ నిధి నుంచి ఈ నిధును కేటాయించారు.

### 'పర్యావరణ' డైరెక్టర్ల నియామకం

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యావరణ సంస్థకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా, డైరెక్టర్లుగా కాలుష్య నియంత్రణ సంస్థ చైర్మన్, సభ్యకార్యదర్శి, రవాణా, పరిశ్రమల శాఖల కమిషనర్లు, గృహ నిర్మాణ, పర్యావరణ నిర్వహణ సంస్థల ఎండీలను నియమించారు. పారిశ్రామిక, ఇతర వ్యర్థాల సేకరణ, రవాణా, నిర్వహణ, శుద్ధి వంటి కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.

# 'డీలరు కార్డుల' దందా!

- పాత రేషన్‌కార్డుకు జతగా సొంతంగా పేపర్ కార్డు ముద్రణ
- కొత్త ఏడాది వస్తుండడంతో కొందరు రేషన్ డీలర్ల ఎత్తుగడ
- రూ.2 ఖర్చుతో రూ.40వరకు వసూలు
- దేవుడి ఫొటోలతో ఆకర్షించే ఎత్తుగడ

కాకినాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం సమీపిస్తుండడంతో కొందరు రేషన్ డీలర్లు కొత్త ఎత్తుగడ వేశారు. ప్రభుత్వం ఎప్పుడో ఇచ్చిన అసలు కార్డుకు జతగా సొంతంగా పేపర్‌కార్డు ముద్రించి బలవంతంగా అంటగడుతున్నారు. ఇందుకు ఒక్కో కార్డుదారుడి నుంచి రూ.40 నుంచి రూ.60 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇలా డీలర్ల దందా తూర్పుగోదావరి జిల్లాలో ఊపందుకుంది. జిల్లాలో మొత్తం 16.48 లక్షల రేషన్ కార్డులున్నాయి. సాధారణంగా రేషన్‌కార్డులో 12 గడులు ఉంటాయి. వినియోగదారులు తీసుకునే రేషన్ మేరకు ప్రతి నెలా ఆయా గడుల్లో నమోదు చేస్తారు. అయితే ఏడాది ముగుస్తుండడంతో ఇక పాతకార్డులో నమోదు అవకాశం లేదు. ఇదే సాకుగా డీలర్లు సొంతంగా పేపర్ కార్డులు ముంద్రించారు. ఒక్కో కార్డు ఖరీదు రెండు రూపాయలకు మించదు. కానీ.. కార్డు దారుల నుంచి రూ.40 చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక్కో డీలరు పరిధిలో కనీసం 500 కార్డులుండగా, ఇలా రూ.20 వేల వరకు పిండేస్తున్నారు. ప్రభుత్వం మారడంతో త్వరలో కొత్త కార్డులు వస్తాయని, అయితే, తమ వద్ద పేపర్ కార్డు తీసుకోకపోతే అసలు కార్డు రాకుండా పోయే ప్రమాదం ఉందని గ్రామాల్లో రేషన్‌దారులను తెలివిగా మభ్యపెట్టి డబ్బులు గుంజుతున్నట్లు సమాచారం. వాస్తవానికి ప్రస్తుతం ఈపోస్ విధానంలో వేలిముద్ర వేస్తే రేషన్ వచ్చేస్తుంది. దీనికి పేపర్ కార్డు అవసరం లేకపోయినా అంటడుతున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులకు విషయం తెలిసినా నోరు మెదపడం లేదు. ఇలా ముద్రిస్తోన్న కార్డులపై కొందరు డీలర్లు అత్యుత్యాహంతో రకరకాల రంగులు వేస్తుండగా, దేవుడి ఫోటోలు ప్రింట్ చేయించి కొందరు అందిస్తుండడం గమనార్హం.

# అమరావతిలో మోడల్ శ్మశాన వాటికలు!

- హిందూ, ముస్లిం, క్రైస్తవులకు ఒకే ప్రాంగణంలో.. వేర్వేరు ప్రహరీలతో..
- మతపెద్దల అభిప్రాయాలకు అనుగుణంగా సీఆర్డీయే చర్యలు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మోడల్ శ్మశానవాటికల ఏర్పాటుపై సీఆర్డీయే దృష్టిసారించింది. అమరావతిలోని 29 గ్రామాలకు కలిపి కొన్ని ప్రదేశాల్లో విశాల ప్రాంగణంలో శ్మశానవాటికలను ఏర్పాటు చేయాలనుకుంటోంది. అయితే ఇప్పుడు మనం చూస్తున్న మాదిరిగా ఆ మతానికోచోట, ఈ మతానికోచోట అన్నట్లుగా కాకుండా సమాజంలోని 3 ప్రధాన మతాలైన హిందూ, ముస్లిం, క్రైస్తవులకు కలిపి ఒకే ప్రాంగణంలో వీటిని నెలకొల్పదలచింది. అయితే ఒక్క చోటనే అయినప్పటికీ, కామన్ ప్రహరీ గోడే ఉన్నప్పటికీ.. ఈ మోడల్ శ్మశానవాటికల్లో ప్రతి మతస్థులకూ ప్రత్యేక గోడలతో కూడిన ప్రదేశాలను కేటాయిస్తారు! అంత్యక్రియలకు అవసరమైన సకల వసతులను సీఆర్డీయే కల్పిస్తుంది. శ్మశానాలతోపాటు వాహనాలను నిలిపే పార్కింగ్ ప్రదేశాలు, మృతదేహాలను శ్మశానాలకు చేర్చే అంతిమయాత్ర వాహనాలు కూడా కామన్‌గానే ఉండబోతున్నాయని సమాచారం! తొలి దశలో రాజధానిలోని ఏదైనా ఒక గ్రామంలో ఈ మోడల్ శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని, ఆ తర్వాత నగర విస్తరణ, పెరగబోయే జనాభాకు అనుగుణంగా అవసరమైన చోట్ల మరికొన్నింటిని అభివృద్ధి పరచాలని ఈ సంస్థ భావిస్తోంది. దీనిపై ఆయా మతాలకు చెందిన పెద్దలతో సీఆర్డీయే సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలు తీసుకుంది.

## ఉత్తరాఖండ్‌లో సైనికుడి మృతి

▸ మేలో వివాహం.. ఈ లోపే విషాదాంతం



మచిలీపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొద్ది నెలల్లో పెళ్లి పీటలెక్కాల్సిన ఓ సైనికుడు విధినిర్వహణలో హఠాన్మరణం చెందారు. ఉత్తరాఖండ్‌లో రాష్ట్రానికి చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ షేక్ హాజీ హుస్సేన్ (28) గురువారం రాత్రి మృతి చెందినట్లు అధికారుల నుంచి సమాచారం వచ్చింది. హాజీహుస్సేన్ మచిలీపట్నం జలాల్‌పేటకు చెందినవారు. తండ్రి మెహబూబ్ లారీ డ్రైవర్, తల్లి షకీలాబేగం గృహిణి. ఉత్తరాఖండ్ నీలం యూనిట్ వద్ద విధులు నిర్వహిస్తున్న హుస్సేన్ సహచర సైనికులతో కలసి నడిచి వస్తూ ఒక్కసారిగా కుప్పకూలినట్లు గురువారం మిలిటరీ అధికారుల నుంచి సమాచారం వచ్చింది. ఆ వెంటనే మృతి చెందినట్లు సమాచారం ఇచ్చారు. హాజీహుస్సేన్ భౌతిక కాయాన్ని విమానంలో గన్నవరం విమానాశ్రయానికి, అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో మచిలీపట్నం తీసుకువస్తామని మిలటరీ అధికారులు సమాచారం అందించారు. కొండచరియలు విరిగిపడ్డాయా, లేక మంచు కారణంగా తన కుమారుడు అనారోగ్యానికి గురై మరణించాడా అనే అంశంపై స్పష్టమైన సమాచారం లేదని హుస్సేన్ తండ్రి తెలిపారు. కాగా, హుస్సేన్‌కు వచ్చే ఏడాది మే 20న వివాహం జరిపేందుకు నిశ్చయించారు. ఇంతలోనే ఆయన మరణవార్త అందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు.

## హజ్ దరఖాస్తు గడువు పొడిగింపు

పీలేరు, డిసెంబరు 6: హజ్ యాత్ర దరఖాస్తుల గడువు ఈ నెల 17 వరకు పొడిగించినట్లు కేంద్ర హజ్ కమిటీ సీఈవో డాక్టర్ మసూద్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ యాత్ర దరఖాస్తుల గడువు గురువారంతో ముగియనున్న సంగతి తెలిసిందే. అయితే తగిన సంఖ్యలో దరఖాస్తులు అందకపోవడంతో గడువును పొడిగించినట్లు వివరించారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో ఆయా రాష్ట్రాల కమిటీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## 9 వరకు బార్లకు దరఖాస్తులు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త బార్ల లైసెన్సుల గడువును ఎక్సైజ్ శాఖ పొడిగించింది. షెడ్యూల్ ప్రకారం శుక్రవారంతో దరఖాస్తుల గడువు ముగియగా, దరఖాస్తులు అతి తక్కువ రావడంతో ఈ నెల 9వరకు గడువు పెంచుతూ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ వివేక్‌యాదవ్ ఓ ప్రకటన విడుదల చేశారు ఆ రోజు మధ్యాహ్నం 3గంటల వరకు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ చేసుకోవచ్చని, అదే రోజు రాత్రి 8గంటల లోపు ఎక్సైజ్ అధికారులకు చలానాలు సమర్పించాలని సూచించారు. లాటరీ మాత్రం యథావిధిగా ఈ నెల 23వ తేదీనే నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# నాడు వేస్ట్.. నేడు గ్రేట్!

కియపై మారిన వైసీపీ తీరు.. విపక్షంలో ఉండగా విమర్శలు.. భూ కుంభకోణంగా చిత్రీకరణ

▸ అది మోదీ తెచ్చారని ప్రచారం

▸ అధికారంలోకి రాగానే అంతా ఓకే

▸ వైఎస్ వల్లే సంస్థ వచ్చిందని ప్రకటన

▸ కియకు అండగా ఉంటామని హామీ

*ప్రతిపక్షంలో ఉన్నన్ని రోజులు అవినీతి, అక్రమం, అన్యాయం అని వాపోవడం!*

*అధికారంలోకి రాగానే... ఆహా, ఓహో, అద్భుతం, అంతా మా ఘనతే అని గొప్పలకుపోవడం!*

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కియ కార్ల కంపెనీ విషయంలో వైసీపీ తీరు ఇది. కియపై ఆ పార్టీ నేతలు అప్పుడు చేసిన ప్రకటనలు, ఇప్పుడు చెబుతున్న గొప్పలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన హ్యుండయ్ మాతృసంస్థ కియ. అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరున్న కార్ల బ్రాండ్ ఇది. భారత్‌లో తన ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగానే... దీనికోసం అనేక రాష్ట్రాలు పోటీపడ్డాయి. పారిశ్రామికంగా ఎంతో ముందున్న కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌ను కాదని కియ ఏపీకి రావడం వెనుక నిస్సందేహంగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఉంది. ఒక పెద్ద కార్ల కంపెనీ వస్తే దానికి అనుబంధంగా మరిన్ని సంస్థలు వస్తాయనే ఉద్దేశంతో... కియకు భారీగానే రాయితీలు ఇచ్చారు. కియ రాకతో చుట్టుపక్కల భూముల ధరలు భారీగా పెరిగాయి. ఒక మంచి అవకాశాన్ని తమిళనాడు కోల్పోయిందంటూ ఆ రాష్ట్రానికే చెందిన ఓ పారిశ్రామికవేత్త ఆక్రోశించారు. కానీ... విపక్షంలో ఉన్న వైసీపీ ఇందులో భూకుంభకోణాన్ని, అవసరానికి మించిన రాయితీలను చూసింది. స్వయంగా జగన్ 'కియ' కంపెనీ ముందు ధర్నా చేశారు. కియ కంపెనీ అనుకున్నదానికంటే ముందుగానే పూర్తికావడం, చుట్టుపక్కల పరిస్థితులు మారిపోవడంతో... ఈ ఘనత చంద్రబాబుది కాదనేలా మరో కొత్త ప్రచారం చేశారు. కియ కంపెనీ మోదీ వల్లే రాష్ట్రానికి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ నేత విజయసాయిరెడ్డి 'కియ' వేస్ట్ అనేలా ట్వీట్లు చేశారు. "కార్లు అమ్ముడుపోని కారణంగా కియ.. చైనాలో అతిపెద్ద ప్లాంటును మూసేసింది. మరి అనంతపుర్లో ఏర్పాటువుతున్న ప్లాంటు సంగతేమిటో! కమిషన్ల కక్కుర్తితో కియకు చంద్రబాబు రెండువేల కోట్ల రాయితీలిచ్చాడు. కంపెనీ ఉద్యోగుల్లో స్థానికులు వందమందికి మించి లేరు" అని విమర్శించారు. కియలో కార్లు తయారు కావడంలేదనేలా ఆరోపణలు చేశారు. జనవరి 29న కియలో తొలి కారును ఆవిష్కరించారు. అప్పుడు.. 'కియ కారు ఏపీలోనే తయారయితే ముసుగు ఎందుకు వేశారు?' అని విజయసాయి ప్రశ్నించారు.

**ఎన్నికల ముందు**

Vijayasai Reddy V
@VSReddy_MP

కార్లు అమ్ముడు పోని కారణంగా కియా మోటార్స్ చైనాలోని అతి పెద్ద ప్లాంటును మూసేసింది. మరి అనంతపూర్లో ఏర్పటవుతున్న ప్లాంట్ సంగతేమిటో? కమిషన్ల కక్కుర్తితో కియా మోటార్స్ కు చంద్రబాబు రెండు వేల కోట్ల రాయితీలిచ్చాడు. కంపెనీ ఉద్యోగుల్లో స్థానికులు వంద మందికి మించి లేరు.

**ఎన్నికల తరువాత**

YSR Congress Party
@YSRCParty

మహానేత వైయస్ఆర్ కృషితో ఏపీలో కియాను ఏర్పాటు చేసిన దక్షిణ కొరియా సంస్థ. రూ.13500 కోట్లతో కియా కార్ల పరిశ్రమ ఏర్పాటు.

**అధికారంలోకి రాగానే...**

అధికారంలోకి రాగానే 'కియ'పై వైసీపీ గళం ఒక్కసారిగా మారిపోయింది. వైఎస్ వల్లే ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిందనే కొత్త పల్లవి అందుకుంది. మరి... ఎన్నికల ప్రచారంలో 'ఏపీకి మోదీ వల్లే కియ వచ్చింది' అని జగన్ చేసిన ప్రకటన మాటేమిటి? ఈ ప్రశ్నకు మాత్రం సమాధానం చెప్పలేదు. మరోవైపు... కియ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తన తొలికారును ఆవిష్కరించినప్పుడు, స్థానిక వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహరించిన తీరు కూడా వివాదాస్పదమైంది. అందరూ కియకు అభినందనలు చెప్పగా... ఆయన మాత్రం 'కారు వచ్చింది. ఉద్యోగాలు మాత్రం రాలేదు' అని కారుపై రాసి నిరసన వ్యక్తంచేశారు. ఇక... గురువారం కియ కారు ప్లాంట్‌ను వైఎస్ జగన్ మరోమారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ మరో ట్వీట్ చేసింది. "మహానేత వైఎస్ఆర్ కృషితో ఏపీలో కియను ఏర్పాటు చేసిన దక్షిణ కొరియా సంస్థ. రూ.13,500 కోట్లతో కియ కార్ల పరిశ్రమ ఏర్పాటు" అని అంతా తమ ఘనతే అని చెప్పుకొంది. అంతకుముందు కియ విషయంలో చేసిన విమర్శలన్నింటినీ మరిచిపోయి... కంపెనీకి అండగా ఉంటామన్నారు. "ఈ భూములపై చంద్రబాబు కళ్లుపడ్డాయి. ఎవరైనా బుద్ధి, జ్ఞానం ఉన్నోడు పరిశ్రమలు పెట్టడానికి రిజర్వాయర్ కింద భూములు ఇస్తాడా? మీ భూములు పోకుండా అండగా ఉంటాం. అవసరమైతే ధర్నాలు చేస్తాం. బలవంతంగా భూములు లాక్కుంటే ప్రభుత్వం వచ్చిన తర్వాత భూములు వెనక్కు ఇప్పిస్తాం" అని హామీఇచ్చారు. మరి... ఇప్పుడు ఆయనే సీఎం హోదాలో కియను ప్రారంభించారు. సంస్థ అద్భుతమైన పనితీరును కనబర్చిందని, పూర్తి స్థాయిలో ఉత్పత్తిచేపడితే 18 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జాబ్స్ వస్తాయని చెప్పారు. మరిన్ని ప్లాంట్లు, విభాగాలు ప్రారంభించాలని, ఏటా 3 లక్షల వాహనాలు ఉత్పత్తిచేసే సామర్థ్యానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదంటూ కియ ఎదుట ఫిబ్రవరి 4న ధర్నా చేసిన జగన్... ఇప్పుడు ఆ సంగతి ప్రస్తావించనేలేదు.

హస్తినలో మన గళం

## జాతీయ రైతు కమిషన్ అవసరం

▸ రాజ్యసభలో వైసీపీ నేత విజయసాయి ప్రైవేటు బిల్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశంలో రైతుల సంక్షేమంతోపాటు, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు జాతీయస్థాయిలో రైతు కమిషన్ ఏర్పాటు చేయాలని రాజ్యసభలో వైసీపీ నేత విజయసాయిరెడ్డి కోరారు. ఈ మేరకు రాజ్యాంగ సవరణ కోరుతూ శుక్రవారం ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై ఆయన మాట్లాడుతూ రైతు ప్రతినిధులతో ఈ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, రైతుల సంక్షేమం, సంరక్షణ బాధ్యతలపై చేసే సిఫారసులను అమలు చేసేలా పర్యవేక్షించే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుందని తెలిపారు.

▸ **లాయర్ల సామాజిక భద్రతకు..**

కోర్టులలో ప్రాక్టీసు చేసే న్యాయవాదుల సామాజిక భద్రత కోసం కేంద్రం తగిన పథకాలకు రూపకల్పన చేయడంతోపాటు న్యాయవాదుల సామాజిక భద్రతా నిధిని నెలకొల్పేందుకు వీలు కల్పించేలా 1961 నాటి అడ్వకేట్స్ చట్టాన్ని సవరించాలని కోరుతూ విజయసాయిరెడ్డి మరో ప్రైవేటు మెంబరు బిల్లును ప్రవేశపెట్టారు.

▸ **మహిళల భద్రతకు..**

భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ) చట్టాన్ని సవరించే, మహిళలకు మరింత భద్రత కల్పించే విషయమై మరో ప్రైవేటు మెంబరు బిల్లును కూడా విజయసాయి ప్రవేశపెట్టారు. మహిళల నుంచి బంగారు గొలుసులు, ఆభరణాలు, పర్సులు ఇతర విలువైన వస్తువులను దొంగిలించే చర్యలను ఐపీసీలో స్పష్టమైన నేరంగా నిర్వచిస్తూ, ఈ నేరానికి పాల్పడిన వారికి ఐదు నుంచి పదేళ్లపాటు కఠిన జైలు శిక్ష విధించేలా 1960 నాటి ఐపీసీ చట్టాన్ని సవరించాలని కోరారు.


REPCO BANK
(Govt. of India Enterprise)
HEAD OFFICE : Repco Tower, No.33, North Usman Road, T.Nagar, Chennai-600 017. Phone: 044 - 2834 0715
RECRUITMENT
Repco Bank invites applications from eligible candidates for the post of
SUB STAFF/PEON (Temporary / Casual basis)
For further details, Visit career page of our website
www.repcobank.com & www.repcobank.co.in



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
నీటి వనరుల శాఖ
టెండరు సహిత వేలం (రివర్స్ టెండరింగ్) ప్రకటన
నం.1SE/2019-20, తేది: 05.12.2019
పని పేరు:గుంటూరు జిల్లాలో లీడింగ్ ఛానల్ మరియు డిస్ట్రిబ్యూటరీ సిస్టం కలుపుకొని కి.మీ.0.000 నుండి 47.000 వరకు గుంటూరు ఛానల్ అధునీకరణ. షెడ్యూల్ అమ్మకం ప్రారంభ తేది: 09.12.2019న ఉ.11.గం.కు, షెడ్యూల్ ముగింపు తేది: 23.12.2019న సా.4.00గం.కు, బిడ్ దాఖలు ముగింపు తేది: 23.12.2019న సా.5.00గం.కు, ప్రీ బిడ్ సమావేశం: 19.12.2019న మ.2.00గం.కు, ప్రీ క్వాలిఫికేషన్ స్టేజ్ ఓపెనింగ్ తేది: 24.12.2019న ఉ.11.00గం.కు, ధర బిడ్ ఓపెనింగ్ తేది: 26.12.2019న ఉ.11గం.కు, సాంకేతిక బిడ్ తెరుచు తేది: 30.12.2019న ఉ.11గం.కు తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును ఫోన్: 0863-2234554.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, నీటిపారుదల సర్కిల్, గుంటూరు
DIPR 1233/CL/ADVT/1/1/2019-20, Dt: 06.12.2019



MUNICIPAL CORPORATION - TIRUPATI

The Commissioner, Municipal Corporation, Tirupati invites Tender on e-Procurement platform from the "eligible contractors" for the following works.

| IFB No. | Name of the Work | No. of works | Est. Amount Rs. in Lakhs |
|---|---|---|---|
| IFB No:145 to 170/ TPT/ M.E/2019-20 to, Dt: 12-2019 | CC Road and dividers, CC Drain, Furniture and Footpaths HDPE Pipelines & others | 26 Works | 165.12 |
| Total | | 26 Works | 165.12 |

"For particulars please contact Municipal Engineer during Office working hours (or) see e-Procurement market place: https://tender.apeprocurement.gov.in.
Sd/- Commissioner, Municipal Commissioner.




## బ్యాంకుకు తాళం వేసిన రైతులు

కోవెలకుంట్ల, డిసెంబరు 6: కర్నూలు జిల్లా కోవెలకుంట్లలో శుక్రవారం రైతులు స్టేట్ బ్యాంకుకు తాళం వేసి ధర్నా చేశారు. కోవెలకుంట్ల మండలానికి చెందిన పలువురు రైతులు శనగలపైనా, బంగారం తాకట్టు పెట్టి స్టేట్‌బ్యాంకులో రుణాలు పొందారు. రుణాల గడువు ముగియడంతో బ్యాంక్ అధికారులు ఐదుగురు రైతుల బంగారాన్ని వేలంవేసి వారి అప్పుకు జమ చేశారు. విషయం తెలుసుకున్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బంగారాన్ని వేలం వేయడం ఏమిటని బ్యాంకును ముట్టడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా చేశారు.

▸ **ఇద్దరు కౌలు రైతుల ఆత్మహత్య**

గూడూరు/మంగళగిరి క్రైమ్, డిసెంబరు 6: అప్పుల బాధతో ఇద్దరు కౌలు రైతులు శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన మునిస్వామి (52) తనకున్న నాలుగెకరాలతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. గడిచిన మూడేళ్లలో పంటలు చేతికి రాకపోవడంతో రూ.6.50 లక్షల అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చే మార్గంలేక, తీవ్ర మనోవేదనకు గురై గురువారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రుకు చెందిన కౌలు రైతు కొండూరు ఫ్రాన్సిస్ (46) కొన్నేళ్లుగా గ్రామంలోని పూలతోటలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అయితే పూల దిగుబడి లేకపోవడంతో పాటు ధరలు కూడా అంతంతమాత్రంగా ఉండటంతో రూ.5లక్షలు అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిడి పెరగడంతో శుక్రవారం పొలంలోనే పురుగులమందు తాగాడు.

▸ **వివేకా కేసులో నాలుగో రోజూ సిట్ విచారణ**

కడప (క్రైం), డిసెంబరు 6: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సిట్ విచారణ కొనసాగుతోంది. శుక్రవారం దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కొమ్మా పరమేశ్వరరెడ్డిలను అధికారులు విచారించారు. వివేకా హత్య కేసులో హంతకులను పట్టుకునేందుకు ఎస్పీ అన్బురాజన్ నేతృత్వంలో సిట్ విచారణ వేగవంతం చేసింది.

## భూసేకరణ పూర్తయితే వేగంగా ప్రాజెక్టులు: గోయల్

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టులను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలంటే భూసేకరణ, అటవీ అనుమతులు అవసరం ఉంటాయని, ఈ ప్రక్రియ పూర్తయితే నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.52,686 కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా 31 రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు టి.సుబ్బిరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

▸ **ఏపీలో తగ్గుతున్న పత్తి ఉత్పాదకత**

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి ఉత్పాదకత క్రమంగా తగ్గుతోంది. 2015-16లో హెక్టారుకు 606.23 కిలోల పత్తి దిగుబడిరాగా, 2018-19 నాటికి 396.94 కిలోలకు తగ్గిందని కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతీ ఇరానీ తెలిపారు. లోక్‌సభలో టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి శుక్రవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

▸ **50 ప్రాజెక్టులకు పర్యావరణ ఆమోదం**

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యావరణానికి సంబంధించి 10 ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని, మరో 40 ప్రాజెక్టులకు విధివిధానాలు ఖరారు చేశామని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో వెల్లడించారు. లోక్‌సభలో వైసీపీ ఎంపీ శ్రీనివాసులు రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి శుక్రవారం సమాధానం ఇచ్చారు.

▸ **ఏపీకి ఐఏవై ఇళ్ల నిధులివ్వలేదు : కేంద్రం**

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇందిరా ఆవాస్ యోజన(ఐఏవై) గృహనిర్మాణ పథకం కింద ఏపీకి 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంతవరకూ నిధులు విడుదల చేయలేదని కేంద్రం స్పష్టం చేసింది. శుక్రవారం రాజ్యసభలో బీజేపీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ లిఖితపూర్వకంగా ఈ మేరకు జవాబిచ్చారు.

## ఒక్కటైన ఆంధ్రా అబ్బాయి... లండన్ అమ్మాయి



ముండ్లమూరు, డిసెంబరు 6: ఆంధ్రా అబ్బాయి లండన్ అమ్మాయి ఒక్కటయ్యారు. ఆ వేడుక లండన్‌లో పూర్తికాగా, వివాహ విందు మాత్రం ప్రకాశం జిల్లా ముండ్లమూరులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన తాతపూడి దేవదానం, గ్రేసమ్మల రెండో కుమారుడు థామస్ లండన్‌కు చెందిన అమ్మాయి శారారూత్ ఒక్కటయ్యారు. థామస్ పీహెచ్‌డీ చేసేందుకు లండన్‌కు వెళ్లగా అక్కడ డాక్టరేట్ చేస్తున్న శారారూత్‌తో పరిచయమైంది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోగా ఇరు వర్గాల పెద్దలూ అంగీకరించడంతో పెళ్లి చేసుకున్నారు.

# దైవ దర్శనానికి వెళుతూ..

▸ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

▸ తిరుమలకు వెళుతుండగా ఘటన

▸ వ్యాన్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 6: పుట్టువెంట్రుకలు తీయించేందుకు తిరుమల వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్రానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వికారాబాద్ కంకల్ ప్రాంతానికి చెందిన వాణి, శ్రీనివాస్ తమ కుమారుడు ఆశిష్‌కు పుట్టు వెంట్రుకలు తీయించేందుకు బంధువులతో కలిసి తిరుమలకు మారుతి వ్యాన్‌లో బయలుదేరారు. కడప జిల్లా రైల్వేకోడూరు మండలం రాఘవరాజపురం మలుపు వద్ద కడప-చెన్నై ప్రధాన రహదారిలో శుక్రవారం తెల్లవారుజామున వీరు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజాత (45), ప్రశాంత్ (24), డ్రైవర్ బాలరాజు (25) లు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రియాంక, శ్రీనివాసులు, వాణి, రమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రైల్వేకోడూరు పోలీసులు తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆశిష్‌కు సురక్షితంగా బయటపడ్డాడు. వ్యాన్‌లో ఇరుక్కున్న వారి ఆర్తనాదాలు విని ఆ మార్గంలో వెళుతున్న యువకులు.. స్థానికులు, పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యాన్‌లో ఇరుక్కున్న వారిని బయటకు తీశారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను రద్దు చేయాలి




ఏపీపీఎస్సీ కార్యాలయం వద్ద నిరుద్యోగుల నిరసన

▸ ఏపీపీఎస్సీ కార్యాలయం ఎదుట అభ్యర్థుల ఆందోళన

విజయవాడ, డిసెంబరు 6: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మే 26వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశ్నాపత్రంలో తప్పులున్నాయని, ఆ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేశారు. బందరురోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయం ఎదుట శుక్రవారం అభ్యర్థులు ఆందోళన చేశారు. పరీక్ష రాసిన షేక్ షానవాజ్, శ్రీనివాస్ మాట్లాడుతూ మే 26న నిర్వహించిన పరీక్షలో 75 అనువాద దోషాలు, 12 ప్రశ్నలకు ఫైనల్ కీలో తప్పు సమాధానాలున్నాయన్నారు. సమాధానాలు సరిగ్గా లేవని 9 ప్రశ్నలను తొలగించారని పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో ఏముందో ఏపీపీఎస్సీ కమిషన్‌కు తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. పరీక్షలో జరిగిన లోపాలను పట్టించుకోకుండా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## 19 డిమాండ్లను పరిష్కరించాలి

▸ సీఎస్‌కు ఏపీజేఏసీ నేతల విజ్ఞప్తి

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలకు సంబంధించి 19 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీలం సాహ్నికు ఏపీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, సెక్రటరీ జనరల్ సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సచివాలయంలో సీఎస్‌ను కలిసి ఇప్పటికే ప్రభుత్వానికి తమ డిమాండ్లపై నివేదించామని వివరించారు. 11వ పీఆర్సీ నివేదికను తక్షణమే తెప్పించుకుని 55 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలని, మూడు డీఏలు చెల్లించాలని, సీపీఎస్‌పై కాలపయాపన కమిటీలు వేయకుండా రద్దు చేయాలని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగులకు 60 నుంచి 62 వరకు పదవీ విరమణ వయస్సును పెంచాలని, టీచర్ల ఏకీకృత సర్వీసు రూల్స్, బదిలీలు, పదోన్నతులు కల్పించాలని, మహిళా ఉద్యోగులకు 5 స్పెషల్ సీఎల్‌లు, రెండు సంవత్సరాల చైల్డ్‌కేర్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. మూడు, నాలుగు దశల ఆందోళనలలో భాగంగా ఈ నెల 10న, 20న మహాధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కర్నూలు జిల్లాలో పాకిస్థాన్ వాసి

కర్నూలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో గత 11 ఏళ్లుగా నివాసముంటున్న వ్యక్తి పాకిస్థానీయుడని తెలిసి స్థానికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. గడివేముల గ్రామంలో పెయింటర్‌గా పనిచేస్తోన్న గుల్జార్‌ఖాన్ పాకిస్థాన్‌కు వెళ్లే ప్రయత్నంలో ఉండగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిఘా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్‌లోని సియాల్‌కోట్ గ్రామానికి చెందిన గుల్జార్‌ఖాన్ తాను సౌదీ అరేబియాలో ఉంటానని చెప్పి గడివేములకు చెందిన దౌలత్‌ని పెళ్లిచేసుకున్నాడు. అప్పటికే ఒక బిడ్డ ఉన్న దౌలత్ బీతో వివాహానంతరం ఆ జంటకు మరో నలుగురు పిల్లలు కలిగారు. ఈ నేపథ్యంలో సుమారు నెలన్నరగా పాకిస్థాన్‌లోని తన బంధువులతో, తల్లితో ఫోన్లో మాట్లాడుతున్నాడు. తల్లి కోరిక మేరకు భార్య, పిల్లలతో కలిసి పాకిస్థాన్ వెళ్లడానికి గుల్జార్ సన్నాహాలు చేసుకున్నాడు. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని మరదలు జాలూకు అప్పగించాడు. ఇటీవలే ఆధార్ కార్డు పొంది, పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. పాస్‌పోర్టు రాగానే పాకిస్థాన్ వెళ్లేందుకు వీసా కోసం సికింద్రాబాద్‌లో పలువురు దళారీలను గుల్జార్ కలుసుకున్నాడు. ఓ లాడ్జిలో ఉంటూ తరచూ పాకిస్థాన్ ఫోన్ నంబర్లకు కాల్స్ చేస్తోన్న అతనిపై నిఘా వర్గాలు దృష్టి సారించాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఉండగా.. తమను వారి బంధువులే పంపారని పరిచయం చేసుకుని గుల్జార్, అతని భార్య, పిల్లల్ని అధికారులు తీసుకెళ్లారు. అనంతరం వారిని వేర్వేరుగా ఉంచి విచారించిన అనంతరం దౌలత్ బీ, పిల్లలను కర్నూలుకు తిరిగి పంపించారు. కాగా.. గుల్జార్ ముగ్గురు సోదరులు పాకిస్థాన్‌లో వైద్యవృత్తిలో ఉన్నత స్థితిలో ఉండగా అతను రహస్యంగా భారతదేశానికి ఎందుకు రావాల్సి వచ్చిందన్న కోణంలో ఇపుడు నిఘా వర్గాలు విచారణ సాగిస్తున్నాయి. ఇన్నాళ్లుగా కేవలం పెయింటర్‌గానే ఉన్నాడా? తరచూ కర్నూలుకు ఎందుకు వెళ్లి వస్తుండేవాడనే దిశగా విచారణ సాగుతోంది.

## మంత్రి ఇంటి వద్దే శిలాఫలకాల ఆవిష్కరణ!

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు విశాఖ ఏజెన్సీలో పలు అభివృద్ధి పనుల శిలా ఫలకాలను శుక్రవారం తన ఇంటి వద్దే ఆవిష్కరించేశారు. పెదలబుడు పంచాయతీ గంజాయిగుడలో రూ.30 లక్షలతో నిర్మించ తలపెట్టిన గిరి గ్రామదర్శిని భవనం, తాజంగిలో రూ.40 లక్షలతో పర్యాటక అభివృద్ధి పనులు, మరో రూ.84.65 లక్షలతో పర్యాటక శాఖ కాటేజీ పనులకు చెందిన శిలాఫలకాలను సీతమ్మధారలోని తన ఇంటి ఆవరణలో ఆవిష్కరించారు. అమాత్యులు ఇంటి వద్ద శిలాఫలకాలను ఆవిష్కరించడమే ఇదే ప్రథమమని వైసీపీ నాయకులే చెవులు కొరుక్కుంటున్నారు. అయితే ఏజెన్సీలో మావోయిస్టు కార్యక్రమాలు విస్తృతంగా వున్నాయని, వెళ్లవద్దని పోలీసు అధికారులు సూచించడంతో ఇంటి దగ్గరే ఆవిష్కరణ పూర్తిచేశారని మంత్రి కార్యాలయం వర్గాలు తెలిపాయి.



ఇంటి వద్దే శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న అవంతి




## ఆకట్టుకున్న లిటిల్ మోడల్ ఎర్త్-2019

సిరిపురం(విశాఖ సిటీ), డిసెంబరు 6: ముద్దులొలికే చిన్నారులు తమ చిట్టిపొట్టి నడకలతో అలరించారు. గ్లోబల్ ఫ్యాషన్ గ్రూమింగ్ ఏజెన్సీ డీ లా వాలంటీనా ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో శుక్రవారం లిటిల్ మోడల్ ఎర్త్-2019 ఫైనల్స్ పోటీలు వైభవంగా నిర్వహించారు. ఏడు దేశాలకు చెందిన బాలబాలికలు ఆయా దేశాల సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వస్త్రాలను ధరించి వావ్ అన్పించారు. ఆయా దేశాలకు చెందిన సంస్కృతిని ప్రతిబింబిస్తూ చిన్నారులు తమ హావభావాలతో ఆకట్టుకున్నారు. పర్యావరణ కాలుష్యం గురించి తెలియజేస్తూ వజ్రం, పుష్పం, సముద్రం, భూమి, నెమలి, అగ్ని వస్త్రాధారణతో అదరహో అనిపించారు.







కొందరు అనుకున్నట్టు, ఊహించినట్టు, లేదా ఆశించినట్టు జరిగిపోయింది. సమాజాన్ని భయభ్రాంతులకు, తీవ్ర కలవరానికి గురి చేసిన అమానుష అత్యాచారం జరిగిన పదిరోజులకు, ఆ నేరంలో నిందితులుగా ఉన్న నలుగురు పోలీసుల చేతిలో చనిపోయారు. శుక్రవారం తెల్లవారు జామున, పోలీసు కస్టడీలో ఉన్న నిందితులు, నేరశోధనలో భాగంగా పోలీసులతో కలసి అత్యాచారస్థలానికి వచ్చినప్పుడు, ఎన్‌కౌంటర్ జరిగి ఆ నలుగురూ మరణించారు. ఈ పరిణామంతో, దిశకు న్యాయం జరగాలని జాతీయ, ప్రాంతీయ, స్థానిక స్థాయిలో ఉద్యమిస్తున్న వివిధ వర్గాల ప్రజలు తమ ఆనందాతిరేకాన్ని వివిధ రూపాల్లో ప్రకటించారు. పోలీసులకు అనుకూలంగా నినాదాలిచ్చారు. వారిపై పూల వర్షం కురిపించారు. కొన్ని చోట్ల నృత్యాలు చేశారు. బాధితురాలి కుటుంబం కూడా తమకు, దిశకు న్యాయం జరిగిందన్న సంతృప్తిని వ్యక్తం చేసింది. వివిధ రాజకీయ పార్టీల నేతలు, సినీ ప్రముఖులు, అనేక రంగాల ప్రతినిధులు– ఈ ఎన్‌కౌంటర్‌ను ఎంతగానో శ్లాఘించారు. జాతీయస్థాయిలో కూడా ఇటువంటి స్పందనలే వినిపించాయి. పార్లమెంటులో కూడా తెలంగాణ పోలీసులకు ఎన్నో ప్రశంసలు లభించాయి. ఇక తెలంగాణ రాష్ట్ర మంత్రులు కొందరైతే, పోలీసుల సత్తాను ఆకాశానికెత్తారు.

ఇటువంటి స్పందనలు సహజం. వారం పదిరోజులుగా సాధారణ, మధ్యతరగతి కుటుంబాలలో, ముఖ్యంగా ఆడపిల్లలున్న కుటుంబాలలో ఏదో తెలియని భయం గూడుకట్టుకుని ఉన్నది. ఆ భయం నిజానికి వెంటనే తీరేది కాదు. సమాజంలోని రుగ్మతలు ఎప్పుడైనా అంతరిస్తే, ఆ భవిష్యత్తులో మాత్రమే నిర్భయత్వం సాధ్యం. ఆడపిల్లలకు అభద్రతా పరిస్థితులు ఉన్నాయని ఎంతగా ముందుజాగ్రత్తలు తీసుకుని జీవిస్తున్నా, దిశ వంటి ఘటనలు భయాన్ని అధికం చేస్తాయి. అటువంటి వారికి శుక్రవారం నాటి ఎన్‌కౌంటర్ ఏదో ఉపశమనాన్ని ఇచ్చినట్టుంది. ఈ నలుగురిని చంపేసినంత మాత్రాన పరిస్థితులు ఏమీ మారబోవడం లేదని ఒక నాలుగు రోజులు ఆగితే, వారికి తెలిసి వస్తుంది కానీ, ప్రస్తుతానికి ఈ ఊరటకే వారు ఎంతో సంతోషించారు. దిశ విషయంలో సకాలంలో స్పందించలేదని పోలీసుల మీద విమర్శలు గుప్పించినవారే, ఇప్పుడు వారిని భేష్ అంటున్నారు.

## మరి పరిష్కార న్యాయం?

నేరశోధనలో భాగంగా సంఘటనాస్థలానికి వెళ్లినప్పుడు, పోలీసుల దగ్గర నుంచి ఆయుధాలను లాక్కుని పారిపోవడానికి ప్రయత్నిస్తుంటే కాల్చేశామని, అది యాదృచ్ఛికమని పోలీసులు చెబుతున్నారు. అంటే, ఆ ఎన్‌కౌంటర్ నిందితుల స్పందనకు ప్రతిస్పందన మాత్రమే అని పోలీసుల కథనం. కానీ, పోలీసులను ప్రశంసిస్తున్నవారు, సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అందరూ ఈ ఎన్‌కౌంటర్‌ను పోలీసులేదో కావాలని చేసినట్టు, దిశకు న్యాయం చేయడానికి నేరస్థులను హెచ్చరించడానికి ఉద్దేశ్యపూర్వకంగా చేసినట్టు అభినందిస్తున్నారు. పోలీసులు కూడా ఆ అభినందనలను స్వీకరిస్తున్నారు. అయ్యా, మేం కావాలని చేయలేదు, వారు పారిపోతుంటే కాల్చేశాము, మీరనుకున్నట్టు శిక్షగా అమలుచేయలేదు– అని కూడా పోలీసులు చెప్పడం లేదు. ఇదొక విచిత్రం.

ఏది ఏమయినా, దిశ వంటి ఘటనల విషయంలో కఠిన శిక్షలు ఉండాలనే ప్రజల ఆకాంక్ష, ఎన్‌కౌంటర్‌కు ముందు, తరువాత వ్యక్తమైన ప్రజాస్పందనల్లో తెలుస్తున్నది. శీఘ్రమయిన న్యాయప్రక్రియ ఉంటే, ప్రజలకు ఇంతగా అపనమ్మకం ఉండేది కాదు. ఆ విషయమై ప్రభుత్వం తగిన పరిష్కారాలు అన్వేషించాలి. అమెరికాలో 911 తరహా తక్షణస్పందన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం వల్ల చెప్పుకోదగ్గ ఫలితం ఉంటుంది. అటువంటి నిర్మాణాత్మక సూచనలు ఇవ్వడం కాక, ఆవేశపూర్వక పరిష్కారాలు కోరడం వల్ల పెద్ద ఫలితం ఉండదు. హైదరాబాద్ పరిసరాల్లో స్త్రీల భద్రతను మెరుగుపరచడానికి ఏమి చర్యలు తీసుకోవాలో సూచనలు చేయడానికి, వివిధ రంగాల నిపుణులతో కూడిన అధ్యయన బృందాన్ని నియమించాలి. నిర్భయ సందర్భంగా వేసిన వర్మకమిటీ ఇచ్చిన సిఫార్సులకు ఏ గతి పట్టిందో ఆ గతి పట్టకుండా అధ్యయన బృందం ఇచ్చే సూచనలను అమలు పరచాలి. ప్రతీకార న్యాయం సరే. పరిష్కార న్యాయం కూడా కావాలి కదా?

న్యాయప్రక్రియను పక్కనబెట్టి, పోలీసులే తగిన శిక్షలు అమలుచేయాలని ప్రజలు కోరడం, చివరకు వారు కోరినట్టే జరిగిపోవడం– ఇదంతా దీర్ఘకాలికంగా ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రజాస్వామ్యంలోని మూడు అంగాలు దేనిపని అది చేయడం ఉత్తమం. న్యాయప్రక్రియ మీద పెరుగుతున్న అపనమ్మకాన్ని, తక్షణ న్యాయం పేరిట న్యాయవ్యవస్థను దాటేయడాన్ని ఆ రంగానికి చెందిన పెద్దలు పరిగణనలోకి తీసుకుని తగిన విధంగా స్పందించాలి.

దిశ విషయంలో అందిన ప్రతీకార న్యాయం, టేకులక్ష్మి, మానస వంటి వారికి కూడా ఎందుకు అందించడం లేదని వస్తున్న ప్రశ్నలు విస్మరించదగినవి కావు. నేరానికి కులమతాలు లేవు నిజమే, న్యాయానికి కూడా ఉండకూడదనేది వారి వాదన. ఎంపిక చేసిన సందర్భాలలో మాత్రమే కఠినస్పందనలు ఉంటాయంటే, ఆ ఎంపిక ఏ ప్రాతిపదిక మీద జరిగిందో చెప్పాలని ఇతర బాధితుల పక్షం వారు అంటున్నారు.

# హక్కుల రక్షణకు 'అస్తిత్వ గర్జన'

చట్టబద్ధత లేకుండా ఎస్టీల్లో చేర్చిన లంబాడీలను ఆ జాబితా నుంచి తొలగించడం, ఆదివాసి హక్కులు, చట్టాల అమలును కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం లక్షమంది ఆదివాసీలతో డిసెంబరు 9న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఆదివాసి అస్థిత్వ గర్జన' నిర్వహిస్తున్నాం. ఆదివాసులకు జరుగుతున్న అన్యాయాలను జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పక్షాలకు తెలియజేయడమే ఈ సభ ఉద్దేశం. అదిలాబాద్, హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు, బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల ద్వారా వేలాది మంది ఆదివాసీలు దీనికి హాజరుకానున్నారు. అంతేకాకుండా పార్లమెంట్‌లోని అన్ని రాష్ట్రాల ఆదివాసి ఎంపిల మద్దతు కూడగడుతూ, రాజకీయ పోరాటానికి నాంది పలకబోతున్నాం. నేను పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైనా తరువాత తొలి సమావేశాల్లోనే ఈ సమస్యను సభ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశాను. ప్రస్తుత సభ కోసం తెలంగాణ ప్రాంతంలోని తొమ్మిది తెగల ఆదివాసులమూ కలిసి సంయుక్తంగా కార్యాచరణ నిర్వహిస్తున్నాం. ఈ సభకు తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒరిస్సా, మహారాష్ట్ర, జార్ఖండ్, కర్ణాటక, బీహార్ రాష్ట్రాల నుంచి కూడా ఆదివాసి తెగల ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు.

గోర్ జాతి లంబాడీలు భారత దేశ స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ సైన్యంతోపాటు ఆఫ్ఘనిస్థాన్ మీదుగా భారతదేశంలోని రాజస్థాన్‌కు, ఆ తర్వాత దక్షిణ భారతదేశానికి వలస వచ్చారు. వీరు రాజస్థాన్‌లో ఓసీలుగా, మహారాష్ట్రలో బీసీలుగా, కర్ణాటకలో ఎస్సీలుగా ఉన్నారు. హైదరాబాద్ రాష్ట్రంలో వీరిని జి.ఓ.నం.10 ద్వారా 'బీసీ–ఎ' గా నిజాం ప్రభుత్వం గుర్తించింది. కులాల వర్గీకరణకు సంబంధించి భారత ప్రభుత్వం వేసిన పలు కమిషన్లు కూడా లంబాడీలను బీసీ జాబితాలోనే కొనసాగించేలా రిపోర్టులు ఇచ్చాయి. కానీ ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ 108 ఆర్డినెన్స్ ద్వారా లంబాడీలకు డినోటిఫైడ్ ట్రైబ్స్ (డిఎన్‌టి) హోదా కల్పించి, ఆరు నెలలు మాత్రమే ఉండేలా ఉత్తర్వులు జారీ చేసింది. వీటి ఆధారంగా ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నం.149 ద్వారా లంబాడీలకు కేవలం విద్యాపరమైన రిజర్వేషన్లు (2%) కల్పించడం జరిగింది. కానీ సంచార జాతి లంబాడీలు, బంజారాలు, సుగాలీలు వారికి కల్పించిన డిఎన్‌టి హోదాను తెలివిగా ఉపయోగించుకున్నారు. తాత్కాలికంగా ఇచ్చిన డిఎన్‌టితో తమకు ఎస్టీ హోదా కలిగినట్లు సమాజాన్ని మభ్యపెడుతున్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 342 ప్రకారం గుర్తింపు పొందిన ఆదివాసి తెగలైన కోయ, గోండ్, పర్ధాన్, నాయక్ పోడ్, అంధ్, తోటి, చెంచు, కొలాం, మన్నెవార్ తదితర వర్గాలకు లభించే 4 శాతం రిజర్వేషన్లు కొల్లగొడుతున్నారు. ఇలా వలస వచ్చిన లంబాడీ సంచార జాతుల జనాభా సంఖ్య 25 నుంచి 30 లక్షలకు చేరింది. పెద్ద సంఖ్యకు చేరిన తమ జనాభాను చూపించి ఓటుబ్యాంకు రాజకీయాలతో తెలంగాణలోని అన్ని పార్టీలను, కులాల, మతాల వారిని ప్రభావితం చేస్తున్నారు. ఆదివాసులకు దక్కాల్సిన ఎస్టీ రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగపరంగా ముందున్నారు.



**ఆదివాసులు ఈ దేశ మూలవాసులు. ఆనాటి గొండ్వానా రాజ్యంలోని కోయత్తూర్ జాతికి చెందినవారు. దేశంలోని దాదాపు 724 తెగలకు సంబంధించిన వారంతా కోయత్తూర్ జాతి కిందకు వస్తారు.**

ఆదివాసులు ఈ దేశ మూలవాసులు. వేల సంవత్సరాల నుంచి ఈ ప్రాంత అడవులతో మమేకమై జీవితం గడుపుతున్నవారు. ఆనాటి గొండ్వానా రాజ్యంలోని (నేటి చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిషా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్) కోయత్తూర్ జాతికి చెందినవారు. దేశంలోని దాదాపు 724 తెగలకు సంబంధించిన వారంతా కోయత్తూర్ జాతి కిందకు వస్తారు. ఈ 724 తెగల్లో తెలంగాణ ప్రాంతంలోని కోయ, గోండ్, పర్ధాన్, తోటి, కొలాం, నాయక్ పోడ్, చెంచు, అంధ్, మన్నెవారలు కూడ ఒకరు. ఈ మూలవాసులను భారత రాజ్యాంగం షెడ్యూల్ తెగలుగా గుర్తించింది. వీరంతా వేల సంవత్సరాలుగా అడవిలోనే జీవిస్తూ తమదైన సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు.

ఎస్టీహోదా పొందిన లంబాడీ, సుగాలీ, బంజారాలే ప్రభుత్వ సౌకర్యాలన్నీ దక్కించుకున్నారు. ఎలాంటి కమిషన్లు, పార్లమెంటు చర్చలు, ఆంత్రోపాలజీ రిపోర్టులు, రాజ్యాంగ ప్రక్రియలు లేకుండా ఎస్టీ జాబితాలో ప్రవేశించిన సంచారజాతి లంబాడీలు ఎస్టీలకు లభించే అవకాశాల్లో 90శాతంపైగా కొల్లగొడుతున్నారు. విద్యా ఉద్యోగాల్లో ఆదివాసులకు దక్కాల్సిన రిజర్వేషన్లను చేజిక్కించుకోవడమే కాకుండా చివరికి 5వ షెడ్యూల్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల భూములపై కన్నేశారు. అంతేకాకుండా ఆదివాసులు పూజించే ప్రకృతి దేవతలు సమ్మక్క–సారలమ్మ, గుంజేడు ముసలమ్మ, పాల్వంచ పెద్దమ్మ, కేస్లాపూర్ నాగోబా జాతరలోకి ప్రవేశించి ఆయా బోర్డు సభ్యులుగా కొనసాగుతూ ఆదివాసి తెగల సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇవన్నీ ఆదివాసుల అస్థిత్వానికి ప్రమాదకరంగా మారాయి. అందుకే, సంచార జాతి, మైదానప్రాంత లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తేనే, 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసుల మనుగడ సాధ్యమవుతుందనే లక్ష్యంతో ఒకవైపు రాజకీయ పోరాటం, మరోవైపు న్యాయపోరాటం చేస్తున్నాం. 'ఆదివాసి అస్థిత్వ గర్జన సభలో తొమ్మిది తెగల ఆదివాసి ప్రజల సంస్కృతిని ప్రతిబింబించేలా కొమ్ము, గుస్సాడి, చెంచు, నాయక్ పోడ్, కొలాం బృందాలతోపాటు డోళ్లు, తుడుంలు, కాలీకోమ్‌లు, జానపద నృత్యాల బృందాలు, రేల పాటల కళాకారులు అంతా కలసి సాంస్కృతిక అస్తిత్వాన్ని ప్రదర్శించనున్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి, భూమి, విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రంగాల్లో లంబాడీలు దక్కించుకున్న అవకాశాల సమాచారాన్ని ప్రభుత్వం బయటపెట్టాలి, అటవీ హక్కుల చట్టం పేరుతో అన్యాక్రాంతమైన అటవీభూమి ఎవరి చేతుల్లో ఎంతుందనే లెక్కలు ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల ద్వారా తేల్చాలి, అక్రమ ఏజెన్సీ సర్టిఫికెట్స్, భూ బదలాయింపు ఎలా జరిగిందో విచారణ జరిపించాలనే పలు డిమాండ్లు నెరవేరే వరకు ఈ ఉద్యమం అవిశ్రాంతంగా కొనసాగుతుంది.

■ సోయం బాపురావు
పార్లమెంట్ సభ్యులు, 'తుడుందెబ్బ' అధ్యక్షులు

# ఆర్థికవేత్తల సారథ్యం లేని ఆర్థికం!

■ పి. చిదంబరం



'పళని' పలుకు

ప్రతి ఒక్కరూ ఒక ఆర్థికవేత్తే! ఆదాయ వ్యయాలు సమంగా వుండేలా కుటుంబ బడ్జెట్‌ను అత్యంత నేర్పుతో రూపొందించే గృహిణి నుంచి పాడి పశవులను పోషించి పాలను సరఫరా చేసే డైయిరీ యజమాని దాకా; విడిభాగాలను తయారు చేసే ఒక చిన్న తరహా పరిశ్రమ నిర్వాహకుడు నుంచి గృహ సముదాయాలను నిర్మించి విక్రయించే నిర్మాణ రంగ బడా వ్యాపారి దాకా తమ తమ రీతుల్లో విశిష్ట ఆర్థిక వేత్తలే . వీరందరూ తమ తమ నిర్దిష్ట రంగాల కార్యకలాపాల ప్రత్యేక చట్టాలకు, కాంట్రాక్టుల, పన్నుల సాధారణ చట్టాలకు, వాణిజ్య సంప్రదాయాలకు, సహచర వ్యాపారులు/ ఖాతాదారులతో వ్యవహరించడంలో పాటించవలసిన రీతులు, రివాజులకు అవశ్యం కట్టుబడి వుండవల్సిందే. ఇవన్నీ తెలిసిన విషయాలే. వాస్తవంగా ప్రతి ఒక్కరికీ తేటతెల్లంగా తెలిసిన విషయాలే. బాగా సుపరిచితమైన విషయం డబ్బు. మన కథలోని ముఖ్య నాయకుడు ప్రతి ఒక్కరికీ బాగా తెలిసిన విషయాల ప్రాతిపదికనే సముచిత నిర్ణయాలు తీసుకుంటాడు.

అవశ్య నిర్ణయాలు తీసుకోవడంలో సదరు ముఖ్య నాయకుడు అర్హుడు కాదని నిర్ధారితం కావచ్చు. ఇందుకు అవ్యక్త లేదా అజ్ఞాత, తెలిసిన, బాగా తెలిసిన విషయాలు రెండూ కారణమే. ఒక నిర్దిష్ట కాల పరిధిలో ఆ ముఖ్య నాయకుడు అజ్ఞాత విషయాలను బాగా ఆకళింపు చేసుకోవచ్చు. మన కథానాయకుడు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై , రాష్ట్ర పాలనను సమర్థంగా నిర్వహించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే అవకాశమున్నది. ప్రతి ఒక్కరికీ బాగా తెలిసిన విషయమైన డబ్బు వ్యవహారాలను అత్యంత దక్షతతో నిర్వహించడం ద్వారా మిగతా తెలిసిన, అజ్ఞాత అంశాలను కూడా ఒక క్రమపద్ధతిలో ఉంచుకోవడం సాధ్యమవుతుంది. అయితే కథానాయకుడు తెలిసిన, అజ్ఞాత విషయాల పరిధి దాటినపుడు ఒక తీవ్ర సంకటంలో పడతాడు. ఆ కష్టాన్నే మార్కెట్ (విపణి) అంటారు. మరి ఆ మార్కెట్, ఒకరితో ఒకరికి సంబంధం లేని, భయం, అనిశ్చితి వాతావరణంలో, విభిన్న లక్ష్యాల ప్రేరణతో ఎవరికి వారే నిర్ణయాలు తీసుకునే కోట్లాది వ్యక్తుల సముదాయమయినప్పుడు ఆ మార్కెట్ ఒక తేలిక పాటి కష్టం కాదు, అక్షరాలా ఒక మహా సంకటం.

మనుషుల మహా కట్టుదిట్టమైన ప్రణాళికలు మార్కెట్లో తరచు పూర్తిగా వక్రగతుల్లో పడతాయి, నిష్ఫలమవుతాయి. పరిమాణం, స్థాయి ముఖ్యం. ఒక సమతుల్య బడ్జెట్ పై ఒక పరీక్షను నిర్వహించడంలో అనేకానేక సమస్యలు, సవాళ్ళకు ఆస్కారం లేదు. అయితే ఒక ప్రభుత్వానికి ఒక బడ్జెట్‌ను రూపొందించడమనేది వేరే విషయం. చాలా కఠిన సవాళ్ళను ఎదుర్కోవలసివుంటుంది. ఒక దేశాన్ని పాలించడంలో ఎదురయినట్టుగా ఒక రాష్ట్రాన్ని పాలించడంలో అనేకానేక సవాళ్ళు ఉండబోవు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ కు పన్నెండు సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా వున్నారు. ఆయన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిష్ఠాత్మక జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో ఎమ్ ఏ పట్టా పొందారు. తామిరువురమూ సమర్థ ఆర్థికవేత్తలమని, భారత ఆర్థిక వ్యవస్థను అత్యంత సమర్థతతో నిర్వహించి, సర్వ సమగ్ర అభివృద్ధిని సాధించగల ఆర్థిక నిపుణలమని వారు భావిస్తున్నారు (సరే,వారలా ఎందుకు భావించకూడదు?). అయినా వారి ఆర్థిక విద్వత్తుకు అసూయపడేవారు ఎవరున్నారు?

సమస్యేమిటంటే మందగమనంలో పడిన, పతనం ఆసన్నమయిన భారత ఆర్థిక వ్యవస్థకు నరేంద్ర మోదీ, నిర్మలా సీతారామన్ నేతృత్వం వహిస్తున్నారు. గత ఆరు త్రైమాసికాలలో (వీటికి అధికారిక గణాంకాలు లభ్యమవుతున్నాయి) భారతదేశపు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెరుగుదల వరుసగా 8.0, 7.0, 6.6, 5.8, 5.5, 4.5 శాతంగా వున్నది. జీడీపీ వృద్ధిరేటు పడిపోతున్నదని ఈ సంఖ్యలు స్పష్టం చేయడం లేదూ? విశ్వసనీయ వర్గాల నుంచి మనం వింటున్న విషయాల ప్రకారం జీడీపీ వృద్ధిరేటు ఇలా క్షీణించడంపై ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి అమితంగా కలవరపడుతున్నారు. అయితే తమ వ్యాకులతను వారు ఎక్కడా ఏమాత్రం వ్యక్తంచేయడం లేదు. కనీసం ఇప్పటి దాకా. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి మధ్య మంచి శ్రమ విభజన ఉన్నది సుమా. ప్రధానమంత్రి కార్యాలయం నిర్ణయాలు తీసుకుంటుంది; ఆ నిర్ణయాలను ఆర్థిక మంత్రిత్వ శాఖ అమలుపరుస్తుంది. అన్నట్టు ఆ రెండు కార్యాలయాలలోని ఉన్నతాధికారుల మధ్య పరస్పర అనుమానాలు తక్కువేమీ కాదు. తరచూ ఒకరిపై మరొకరు నిందలు మోపుకోవడమూ పరిపాటిగా వున్నది.




**సమర్థులైన ఆర్థిక వేత్తల సహాయం, సలహాలు లేకుండా నరేంద్రమోదీ ప్రభుత్వం భారత ఆర్థికవ్యవస్థను నిర్వహిస్తోంది. ఒక ప్రొఫెసర్ లేకుండా డాక్టోరల్ కోర్సును బోధించడాన్ని, డాక్టర్ లేకుండా సంక్లిష్ట శస్త్ర చికిత్సను నిర్వహించడాన్ని ఊహించగలరా? అర్థశాస్త్ర పారంగతులైన ఆర్థికవేత్తలు లేకుండా అసమర్థులైన అధికారుల ద్వారా ఆర్థిక వ్యవస్థను నిర్వహించడమనేది అలాంటి వ్యవహారమే!**

మన కథలోని ముఖ్య వ్యక్తులు ఇరువురూ ఇప్పుడు ఉల్లిపాయ ధరలను అదుపు చేయడానికి మహా శ్రమ పడుతున్నారు. చాలా ప్రయాస పడుతున్నారు. సరైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.ఉల్లి లేని ఆహారం ఏమంత రుచిగా వుంటుంది? ప్రతి ఒక్కరికీ నిరుపేద కార్మికులు, మధ్యతరగతి వారు, కుబేరులు ఉల్లిపాయలు చాలా చాలా అవశ్యం. ఉల్లిపాయల విషయంలోనే ఏమిటి, ఈ క్రింది పేర్కొన్న వివిధ విషయాలను కూడా పరిశీలించండి. మన ఆర్థిక వ్యవస్థ నిర్వహణ ఎంత 'మోదం'గా వున్నదో మీకే అర్థమవుతుంది.

వరుసగా నాలుగు ఆర్థిక సంవత్సరాలలో వివిధ రంగాలలో మన పురోగతి ఇలా వున్నది: వరుసగా సంవత్సరాలు 2016–17; 2017–18; 2018–19; 2019–20 (కొంత భాగం). ఆయా సంవత్సరాలలో వివిధ రంగాలలో సిద్ధించిన వృద్ధి శాతం: వ్యవసాయం 6.3, 5.0, 2.9, 2.1; పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 4.6, 4.4, 3.9, 2.4; కీలక రంగాలు 4.8, 4.3, 4.4, 0.2; సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పరపతి సదుపాయం 0.9, 0.4, 2.3, 2.7; తయారీ రంగం 1.2, 1.7, 1.4, 0.7; నిరుద్యోగం 9.65, 4.03, 5.14, 7.05.

ఈ లెక్కలు చెప్పుతున్నదేమిటి? మన ఆర్థిక పురోగతి సజావుగా లేదనే కాదూ? సరే, కుటుంబాల స్థాయిలో వినియోగం ప్రభుత్వ సంస్థ ఎన్ ఎస్ ఎస్ సర్వే ప్రకారం తగ్గిపోయింది. గ్రామీణ వేతనాలు పడిపోయాయి ఉత్పత్తిదారులకు ముఖ్యంగా రైతులకు లభించే ధరలూ తగ్గిపోయాయి. దినసరి వేతనాలపై ఆధారపడినవారికి నెలకు 15 రోజులకు మించి పని లభించడం లేదు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి డిమాండ్ పెరిగింది. మన్నికైన, మన్నిక కాని సరుకుల విక్రయాలు తగ్గిపోయాయి. టోకు ధరల ద్రవ్యోల్బణం 1.92 శాతానికి పెరిగింది. అన్ని థర్మల్ విద్యుత్కేంద్రాల ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ 49 శాతంగా మాత్రమే వున్నది.

ముంచుకొస్తున్న ముప్పును నివారించగలనని ప్రభుత్వం భావిస్తున్నది. అయితే అందుకు సమర్థంగా వ్యవహరించగలదా? గతంలో తీసుకున్న సమర్థించలేని నిర్ణయాలను సమర్థించుకోవడం ప్రభుత్వం చేస్తున్న ఒక పెద్ద తప్పు. అది ప్రభుత్వ బలహీనతకు ఒక తార్కాణం. ఇంతకూ ఆ సమర్థించలేని నిర్ణయాలు ఏమిటో మరి చెప్పనవసరం లేదు. అవి: పెద్ద నోట్ల రద్దు, లొసుగుల మయమైన వస్తు సేవల పన్నును హడావుడిగా అమలుపరచడం, పన్ను ఉగ్రవాదం, మితిమీరిన క్రమబద్ధీకరణ, సంరక్షణ వాదం, నిర్ణయాలను తీసుకునే అధికారాలను ప్రధానమంత్రి కార్యాలయంలో కేంద్రీకృతం చేయడం ఇత్యాదులు.

2016 నవంబర్ 6న డిమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) దుష్ప్రభావాలు, వినాశనకర పర్యవసానాలు ఇంకా సమసి పోలేదు. దేశ ప్రజలను అవి ఇంకా పలు విధాల వేధిస్తున్నాయి ఎన్ని హెచ్చరికలు చేసినప్పటికీ ఈ పరిస్థితిని సమీక్షించి, నిష్పాక్షికంగా తర్కించి సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రభుత్వం సుముఖంగా లేదు. దేశ ఆర్థిక వ్యవస్థను నరేంద్ర మోదీ ప్రభుత్వం సమర్థంగా నిర్వహించడం లేదని ఆర్థిక వేత్తలు విమర్శిస్తున్నారు. సహేతుకమైన విమర్శలను ఎదుర్కోలేక మంత్రులు బెదిరింపులకు దిగుతున్నారు. ఆర్థికాభివృద్ధి గురించి బడాయి మాటలు మాట్లాడుతున్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనంలో వుందని మోదీ ప్రభుత్వం అంగీకరించింది. అయితే 'వ్యవస్థాగత' సమస్యలను పరిష్కరించవలసిన అవసరాన్ని నిరాకరిస్తోంది. ఆ సమస్యలు 'చక్రీయ' సమస్యలని, ప్రతి ఆర్థిక వ్యవస్థకు అవి సహజమూ, అనివార్యమైనవని ప్రభుత్వం అంటోంది. ఇంకా నయం, ఆ సమస్యలకు కారణాలు 'కాలిక' (సీజనల్) మైనవిగా అధికార వర్గాలు గుర్తించలేదు! సమర్థులైన ఆర్థిక వేత్తల సహాయం, సలహాలు లేకుండా నరేంద్ర మోదీ ప్రభుత్వం భారత ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తోంది. సుప్రసిద్ధ ఆర్థికవేత్త డాక్టర్ అరవింద్ సుబ్రమణియన్ గతంలో మోదీ సర్కార్‌కు ఆర్థిక సలహాదారుగా ఉండేవారు.. ఒక ప్రొఫెసర్ లేకుండా ఒక డాక్టోరల్ కోర్సును బోధించడాన్ని, డాక్టర్ లేకుండా చికిత్స నిర్వహించడాన్ని ఊహించగలరా? ఆర్థికవేత్తలు లేకుండా అసమర్థులైన అధికారుల ద్వారా ఆర్థిక వ్యవస్థను నిర్వహించడమనేది అలాంటి వ్యవహారమే సుమా!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# చరిత్రకారుని సత్యనిష్ఠ

■ రామచంద్ర గుహ



గతానుగతం

**1947 డిసెంబర్‌లో భారత చరిత్ర కాంగ్రెస్ వార్షిక సమావేశంలో ప్రొఫెసర్ మొహమ్మద్ హబీబ్ అధ్యక్షోపన్యాసం వెలువరిస్తూ వెల్లడించిన సత్యాలు, చేసిన హెచ్చరికలూ 72 సంవత్సరాల అనంతరమూ ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. 'భారత్‌కు ఒకే రాజ్య వ్యవస్థ, ఒకే చట్టం, ఒకే జాతీయ సమాజం' సృష్టించడం ప్రభవించనున్న భారత గణతంత్ర రాజ్యం ప్రధాన కర్తవ్యం కావాలని ఆయన అభిలషించారు. రాజ్యం శాసించిన రీతిలో సాగే చరిత్ర రచన ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే బలవత్తర సాధనాలలో ఒకటి అన్న హబీబ్ భావన చరిత్ర, చరిత్రకారులను తమ రాజకీయ లక్ష్య సాధనకు ఉపయోగించుకునేందుకు నాడు ఇందిరాగాంధీ చేసిన, నేడు నరేంద్ర మోదీ చేస్తోన్న ప్రయత్నాలను ఆనాడే అసాధారణంగా పసిగట్టింది.**

స్వతంత్ర భారతదేశ తొలి డిసెంబర్లో భారత చరిత్ర కాంగ్రెస్ వార్షిక మహాసభ బొంబాయిలో జరిగింది. మహాసభకు అధ్యక్షుడుగా ఎన్నికైన మొహమ్మద్ హబీబ్ (1895–1971) అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయ ఆచార్యుడు. మధ్యయుగాల భారతదేశ, ముఖ్యంగా ఢిల్లీ సుల్తానేట్ చరిత్ర పరిశోధనలో ఆయన సుప్రసిద్ధుడు. 1930ల నుంచీ అలీగఢ్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు పలువురు మహమ్మద్ అలీ జిన్నాకు, పాకిస్థాన్ ఉద్యమానికి గట్టి మద్దతుదారులు. ప్రొఫెసర్ హబీబ్ వారిలో ఒకరు కాదు. సమ్మిళిత భారత జాతీయ వాదానికి ఆయన మనసా వాచా కర్మణా నిబద్ధుడు. హబీబ్, ఆయన సతీమణి సొహాయిలా (మహాత్ముని అనుయాయి అబ్బాస్ త్యాబ్జీ కుమార్తె) గాంధీజీ ఆరాధకులు.

1947 డిసెంబర్ లో భారత్ తనతో తాను యుద్ధం చేసుకుంటున్న దేశం. స్వాతంత్ర్య లబ్ధి, దేశ విభజనకు ముందూ అనంతరమూ మతోన్మాదం ప్రజలను ఊపివేస్తున్న రోజులవి. అలీగఢ్ నుంచి బొంబాయికి రైలులో వెళ్ళవద్దని కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు ప్రొఫెసర్ హబీబ్‌ను కోరారు. హబీబ్‌ను ముస్లిం మతస్థుడని గుర్తిస్తే ఆయనపై దాడి జరుగుతుందని వారు భయపడ్డారు. ఆప్తుల భయాలను దేశభక్తుడు హబీబ్ త్రోసిపుచ్చారు. బొంబాయికి రైలులోనే ప్రయాణించి చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసం చేశారు.. ఆ స్ఫూర్తిదాయక ఉపన్యాసంలో ఆయన వెల్లడించిన చారిత్రక సత్యాలు, ప్రజలను కుదిపివేస్తున్న ఆనాటి ధోరణులకు వ్యతిరేకంగా భవిష్యత్తు విషయమై జాతిని జాగృతం చేసేందుకు చేసిన హెచ్చరికలూ 72 సంవత్సరాల అనంతరమూ ప్రతిధ్వనితమవుతూనే వున్నాయి.

'సార్వకాలిక మహోన్నత భారతీయ గురువు' అని మహాత్మా గాంధీకి నమో వాకాలు అర్పిస్తూ ప్రొఫెసర్ హబీబ్ తన అధ్యక్షోపన్యాసాన్ని ప్రారంభించారు. గాంధీజీ ఉత్తేజపూరిత నాయకత్వంలో ఆయన దేశీయులు శాంతి యుతంగా, పరస్పర ఒప్పందంతో ప్రపంచచరిత్రలోనే మహాశక్తిమంతమైన సామ్రాజానికి చరమ గీతం పాడారని ఆయన అన్నారు.

ఆ తరువాత దేశ విభజన గురించి హబీబ్ ప్రస్తావించారు. బ్రిటిష్ పాలకులు మత ప్రాతిపదికన సృష్టించిన నియోజక వర్గాలే ఈ మహా విషాదానికి దారితీశాయని ఆయన అన్నారు. మతం ఆధారంగా నియోజక వర్గాల నిర్మాణం చాలా క్రూరమైన ఏర్పాటు అని, ఇటువంటి చర్యను పాశ్చాత్య ప్రజాస్వామ్య వ్యవస్థలలో క్షణం సేపు కూడా సహించరని హబీబ్ అన్నారు. తమ ప్రతినిధులుగా సొంత మతస్థులనే ఎన్నుకునేందుకు ముస్లింలకు అనుమతినివ్వడం వల్ల మన సమాజంలో మతపరమైన విభేదాలు అనివార్యంగా పెచ్చరిల్లి పోయాయని ఆయన అన్నారు. మత ప్రాతిపదిక నియోజక వర్గాల పర్యవసానాల ఫలితంగానే మైనారిటీ మతస్థులు విదేశీ పాలకులపై ఆధారపడడం తప్పనిసరి అయిపోయింది. పర పాలకులకు తమ విధేయతను నిరూపించుకునేందుకు మత మైనారిటీలు జాతీయోద్యమానికి తీవ్రంగా అడ్డ పడ్డారని హబీబ్ పేర్కొన్నారు.

ముస్లింలకు సొంత దేశంగా పాకిస్థాన్ ఏర్పడింది. అయితే చాలా మంది ముస్లింలు భారత్‌లోనే ఉండిపోయేందుకు నిర్ణయించుకున్నారు. భారత్ పట్ల వారి నిబద్ధత, విధేయత ప్రశ్నిస్తున్న వారికి ప్రొఫెసర్ హబీబ్ ఇలా సమాధానమిచ్చారు: 'భారతీయ ముస్లింలలో అత్యధికులు నిస్సందేహంగా భారతీయ మూలాలు కలవారే. ఇండియాలోని అనేక ముస్లిం కుటుంబాలు తమ పాదులు పశ్చిమాసియా, మధ్యాసియాలో వున్నాయని చెప్పుకున్నప్పటికీ వారి ఆ అనుబంధం పూర్తిగా కల్పితమైనది'.

మధ్య యుగాలలోని తమ గత వైభవాల గురించి భారతీయ ముస్లింలు భావోద్రేక పూరిత జ్ఞాపకాలకు లోనుకావడం శుభస్కరం కాదని హబీబ్ హెచ్చరించారు. మధ్యయుగాలలో భారతీయ ముస్లింల పరిస్థితి, బ్రిటిష్ పాలనా యుగంలో భారతీయ క్రైస్తవుల పరిస్థితికి భిన్నమైనది కాదని ఆయన అన్నారు. పాలకులు, పాలితులు ఒకే దేవుణ్ణి ఆరాధించినప్పటికీ, వారు ప్రతి విషయంలోనూ వేరు, విభిన్నమైన వారేనని హబీబ్ స్పష్టం చేశారు. ఆయన ఇంకా ఇలా వ్యాఖ్యానించారు: 'నిర్దయులైన విదేశీయుల పాలన ఎప్పటికీ సుస్థిరంగా ఉంటుందని ఆశోపహతులమవ్వడం వల్ల మనం తీవ్ర ఆత్మన్యూనతా భావంతో నలిగిపోయాము. ఆ బాధ నుంచి ఉపశమనం పొందేందుకే మనం మధ్యయుగాల రాజపుట్ రాజాలు, టర్కిష్ సుల్తాన్‌లను ఆరాధించాము. అటువంటి వైఖరి ఇంకెంత మాత్రం తప్పనిసరికాదు. అసలు సత్యమేమిటంటే మధ్యయుగాలలో మన ప్రభుత్వాలన్నీ పూర్తిగా కులీన వర్గాల ప్రత్యేక వ్యవస్థలు. యుద్ధం, రాజకీయాలు ఉన్నత వర్గ సంజాతులు మాత్రమే ఆడగల ఆటలు. మధ్యయుగాల ప్రభుత్వాలు ఏ విధంగానూ ప్రజా ప్రభుత్వాలు కావు. మొగల్ చక్రవర్తుల కాలంలోనూ, అంతకు ముందు ఢిల్లీ సుల్తాన్ల హయాంలోనూ ఉన్నతాధికారుల వివరాలను పరిశీలిస్తే విషాద వాస్తవాలు తెలుస్తాయి. ఉన్నతస్థాయి పౌర, సైనిక ఉద్యోగాల నుంచి జన్మతహా భారతీయులైన ముస్లింలను పూర్తిగా మినహాయించారు. ఎంతగా ప్రతిభావంతులైనప్పటికీ వారు ఆ ఉన్నతోద్యోగాలకు పూర్తిగా అనర్హులు. రాజస్థాన్‌లో ఒక హిందూ శూద్రుడు రాజ్య పాలకుడు కావడం అసంభవం. అలాగే ఢిల్లీ సుల్తానేట్‌లో ఒక భారతీయ ముస్లిం యుద్ధ ప్రభువు అయ్యేందుకు ఎంతమాత్రం అవకాశం లేదు'.



ప్రొఫెసర్ హబీబ్ హెచ్చరికలు ఇప్పటికీ పూర్తిగా ఉపయుక్తమైనవి. కాకపోతే వర్తమాన ముస్లింల కంటే వర్తమాన హిందువులకే అవి ఎక్కువగా వర్తిస్తాయి. భారతదేశ ప్రస్తుత పాలకులకు స్ఫూర్తిగా వున్న హిందుత్వ పూర్తిగా ఆత్మ న్యూనతా భావంపైనే ఆధారడివున్న భావజాలం. కనుకనే చంద్రగుప్త, శివాజీ లాంటి ప్రాచీన, మధ్యయుగాల పాలకులను కీర్తిస్తున్నారు. ఆ పాలకులు జెండర్, కుల వివక్షను ఎలాంటి మినహాయింపులు లేకుండా పాటించారనే విషయాన్ని హిందుత్వవాదులు ఉపేక్షిస్తున్నారు. ఆధునిక, ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం ఆమోదించే విలువలకు ఆ పాలకుల ఆచరణలు పూర్తిగా విరుద్ధమైనవనే వాస్తవాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. స్వాతంత్ర్య ప్రత్యూష కాలం (1947 డిసెంబర్) నాటి భారతదేశం, మధ్యయుగాలలో వలే 'వ్యక్తి' కంటే 'సమాజం'కే అగ్ర ప్రాధాన్యమిస్తుందనే వాస్తవాన్ని ప్రొఫెసర్ హబీబ్ తీవ్రంగా గర్హించారు. 'సామాజిక సంప్రదాయాలు, సాంఘిక దురభిమానాలు గతంలో కంటే ఇప్పుడు చాలా శక్తిమంతంగా వున్నాయి. అవి వ్యక్తి బానిసత్వాన్ని మరింత పటిష్ఠం చేసేవి. జీవితంలోని ప్రతి అంశంలోనూ వ్యక్తులు వర్గం లేదా కులం లేదా మతం దయాదాక్షిణ్యాలపై ఆధార పడివున్నారని ఆయన వాపోయారు.

భారత్‌లో ఒక వ్యక్తి సజీవుడుగా ఉన్నప్పుడూ నిర్జీవుడు అయినప్పుడూ సమాజంలో అతని స్థానాన్ని మతమే నిర్వచించి, నియంత్రిస్తుంది. హబీబ్ ఇలా అన్నారు: 'ఏదో ఒక మతానికి చెందిన వాడుగా కాకుండా ఒక భారతీయుడుగా గుర్తింపు పొందడమనేది ఇప్పటికీ అసాధ్యంగా వున్నది. ఇప్పటికీ భారతీయ పౌరసత్వ ప్రాతిపదికన ఒక భారతీయుడు స్థానం పొందగల శ్మశానం ఏదీ లేదు. ఏదో ఒక మత విహిత సంస్కారాల ద్వారా మాత్రమే ప్రతి ఒక్కరికీ అందులో ప్రవేశం లభిస్తుంది'. 'సమాజంపై వ్యక్తికి ఉన్నత స్థానమివ్వడం ఇప్పుడు మనముందున్న ఒక సవాల్ అని హబీబ్ అన్నారు. 'నేటి 'మతవాది' సంప్రదాయ జనితుడు. ఆ సంప్రదాయం అనాగరికతకు ఆప్తమైనదిగా భ్రష్టుపట్టింది. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా రూపొందించిన చట్టాల సృష్టిగా భావి 'పౌరుడు' ఉండి తీరాలి'.

మతపరమైన తేడాలు వున్నాయని, భవిష్యత్తులోనూ అవి వుంటాయని హబీబ్ అంగీకరించారు. అయితే వాటి వల్ల ఎటువంటి హాని సంభవించదని ఆయన అన్నారు. 'భారత్‌కు ఒకే రాజ్య వ్యవస్థ, ఒకే చట్టం, ఒకే జాతీయ సమాజం'ను సృష్టించడం ప్రభవించనున్న భారత గణతంత్ర రాజ్యం ప్రధాన కర్తవ్యం కావాలని అభిలషించారు. దీన్ని బట్టి దేశ పౌరులందరికీ ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావడం వైపు ఆయన మొగ్గు చూపేవారని నిశ్చితంగా చెప్పవచ్చు. అదే అధ్యక్షోపన్యాసంలో 'భారతీయ పౌరుడికి వివాహ చట్టంగానీ, వారసత్వ చట్టంగానీ లేకపోవడం పట్ల' ఆయన విచారం వ్యక్తం చేశారు.

ఆ అధ్యక్షోపన్యాసం ఆఖరులో ప్రొఫెసర్ హబీబ్ తన వృత్తి చరిత్ర రచన గురించి విపులంగా ప్రస్తావించారు. 'భారతీయ చరిత్రకారులలో అత్యధికులు ఉన్నతవర్గ నేపథ్యం నుంచి వచ్చిన వారే (ఇది ఇప్పటికీ వాస్తవమే!). ఈ యథార్థం చరిత్ర రచనలో వారి దృక్కోణాన్ని ప్రభావితం చేస్తుంది. భారతదేశ చరిత్ర పై ఆధునిక పరిశోధనలు, పుస్తకాలు రైతులు, కార్మిక వర్గాల పట్ల ఎటువంటి అయిష్టతను చూపవు. అదే సమయంలో ఉన్నత వర్గాల వారి పట్ల అమిత ఆదరభావాన్ని చూపుతాయి' అని హబీబ్ వ్యాఖ్యానించారు. పాలక వర్గాలకే అధిక ప్రాధాన్యమివ్వడం వల్ల భారతీయ శ్రామికుని జీవితంతో సంబంధమున్న ప్రతి అంశమూ అతని వేతనాలు, కుటుంబ పోషణలకు అవసరమైన సరుకుల ధరలు, ఉపాధిసాధనకు అతని పోరాటాలు, అతని ఆనందాలు, అతని బాధలు, అతని ఆశలు ఏమాత్రం పరిశోధింపబడని క్షేత్రంగా వున్నది'. కార్మికులు, రైతుల జీవితాలపై మరింత దృష్టిని పెట్టాలని అడగడం ద్వారా ఇప్పుడు 'నిమ్న శ్రేణుల అధ్యయనాలు' (సబాల్ట్రన్ స్టడీస్) గా సుప్రసిద్ధమైన నవీన చారిత్రక అధ్యయనాలను ఆయన ముందుగానే ఊహించారని చెప్పవచ్చు. గమనార్హమైన విషయమేమిటంటే ఇక్కడ కూడా పిడివాద ధోరణులు ఎంత మాత్రం సమంజసం కాదని ఆయన ఆనాడే హెచ్చరించారు.

ప్రొఫెసర్ హబీబ్ అధ్యక్షోపన్యాసాన్ని నేను మొట్టమొదట దాదాపు పాతిక సంవత్సరాల క్రితం ఒక విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో చదివాను. ఇటీవల ఆన్‌లైన్ లో ఆ స్ఫూర్తిదాయక ఉపన్యాస పాఠాన్ని చూడడం తటస్థించింది. వెన్వెంటనే దాన్ని చదివాను. ఆయన వివేకం, చారిత్రక యథార్థాలకు సంబంధించిన సూక్ష్మ గ్రాహకత్వం నన్ను మళ్ళీ ఎంతో ఆశ్చర్య పరిచాయి. నా మనస్సులో చెరగని కొత్త ముద్రను వేశాయి. ఈ వ్యాసంలో నేను ఇంతవరకు చేసిన ఉటంకింపులే హబీబ్ ప్రశస్త విద్వత్తుకు నిదర్శనాలు. ఈ అంశాన్ని మరికొంచెం వివరంగా చూద్దాం. చరిత్ర పరిశోధనలకు రాజ్యవ్యవస్థ ఆర్థిక వనరులు సమకూర్చవచ్చు గానీ, చరిత్రను వ్యాఖ్యానించడంలో ఎటువంటి జోక్యం చేసుకోకూడదని' 1947 చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసంలో హబీబ్ స్పష్టం చేశారు. 'స్వేచ్ఛాయుత భారతదేశం స్వేచ్ఛాయుత భారతదేశ చరిత్ర రచనను సూచిస్తుంది. ఈ కృషిలో ప్రతి దృష్టికోణానికీ స్థానముంటుంది. స్వేచ్ఛాయుత, చిక్కులు లేని చర్చే సత్యావిష్కరణకు దోహదం చేస్తుంది. నిజానికి సత్యాన్ని చేరుకోవడానికి అది మినహా మరే మార్గమూ లేదు'. గతాన్ని ఎలా వివరించాలి అనే విషయమై నియంత్రణ, పర్యవేక్షణలకు దూరంగా వుండాలని రాజకీయ వేత్తలకు హబీబ్ విజ్ఞప్తిచేశారు. 'రాజ్యం శాసించిన రీతిలో చరిత్ర రచన, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే బలవత్తర సాధనాలలో ఒకటి' అని హబీబ్ అన్నారు. ఆయన వ్యక్తం చేసిన ఈ భావన, భావి పరిణామాలను అసాధారణంగా ఊహించింది. ఎందుకంటే చరిత్ర, చరిత్రకారులను తమ రాజకీయ లక్ష్య సాధనకు ఉపయోగించుకునేందుకు 1970ల్లో ఇందిరా గాంధీ చేసిన, నేడు నరేంద్ర మోదీ చేస్తోన్న ప్రయత్నాల'ను అది ఆనాడే పసిగట్టింది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఆంధ్రజ్యోతి నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 7 డిసెంబర్ 2019
navya@andhrajyothy.com



"హత్యాచారం చేసిన దుండగులను చంపిపడెయ్యాలి!
ఆ దుర్మార్గులను ఉరి తీయాలి.... కాల్చి పారేయాలి!!
'దిశ'కు సత్వర, సహజ న్యాయం కావాలి!!"

అవును... ఆ ఆగ్రహావేశాలకు తగినట్టుగానే అంతా జరిగింది.
విచారణ జరుగుతుండగానే... కోర్టు మెట్లెక్కకుండానే...
నిందితులకు ఎన్‌కౌంటర్ శిక్ష పడింది.
పంటికి పన్ను... కంటికి కన్ను... సూత్రం గెలిచింది.
కానీ, ఈ దెబ్బతో వ్యవస్థ మారుతుందా? అసలు సమస్య తీరిందా?
సమాజం, సర్కారు చూపుతున్న దిశా నిర్దేశం ఇదేనా?
ఇప్పటికీ న్యాయం వాకిట నిలుచున్న
ఎందరో 'నిర్భయలు... కరువాలు... ఉన్నావ్'ల సాక్షిగా...
ఇక... మన ఇంట్లోని పిల్లా పాపల భయం తీరినట్టేనా?
నిజంగా... భయం తీరిందా... పాపా?

# భయం తీరిందా... పాపా?

## ఎన్‌కౌంటర్ పరిష్కారమా?



దిశా ఘటనలో ఎన్‌కౌంటర్ వార్త వినగానే ఒక మహిళగా, తల్లిగా సంతోషించాను. కానీ ఎంతమందిని ఎన్‌కౌంటర్ చేసుకుంటూ వెళ్తారు. ఎన్‌కౌంటర్ అన్నింటికీ సమాధానం కాదు. దీని వల్ల బాధిత కుటుంబ సభ్యులకు కొంత ఉపశమనమే తప్ప, వారి బాధ ఎప్పటికీ తీరదు. పెద్ద కుటుంబాలకు చెందిన వారు ఇలాంటి కేసుల్లో ఉంటే ఇలాగే ఉరి తీయగలరా? అని కూడా సోషల్ మీడియాలో మాట్లాడుకుంటున్నారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం నిజమైన పరిష్కారమా? ఇలా ఆలోచిస్తే అంటే చాలా ప్రశ్నలొస్తాయి. నిర్భయ కేసులో నిందితులను 7 ఏళ్లుగా జైలులో పెట్టి మేపుతున్నారు. వాళ్లల్లో ప్రధాన నిందితుడు హాయిగా బయట తిరుగుతున్నాడు..? ఇదెక్కడి న్యాయం? ఆ విషయం గురించి కూడా ప్రశ్నించాలి? దేశం మారాలి, జనాలు మారాలి అన్నదాని కంటే ముందు మనం మారి దేశాన్ని బాగుచేసుకోవాలి. న్యాయ వ్యవస్థను మార్చుకోవాలి. చట్టాలు మారాలి. ఎడ్యుకేషన్ సిస్టం నుండి, తల్లిదండ్రులు ఆడపిల్లల ను పెంచే తీరులో సమానత్వం రావాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ పెరగాలి."

**- మంచు లక్ష్మీ ప్రసన్న**

స్పందన

## రెస్ట్ ఇన్ పీస్!

**'దిశ' ఘటనలో ఎన్‌కౌంటర్‌పై సెలబ్రిటీలు స్పందిస్తున్నారు. వాటిలో కొన్ని...**

### సత్వర న్యాయం... సహజ న్యాయం!

**- చిరంజీవి**



"ఆడపిల్లల్ని ఆటవస్తువుగా పరిగణించి, వారిపై దారుణ అకృత్యాలకు పాల్పడే మానవ మృగాలకు ఇదో గుణపాఠం కావాలి. ఇటువంటి హత్యాచార ఘటనలు పునరావృత్తం కాకుండా నేరస్తుల వెన్నులో వణుకు పుట్టాలి. కామంతో కళ్లు మూసుకుపోయి నేరాలు, ఘోరాలు చేసే ఎవరికైనా ఇది కనువిప్పు కలిగించాల్సిందే. 'దిశ' ఘటనలో నిందితులు పోలీసుల కాల్పుల్లో మృతిచెందారన్న వార్త చూడగానే... ఇది సత్వర నాయ్యం, సహజ న్యాయమని భావించాను. వారం రోజుల వ్యవధిలో వ్యవహారం కొలిక్కి రావడం అభినందనీయం. సజ్జనార్ వంటి అధికారులున్న పోలీస్ వ్యవస్థకు, కేసీఆర్ ప్రభుత్వానికీ మనస్ఫూర్తిగా నా అభినందనలు"

### ఇదొక గుణపాఠం కావాలి

**- బాలకృష్ణ**



"దేశమంతా మహిళలపై ఎన్నో ఘాతుకాలు జరుగుతున్నాయి. ఇటీవల దిశాపై దుండగులు చేసిన సామూహిక హత్యాచారానికి ఫలితంగా నిందితులను ఎన్‌కౌంటర్ చేశారు. ఆ భగవంతుడే పోలీసుల రూపంలో నిందితులకు సరైన శిక్ష విధించాడు. మరోసారి ఎవరూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉండటానికీ, అసలు ఇలాంటి ఆలోచన మొలకెత్తనీయకుండా వారిని ఎన్‌కౌంటర్ చేశారు. అందరికీ ఇదొక గుణపాఠం కావాలి. మున్ముందు ఇటువంటి ఘాతుకానికి సాహసించకుండా ఉండేలా నిందితులకు శిక్ష విధించిన తెలంగాణ ప్రభుత్వానికీ, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు నా అభినందనలు. దిశా ఆత్మకు ఇప్పుడు శాంతి చేకూరిందని అనుకుంటున్నా. సినిమా అనేది జనాలపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఎన్నో మాధ్యమాల ద్వారా సంఘాన్ని మార్చడానికి, చక్కని సందేశం ఇవ్వడానికి నాన్నగారు ఎన్నో సినిమాలు చేశారు. 'లెజెండ్'లో స్త్రీ లేకుంటే సృష్టి లేదు అని సందేశం ఇచ్చాం."



గ్రేట్‌వర్క్ హైదరాబాద్ పోలీస్.
వుయ్ సెల్యూట్ యు.

**- సైనా నెహ్వాల్,**
బ్యాడ్మింటన్ క్రీడాకారిణి



దిశ చనిపోయిన ఎనిమిది రోజుల్లోనే పోలీసులు న్యాయం చేశారు. కానీ నా బిడ్డ చనిపోయి ఏడేళ్లు అవుతోంది. అయినా కనీస న్యాయం జరగలేదు. ఏడేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఉరిశిక్ష పడింది కానీ అది ఇంతవరకు అమలు కాలేదు. శిక్ష అమలు జరిగే వరకూ పోరాడుతూనే ఉంటా. దిశ కేసులో పోలీసుల తీరును స్వాగతిస్తున్నా. ఆమె ఆత్మకు ఎట్టకేలకు శాంతి జరిగింది.

**-నిర్భయ తల్లి ఆశాదేవి**



ఈ చర్య భవిష్యత్తులో మహిళలపై దారుణాలను ఆపగలుగుతుందా? మరో ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే... ప్రతీ రేపిస్టును వారి సామాజిక స్థితి చూడకుండా ఇలాగే ట్రీట్ చేస్తారా?

**-గుత్తా జ్వాల,**
బ్యాండ్మిటన్ క్రీడాకారిణి



వెల్‌డన్ తెలంగాణ సీఎం. వెల్‌డన్ తెలంగాణ పోలీస్. మీరు ఏదైతే చేశారో అది కచ్చితంగా అభినందనీయమే.

**- హర్భజన్ సింగ్,**
క్రికెటర్

### నిర్భయ

#### ఏడేళ్లయినా ఏదీ న్యాయం?



**ఎక్కడ?:** దేశ రాజధాని ఢిల్లీలో
**ఎప్పుడు?:** 2012 డిసెంబరు 16న,
**ఏం జరిగింది?:** ఇరవైమూడేళ్ళ ఫిజియోథెరపీ విద్యార్థిని నిర్భయపై కదులుతున్న బస్సులో ఆరుగురు అత్యాచారం జరిపారు. ఆమెను అతి క్రూరంగా హింసించారు. తీవ్రంగా గాయపడిన ఆమె 13 రోజులపాటు మృత్యువుతో పోరాడింది. 2012 డిసెంబరు 29న మరణించింది. ఈ సంఘటన దేశ మంతటా పెను ప్రకంపనలు సృష్టించింది. ప్రజలు స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. నిందితులను 24 గంటల్లో అరెస్ట్ చేశారు. ఈ ఘటనతో నిర్భయ చట్టానికి కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా రూపకల్పన చేసింది. చట్టం 2013 ఏప్రిల్ 3 నుంచి అమలులోకి వచ్చింది.
**కేసు ఏమైంది?:** నిందితుల్లో ఒకడైన రామ్ సింగ్ జైల్లో ఉరి వేసుకున్నాడు. మరొక నిందితుడు మైనర్ కావడంతో బాల నేరస్థుల చట్టాల ప్రకారం అతనికి గరిష్ఠంగా మూడేళ్ళ జైలు శిక్ష విధించారు. మిగిలిన నిందితులకు మరణ శిక్ష విధిస్తూ 2013 సెప్టెంబరులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు చెప్పింది. ఆ తీర్పును 2014 మార్చిలో ఢిల్లీ హైకోర్టు, 2017 మేలో సుప్రీకోర్టు సమర్థించాయి. కాగా, వినయ్ శర్మ అనే నిందితుడు తనకు మరణ శిక్ష నుంచి క్షమాభిక్ష ప్రసాదించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు విజ్ఞప్తి చేసుకున్నాడు. దాన్ని తిరస్కరించాలని హోమ్ మంత్రిత్వశాఖ, ఢిల్లీ ప్రభుత్వం సిఫారసు చేశాయి. మహిళపై అత్యాచారం కేసుల్లో మరణ శిక్ష పడిన నిందితులకు క్షమాభిక్ష కోరే అర్హత లేదని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వినయ్ శర్మతో పాటు పవన్ గుప్తా, అక్షయ్ ఠాకూర్, ముఖేశ్ సింగ్ అనే మరో ముగ్గురు నిందితులకు కూడా ఉరి శిక్షను తీహార్ జైలు అధికారులు త్వరలోనే అమలు చేసే అవకాశం ఉంది.

### ఉన్నావ్- 2017

#### ఒక అత్యాచారం- మూడు హత్యలు

**ఎక్కడ?:** ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో
**ఎప్పుడు?:** 2017 జూన్ 4న
**ఏం జరిగింది?:** ఉద్యోగం ఇప్పిస్తానని ఒక యువతిని ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్‌కి చెందిన బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ దగ్గరకు శశిసింగ్ అనే మహిళ తీసుకువెళ్ళింది. అప్పుడు ఎమ్మెల్యే తనపై అత్యాచారానికి పాల్పడినట్టు ఆ యువతి ఆరోపించినా, పోలీసులు మొదట్లో పట్టించుకోలేదు. ప్రతిపక్షాలు, పౌర సంఘాలు ఆందోళనలకు దిగాయి. తరువాత కేసు నమోదు చేసిన పోలీసులు బాధిత యువతి తండ్రిని నిర్బంధించారు, అతను పోలీస్ కస్టడీలో మరణించాడు. కాగా, ఈ ఏడాది జూలైలో బాధిత యువతి, ఆమె బంధువులు, న్యాయవాది ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొట్టడంతో ఆమె బంధువులు ఇద్దరు మరణించారు. ఆ యువతికీ, న్యాయవాదికీ తీవ్రంగా గాయాలయ్యాయి. చంపుతామని బెదిరింపులు వస్తున్నట్టు అంతకు పది రోజుల ముందే సుప్రీం కోర్టుకు లేఖ కూడా రాయడం గమనార్హం. కాగా ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు, ఆమె చికిత్స పొందుతున్న ఆసుపత్రిలోనే తాత్కాలిక న్యాయస్థానాన్ని ప్రత్యేక న్యాయమూర్తి నిర్వహించారు. బాధితురాలి వాఙ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు. నిందితుణ్ణి, అతని సోదరుణ్ణి పోలీసులు అరెస్ట్ చేశారు.
**కేసు ఏమైంది?:** కుల్దీప్ సింగ్ సెంగార్‌ను పార్టీ నుంచి బిజెపి సస్పెండ్ చేసింది. ఆ తరువాత బహిష్కరించింది. కుల్దీప్ సింగ్‌పై అత్యాచారం, (బాధితురాలి తండ్రి) హత్య కేసుల్లో ఆరోపణల మీద ప్రత్యేక కోర్టులో వాదోపవాదాలు పూర్తయ్యాయి. ఈ కేసులో కుల్దీప్ సింగ్, అతని సహచరురాలు శశి సింగ్, ముగ్గురు మాజీ పోలీసులు, కుల్దీప్ సింగ్ సోదరుడు అతుల్‌తో సహా పదకొండు మంది నిందితులుగా ఉన్నారు. ఈ నెల 15న తీర్పు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

**మహిళలపై అఘాయిత్యాల కేసుల్లో బాధితులు న్యాయం కోసం దీర్ఘ కాలం ఎదురుచూడాల్సి వస్తోంది. తీర్పు వచ్చిన కేసుల్లోనూ సరైన న్యాయం జరగలేదనే అసంతృప్తి. దేశంలో ఇటీవల సంచలనం సృష్టించిన కొన్ని కేసులివి...**

### ఉన్నావ్- 2018

#### బెయిల్ మీద వచ్చి మంట పెట్టారు!

**ఎక్కడ?:** ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో
**ఎప్పుడు?:** 2018 డిసెంబరులో
**ఏం జరిగింది?:** ఇరవై రెండేళ్ళ యువతిని శివం, శుభం త్రివేదీ అనే వ్యక్తులు ఎత్తుకుపోయి, అత్యాచారం చేశారు. ఎన్నో ప్రయత్నాల తరువాత ఈ ఏడాది మార్చిలో నిందితులపై కేసు నమోదైంది. పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. అయితే వారం రోజుల కిందట, నవంబరు 30న నిందితులు బెయిల్ మీద బయటకు వచ్చారు. అప్పటి నుంచీ శుభం త్రివేదీ ఆమెను బెదిరించడం మొదలుపెట్టాడు. దీనిపై పోలీసులకు బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో, గురువారం ఆ యువతిపై మరో ముగ్గురితో కలిసి



నిందితులు దాడి చేశారు. ఆమెపై పెట్రోలు పోసి నిప్పు అంటించారు. దాదాపు కిలోమీటర్ దూరం ఆమె శరీరాన్ని దహిస్తున్న మంటలతోనే 'కాపాడండి' అంటూ పరుగులు పెట్టింది. ఇప్పుడు ఆమె 90 శాతం గాయాలతో ప్రాణాల కోసం పోరాడుతోంది.
**కేసు ఏమైంది?:** నిందితులు అయిదుగురిలో నలుగురిని వాళ్ళ ఇళ్ళలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. అయిదో నిందితుడు సరిహద్దు రాష్ట్రమైన బీహార్‌లోని పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. అత్యాచారం కేసు విచారణ ఇంకా నడుస్తోంది. కొత్తగా హత్యాయత్నం కేసు తోడయింది.

### కరువా

#### శిక్ష పడినా... ఉరి తప్పింది!



**ఎక్కడ?:** కాశ్మీర్‌లోని కరువాలో
**ఎప్పుడు?:** 2018 జనవరిలో
**ఏం జరిగింది?:** కరువా గ్రామంలో ఎనిమిదేళ్ళ బాలిక కిందటి ఏడాది జనవరి 10న అదృశ్యం అయింది. ఆమెను కిడ్నాప్ చేసిన నిందితులు గ్రామంలోని ఒక ఆలయంలో నిర్బంధించారు. నాలుగు రోజుల పాటు అఘాయిత్యాలు సాగించి, చంపేశారు. ఆమె మృతదేహం జనవరి 17న గ్రామ శివార్లలో కనిపించింది. ఈ సంఘటన కాశ్మీర్ లోయలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. నిందితులు కేసు నుంచి తప్పించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేశారు. కేసు సంచలనం కావడంతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు.
**కేసు ఏమైంది?:** ఈ కేసులో నిందితులకు మరణశిక్ష విధించాలన్న డిమాండ్లు విస్తృతంగా వచ్చాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును పంజాబ్‌లోని పఠాన్‌కోట్ న్యాయస్థానంలో విచారించారు. ఈ ఏడాది జూన్ 10న తీర్పు ప్రకటించారు. ఆలయ పూజారి సాంఝీరాం, ప్రత్యేక పోలీస్ అధికారి దీపక్ ఖజూరియా, పర్వేష్ కుమార్‌లకు జీవిత ఖైదు విధిస్తూ, వారు మరణించేవరకూ ఈ శిక్ష అమలు అవుతుందని న్యాయస్థానం పేర్కొంది.

నిష్ఠుర సత్యం

## ఏళ్ళ తరబడిగా... పెండింగే!

హైదరాబాద్‌లో పశువైద్యురాలిపై హత్యాచార ఘటన 'దిశ' దేశం మొత్తాన్నీ కుదిపేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అనేక సంఘటనలు జరిగినా, వాటికి ఈ ఘటనకు వచ్చినంత ప్రచారం రాలేదు. అదే సమయంలో రాజస్థాన్‌లోని టోంక్‌లో స్కూలులో ఆటల పోటీల్లో పాల్గొనడానికి వెళ్ళి వస్తున్న ఆరేళ్ళ పసిపాప అపహరణకు గురై, అమానవీయంగా అత్యాచారానికి గురైంది. కోయంబత్తూరులో 11వ తరగతి చదువుతున్న అమ్మాయి పుట్టినరోజు జరుపుకొని తిరిగి వస్తుండగా అపహరణకు గురై, సామూహిక అత్యాచారానికి బలైంది. ఇక, రాంచీలో న్యాయశాస్త్రం చదువుతున్న ఓ ఆదివాసీ విద్యార్థిని సైతం అపహరణ పాలైంది. సాయుధుల గుంపు ఆమెపై మృగాల్లా పడి, అత్యాచారం చేసింది. ఒకే వారంలో జరిగిన ఇన్ని లైంగిక అత్యాచారాల ఘటనలు దేశంలో మహిళలపై సాగుతున్న అమానవీయ హింసకు ప్రతీక.

నిజానికి, 2016 నుంచి జాతీయ నేర పరిశోధక విభాగం (ఎన్.సి.ఆర్.బి) గణాంకాల నివేదికలను బయటకు రాకుండా తొక్కిపెడుతున్నారు కానీ, వాస్తవాలు భయానకంగా ఉన్నాయి. 2017 నాటి నివేదిక ఎట్టకేలకు 2019లో విడుదలైంది. పరువు హత్యలు, నరికివేతల లాంటి కేసులను ఉద్దేశపూర్వకంగా ఈ నివేదిక నుంచి తొలిగించారు. అయినప్పటికీ, మహిళలపై నేరాలు, ఘోరాల సంఖ్య నమోదు మాత్రం భయం వేసేంతగా పెరిగింది.

**సగటున ప్రతి రోజూ 93 మంది మహిళలు అత్యాచారానికి గురవుతున్నారు. వారిలో మూడోవంతు మంది ముక్కుపచ్చరాలని బాలికలే.**

- మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించి సగటున రోజుకు 1000 క్రైమ్ కేసులు నమోదవుతున్నాయి.
- ఏటా మహిళలపై జరుగుతున్న నేరాల సంఖ్య 3.5 లక్షల పై మాటే!
- మహిళలపై సాగుతున్న లైంగిక వేధింపుల కేసులు సగటున రోజుకు 241 నమోదవుతున్నాయి.
- ప్రతి రోజూ సగటున 28 మంది మహిళలు వరకట్నం బాధితులుగా, కాలి బూడిదవుతున్నారు.
- మహిళలపై హింసకు సంబంధించిన కేసుల్లో అధికభాగం నమోదే కావడం లేదు. ఒకవేళ నమోదైనా, ఆ కేసుల్లో చాలా భాగం పరిష్కారం కాకుండా, పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. దాదాపు 89.6 శాతం కేసులు అలా పెండింగ్‌లో ఉన్నవే.
- 2017 నాటికి అంతకు ముందు సంవత్సరాల నుంచి 1.17 లక్షల రేప్ కేసులు పెండింగ్‌లోనే ఉండగా, ఆ ఏడాది మరో 28,750 కేసులు విచారణకు వచ్చి చేరాయి. ఇది లక్షల కేసుల్లో దోషులుగా నిరూపితమై, శిక్ష పడింది కేవలం 5822 కేసుల్లోనే!

## న్యాయం కోసం నిలబడితే..!

**మహిళల భద్రత కోసం చట్టాలు, వ్యవస్థలూ ఉన్నాయి కానీ అన్యాయాన్ని ఎదిరించి నిలబడినవారికి రక్షణ ఇవ్వలేకపోతున్నాయి. అందుకు 2017లో, గత ఏడాది డిసెంబర్‌లో ఉన్నావ్‌లో జరిగిన రెండు వేర్వేరు ఉదంతాలే నిదర్శనం. అయినా తెగించి పోరాడుతున్న బాధితులున్నారు.**

*తాజా ఉన్నావ్ ఘటనలో బాధితురాలిపై పెట్రోల్ పోసి తగులబెట్టారు బాధితులు. ఒక పక్క ఆమె ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతోంది. ఇక 2017 నాటి ఉన్నావ్ ఘటనలో న్యాయం చేయమని అడిగినందుకు నిందితుల అకృత్యంతో తండ్రినీ, తనవారినీ పోగొట్టుకుంది బాధితురాలు. సాక్షాత్తూ ఎమ్మెల్యేనే నిందితుడు కావడంతో ఆమెకు దినదిన గండంగా మారింది. ఓ సందర్భంలో బాధితురాలు పంచుకున్న ఆవేదన ఇది...*

**మా నాన్నను చంపారు... అయినా...**

"నాకు జరిగిన అన్యాయంపై మా నాన్న అందరి ముందూ మాట్లాడారు. నిందితులైన బీజేపీ ఎమ్మెల్యే కుల్‌దీప్‌సింగ్ సెంగార్‌పై కేసు పెట్టినప్పటి నుంచి మమ్మల్ని చంపుతామని బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. దానికి తగ్గట్టుగానే ఒకరోజు పోలీసులు వచ్చి, మా నాన్నను తీసుకెళ్లారు. ఆయనపై తప్పుడు కేసు బనాయించారు. ఓ చెట్టుకు కట్టేసి, కేసు వాపసు తీసుకోమని రక్తం ఓడేలా కొట్టారు. హింసించి చంపేశారు. నిందితుడి తరుపువారే ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. ఆ తరువాత వాహనంతో గుద్దించి మమ్మల్ని చంపాలని చూశారు. ఆ ఘటనలో మా బంధువులు చనిపోయారు. నాన్న చావుతో మా కుటుంబం ఛిన్నాభిన్నమైంది. చిన్న వయసులోనే మా అమ్మ విధవరాలైంది. నాకు న్యాయం జరగలేదు. ఢిల్లీలో ఉన్న మా మామయ్యను కూడా బెదిరించారు. ఇన్ని రోజులుగా ప్రభుత్వం ఏం చేస్తోంది? వ్యవస్థ ఎటుపోయింది? ఇవాళ నేను బతికే ఉన్నాను. రేపు ఉంటానో లేదో తెలియదు. పోలీసులు, ఈ ప్రభుత్వం మా నాన్నను చంపాయి. పోలీసులే కనుక వెంటనే స్పందించి ఉంటే మా నాన్న బతికుండేవాడు. అందుకే వాళ్లపై నమ్మకం పోయింది. ఈ పోరాటం ఇక్కడే ఆగిపోతే ఇలాంటి ఘటనలకు అంతే ఉండదు. నేను ప్రభుత్వాన్ని కోరుకొనేది ఒక్కటే... సాధ్యమైనంత త్వరగా ఈ కేసును పరిష్కరించాలి. దోషులను శిక్షించాలి. ఆ రోజే ఈ వ్యవస్థపైన, ఈ ప్రభుత్వంపైనా నాకు నమ్మకం కలుగుతుంది."

ఆమె కన్నీరు



దిశ నిందితుల ఎదురుకాల్పులపై వారణాసిలో న్యాయవాదుల ఆనందోత్సాహం

ఇది చేయండి!

## సర్కారుకు పట్టని సిఫారసులు



జస్టిస్ జె.ఎస్. వర్మ

నిర్భయ కేసు తరువాత మన దేశంలో సెక్సువల్ క్రైమ్ చట్టాలపై జస్టిస్ జె.ఎస్. వర్మ సారథ్యంలో ఏర్పాటైన సంఘం మహిళలపై నేరాలకు అడ్డుకట్ట వేయడానికి అనేక సిఫార్సులు చేసింది. ఆడవాళ్ళపై నేరాలు జరగకుండా ఉండాలంటే, అందుకు తగినట్టు సామాజికంగా, భౌతికంగా మౌలిక సదుపాయాలను కల్పించాలంటూ ఆ బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉంచింది. వర్మ కమిటీ సిఫారసులు ఇచ్చి ఇప్పటికి ఆరేళ్ళు అయిపోయినా, ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకుండా ఇప్పటికీ చట్టసభల్లో ప్రజాప్రతినిధులను తాజా సలహాలు, సూచనలు కోరుతూ కాలయాపన చేస్తున్నాయి. ఇన్నేళ్ళుగా కాగితాలకే పరిమితమైన వర్మ కమిటీ సిఫారసులు, సూచనల్లో కొన్ని...

- స్త్రీ పురుష సమానత్వం, మహిళ స్వయంప్రతిపత్తి పట్ల గౌరవం తదితర విషయాల్లో యువతరానికి జ్ఞానం కలిగించేలా పాఠశాల, కళాశాలల్లో పాఠ్యప్రణాళికకు మార్పులు చేయాలి.
- ఈవ్ టీజింగ్, వెంటబడడం, అసభ్యంగా తాకడం, ఆంతరంగిక జీవితాన్ని చాటు నుంచి చూడడం లాంటి వాటితో సహా రేప్‌నకు సంబంధించిన ప్రతి ఫిర్యాదూ నమోదు చేయాలి.
- చట్టాన్ని అమలు చేసే సంస్థలు రాజకీయాలకు అతీతంగా ఉండాలి.
- మహిళా సమానత్వానికి భంగం కలిగేలా ప్రవర్తిస్తే, అది రాజ్యాంగ ఉల్లంఘనగా భావించాలి.
- ప్రభుత్వం ఉదాసీనతను వదిలి, మైనర్ బాలబాలికల అక్రమ రవాణాను తీవ్రమైన నేరంగా పరిగణించాలి.



- అభద్రత నిండిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ పోలీసు గస్తీ పెంచాలి.
- మహిళలపై నేరాలకు కఠినమైన శిక్షలు విధించేలా భారత శిక్షా స్మృతి (ఐ.పి.సి)లోని వివిధ సెక్షన్లలో సవరణలు చేయాలి.
- ప్రజా రవాణా వ్యవస్థ సురక్షితంగా ఉండేలా చూడాలి.
- నగరాల్లో, వీధుల్లో విరివిగా లైట్లు ఉండాలి. సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటుచేయాలి.


జి.ఆర్.కృష్ణ, దిల్‌రాజు, రాజ్‌తరుణ్, వేణుగోపాల్

# అది జరిగితే హ్యాట్రిక్‌తో ముగిస్తాం

**- దిల్ రాజు**

రాజ్‌తరుణ్, షాలిని పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. దిల్‌రాజు సమర్పణలో శిరీశ్ నిర్మాతగా రూపొందుతున్న ఈ చిత్రానికి జి.ఆర్.కృష్ణ దర్శకుడు. సెన్సార్ పూర్తి చేసుకుని 'యు/ఎ' సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తుంది. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడుతూ "2019 సంక్రాంతికి 'ఎఫ్2', సమ్మర్‌లో 'మహర్షి' వంటి బ్లాక్‌బస్టర్స్ సాధించాం. గతేడాదిలాగా నాలుగైదు సినిమాలు ఉంటాయనుకున్నాం. కానీ ఈ ఏడాది మూడు సినిమాలతోనే ముగిస్తున్నాం. దర్శకుడు ఓ టర్కీ సినిమా చూసి ఆ ఐడియా చెప్పాడు. దానిని మన నేటివిటీకి తగ్గట్టు డెవలప్ చేసి ఈ సినిమా తీశాం. ఫీల్ గుడ్ లవ్‌స్టోరీతో దర్శకుడు చక్కగా తెరకెక్కించాడు. మా బ్యానర్‌లో వస్తున్న 33వ సినిమా ఇది. మేం అనుకున్నట్లు జరిగితే హ్యాట్రిక్ హిట్‌తో ఈ ఏడాదిని ముగిస్తాం" అని అన్నారు. "పుట్టిన దగ్గరి నుండి ఒకటయ్యేంత వరకు హీరో, హీరోయిన్ మధ్య సాగే ప్రేమకథే ఇది. మంచి సినిమాను చూశామనే ఫీలింగ్‌తో ప్రేక్షకులు బయటికొస్తారని నమ్మకంగా చెప్పగలను" అని దర్శకుడు చెప్పారు. చివరి ముప్పై నిమిషాల సినిమాకు ప్రేక్షకులు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారని బెక్కెం వేణుగోపాల్ అన్నారు.

# వినోదమూ... నాటకీయత!


శ్రీవిష్ణు, కీర్తి చౌదరి

శ్రీవిష్ణు హీరోగా హాసిత్ గోలిని దర్శకుడిగా పరిచయం చేస్తూ... టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. నిర్మాతలు మాట్లాడుతూ "వినూత్న కథతో రూపొందనున్న చిత్రమిది. జనవరిలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. శ్రీవిష్ణు హీరోగా నటించిన 'మెంటల్ మదిలో', 'బ్రోచేవారెవరురా' చిత్రాలకు వివేక్ ఆత్రేయ దగ్గర దర్శకత్వ శాఖలో హాసిత్ గోలి పని చేశారు" అన్నారు. "వినోదంతో కూడిన నాటకీయత వలన ఈ చిత్రకథను వైవిధ్యంగా సాగుతుంది" అని హాసిత్ గోలి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, ఛాయాగ్రహణం: వేదరామన్, సహ నిర్మాతలు: వివేక్ కూచిభొట్ల, కీర్తి చౌదరి.

# నువ్వొక మాటంటే అది శబ్దం... అదే మాట నేనంటే శాసనం!


బోయపాటి శ్రీను, బాలకృష్ణ, మిర్యాల రవీందర్‌రెడ్డి

బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి అంబికా కృష్ణ కెమెరా స్విచ్చాన్ చేయగా, బి. గోపాల్ క్లాప్ ఇచ్చారు. 'నువ్వొక మాటంటే అది శబ్దం... అదే మాట నేనంటే అది శాసనం' అనే శక్తిమంతమైన డైలాగును బాలకృష్ణ తొలి షాట్‌లో చెప్పారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ "కొన్ని కథలు ఓ పాత్ర నుండి, కొన్ని కథలు ఓ మనిషి వ్యక్తిత్వం నుండి పుట్టుకొస్తాయి. అయితే... బోయపాటితో నా కాంబినేషన్‌లో కథలు ఆవేశం నుండి పుట్టుకొస్తాయి. ఈ కథ అలాగే వచ్చింది. ఈ కథలో కొత్తదనం, ఆధ్యాత్మికం ఉన్నాయి. 'సింహా', 'లెజెండ్' విజయాల తర్వాత మా కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కనుక ప్రేక్షకుల్లో ఎక్కువ అంచనాలుంటాయి. అయితే... దృష్టంతా ఈ చిత్రంపై పెట్టాలనేది మా సిద్ధాంతం. ఎం. రత్నం కథ, సంభాషణలు వినసొంపుగా ఉంటాయి" అన్నారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ "బాలయ్యబాబుతో నా హ్యాట్రిక్ చిత్రమిది. 'సింహా' విజయంతో నా జీవితానికి ఓ మలుపు వచ్చింది. 'సింహా', 'లెజెండ్' విజయాలతో ఈ చిత్రానికి నా బాధ్యత మరింత పెరిగింది. ఆ చిత్రాలను మించిన చిత్రాన్ని తీసి నా బాధ్యతను నెరవేర్చుకుంటా. ద్వారకా క్రియేషన్స్‌లో నా రెండవ చిత్రమిది" అన్నారు. "బాలకృష్ణగారితో చిత్రమంటే ఓ గౌరవంగా భావిస్తా" అని మిర్యాల రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సి. కల్యాణ్, శివలెంక కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి మాటలు: ఎం. రత్నం, సంగీతం: ఎస్.ఎస్. తమన్, ఛాయాగ్రహణం: రామ్‌ప్రసాద్, కళ: ఏఎస్ ప్రకాశ్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, తమ్మిరాజు.

# రామానాయుడుగారి కలల చిత్రమిది



**"వెంకీమామ' రామానాయుడుగారి కలల చిత్రమనీ, నీ చేతిలో పెడుతున్నామనీ సురేశ్‌బాబు ముందే చెప్పారు. ఇది నాకు దక్కిన పెద్ద బాధ్యత, గొప్ప గౌరవంగా భావించి అంగీకరించా" అని కె.ఎస్.రవీంద్ర(బాబీ) అన్నారు. వెంకటేశ్, నాగచైతన్య మామ అల్లుళ్లుగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'వెంకీమామ'. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రం గురించి బాబీ విలేకర్లతో మాట్లాడారు.**

'జై లవకుశ' తర్వాత ఓ అగ్ర హీరోతో సినిమా చెయ్యాలని అన్ని ఏర్పాట్లు చేసుకున్నా. 'సురేశ్‌బాబుగారు వెంకటేశ్- నాగచైతన్యలతో మామా అల్లుళ్ల చిత్రం ఒకటి చేద్దామనుకుంటున్నారు. ఓసారి నువ్వు వెళ్లి కథ వినొచ్చుగా' అని కోన వెంకట్ చెప్పారు. కథలో మామా అల్లుళ్ల మధ్యలో కనిపించిన వినోదం తప్ప మిగతా కథ నాకు నచ్చలేదు. ఏం చెప్పాలో తెలియక కొంత సమయం అడిగా. దీన్ని ఒప్పుకోకూడదు అనుకుంటూనే సురేశ్‌బాబు దగ్గరకెళ్లి కథ నచ్చలేదని చెప్పేశా. 'నీపై నమ్మకం ఉంది. నువ్వు స్క్రిప్ట్‌లో ఏ మార్పులు చేస్తావో చేసి పట్టుకురా' అన్నారాయన. మార్పులు చేసి సినిమా మొదలుపెట్టా. నా బలమేంటో చూపించాలని చాలా కష్టపడ్డా.

### నాయుడు మామగా...

పల్లెటూరి నేపథ్యంలో సాగే మామా అల్లుళ్ల కథ ఇది. వెంకటేశ్ మిలటరీ నాయుడుగా కనిపిస్తారు. ఆయన నమ్మేది రెండిటినే. ఒకటి కిసాన్.. రెండు జవాన్. చైతూ సిటీ నుంచి పల్లెటూరికి వచ్చిన అబ్బాయిగా కనిపిస్తాడు. మేనమామ చాటు బిడ్డగా పెరిగిన అతను మిలటరీకి ఎందుకు వెళ్లాడు? వెంకీమామకూ, మిలటరీకీ సంబంధం ఏంటి? ఈ మామా అల్లుళ్ల అనుబంధమేంటి? వంటి అంశాల చుట్టూ కథ తిరుగుతుంది. ఇందులో ఇద్దరికీ సరిసమానమైన ప్రాధాన్యం ఉంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరికీ తమ మేనమామలు, మేనల్లుళ్లు గుర్తుకొస్తారు. వెంకటేశ్ సరసన పాయల్ రాజ్‌పుత్ కరెక్ట్‌గా సరిపోయింది. రాశీ ఖన్నా పాత్రకి ముందు ఇద్దరు ముగ్గుర్ని అనుకున్నాం.

### రవితేజ తర్వాత ఆయనే!

దమ్మున్న కథ ఇది. 'మనం'లోని భావోద్వేగాలు, 'ఎఫ్2'లో వినోదం వీటన్నిటికీ తోడు చక్కనైన యాక్షన్ ఈ సినిమాలో ఉన్నాయి. 'లక్ష్మీ' తర్వాత వెంకటేశ్‌లోని పూర్తి మాస్ కోణాన్ని ఇందులో ఆవిష్కరించాం. దసరాకే రావలసిన సినిమా ఇది. అందుకు తగ్గట్టే షూటింగ్ పూర్తి చేశాం. చివర్లో ఓ పాట చిత్రీకరణ మిగిలి ఉండగా వెంకటేశ్‌గారి కాలుకి చిన్న గాయమైంది. దాని వల్ల కాస్త లేట్ అయింది. కశ్మీర్‌లోని గ్లేసియర్ పర్వత శిఖరాల్లో 13 రోజుల పాటు యాక్షన్ సన్నివేశాల్ని చిత్రీకరించాం. అక్కడ షూటింగ్ చాలా కష్టం. ఎవరైనా అక్కడకు మంచులో నడిచి వెళ్లాల్సిందే! నేను వద్దన్నా సురేశ్‌గారు అక్కడే చేద్దాం అన్నారు. ఆ సన్నివేశాలు మాకు సవాల్ విసిరాయి. రామ్ - లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెరకెక్కించిన ఈ పోరాట ఘట్టాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. అవుట్‌పుట్ చూసి వెంకటేశ్, చైతన్య, సురేశ్‌బాబు చాలా సంతోషంగా ఫీలయ్యారు. వెంకీ.. చిత్రాన్ని మరో స్థాయికి తీసుకెళ్లావని సురేశ్‌బాబు అన్నారు. చైతూ.. గట్టిగా కౌగిలించుకొని థ్యాంక్స్ చెప్పారు. రవితేజ తర్వాత నాకు థ్యాంక్స్ చెప్పిన హీరో ఆయనే. ప్రస్తుతం రెండు కథలు సిద్ధంగా ఉన్నాయి. తర్వాతి చిత్రం గురించి ఇంకా ప్లాన్ చేయలేదు.

# రొమాంటిక్.. టిక్!

సంచలన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చాలా రోజుల తర్వాత అందిస్తున్న రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్ 'బ్యూటిఫుల్' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ట్రిబ్యూట్ టు రంగీలా' అనే ఉపశీర్షికతో రూపుదిద్దుకొన్న ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొంది. ఎలాంటి కట్స్ లేకుండా 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చినట్లు నిర్మాతలు చెప్పారు. నూతన కథానాయిక నైనా గ్లామర్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ అని చెబుతున్నారు. సూరి కథానాయకుడు. 'దర్శకుడు అగస్త్య మంజు రొమాంటిక్ ప్రేమకథాంశంతో వైవిధ్యభరితంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు, సింగిల్స్‌కు విశేష ఆదరణ లభించింది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర బృందం చెప్పింది. టి.అంజయ్య సమర్పణలో రూపుదిద్దుకొన్న ఈ చిత్రానికి సహనిర్మాతలు: నట్టి క్రాంతి, నట్టి కరుణ, నిర్మాతలు: టి.నరేశ్‌కుమార్, టి.శ్రీధర్, రచన, ఫొటోగ్రఫీ, దర్శకత్వం: అగస్త్య మంజు.


నైనా

# తెలంగాణ పోలీసుకు సెల్యూట్

**దిశ నిందితుల ఎన్‌కౌంటర్ ఘటనపై సినీ ప్రముఖులు స్పందించారు. వారు కూడా ప్రభుత్వాన్ని, పోలీసులను ప్రశంసించారు. ఇవీ స్పందనలు.**





"చట్టం, న్యాయం భారతీయులకు రెండు కళ్ళు. మూడో కన్ను ధర్మం. అది లేకపోతే దిశా ఘోరం జరిగిన రోజే నాతోపాటు ఎందరో వెళ్లి ఆ నరరూప రాక్షసులను ముక్కలు ముక్కలుగా నరికి ఉండేవారు. పోలీసులు చట్ట ప్రకారం తమ పని తాము చేసుకుంటూ వెళుతుంటే వారి కన్ను కప్పి పారిపోవడం వేరు. వారి చేతిలోని ఆయుధాలను గుంజుకుని వారినే చంపాలని చూస్తే వారిదగ్గరున్న ఆప్షన్ ఎన్‌కౌంటర్ మాత్రమే. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఆత్మవేదనలో ఉన్న భారతీయుల కోసం భగవంతుడే వారికి ఈ శిక్ష విధించాడని భావిస్తున్నాను. ఇది దిశాకు సరైన నివాళి. తెలంగాణా పోలీసును అభినందిస్తున్నాను"

**- మోహన్‌బాబు**



పొద్దునే న్యాయం జరిగిందన్న వార్తతోనే లేచాను.

**- అక్కినేని నాగార్జున**



జస్టిస్ సర్వ్‌డ్. రెస్ట్ ఇన్ పీస్ దిశా

**- జూనియర్ ఎన్టీఆర్**



ఊరికి ఒక్కడే రౌడీ ఉండాలి. వాడు పోలీసోడు అయ్యుండాలి.

**- నాని**



తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చేతులెత్తి మొక్కుతున్నాను. మీరు నిజమైన హీరోలు. నేనెప్పుడైనా ఒకటే నమ్ముతాను. మనకు కష్టమొచ్చినా, కన్నీళ్లొచ్చినా పోలీసోడే వస్తాడు. నువ్వే దిక్కు. రక్షించాలని దేవుడికి మొక్కినా ఆ దేవుడు కూడా పంపించేది పోలీసోడినే.

**-పూరీ జగన్నాథ్**



ఐ లవ్ తెలంగాణ. భయం అనేది గొప్ప పరిష్కారం. కొన్నిసార్లు ఒకే ఒక్క పరిష్కారం.

**- సమంత**



రేప్‌లాంటి నేరం చేసిన తర్వాత మీరెంత దూరం పరిగెడతారు?

**- రకుల్‌ప్రీత్ సింగ్**



రెస్ట్ ఇన్ పీస్ డాక్టర్ ప్రియాంక రెడ్డి. ఒక మహిళను రేప్ చేయాలనే ఆలోచన చేస్తే, అలాంటి వ్యక్తులకు ఈ సంఘటన బలమైన సందేశాన్ని పంపిందని నేను నమ్ముతున్నా.

**- పూజా హెగ్డే**

బాధిత కుటుంబం బాధను ఎవరూ నివారించలేరు. కానీ, ఈ ఘటనతో కొంతయినా తగ్గించినట్లవుతుంది. దిశ ఆత్మకు శాంతి చేకూరాలి. శభాష్ పోలీస్.

**- కల్యాణ్‌రామ్**

అవమానవీయ, భయంకరమైన నేరానికి పాల్పడిన నిందితులకు సరైన శాస్తి జరిగింది.

**- నిఖిల్**

ఆ బుల్లెట్టు దాచుకోవాలని ఉంది. ఆ తుపాకులకు దండం పెట్టాలని ఉంది. ఆ పోలీసుల కాళ్లు మొక్కాలని ఉంది. నలుగురు చచ్చారనే వార్తలో ఇంత కిక్కు ఉందా? ఈ రోజునే ఆత్మ దేవుడ్ని చేరింది చెల్లెమ్మా!

**- మంచు మనోజ్**

ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ సజ్జన్నార్ లాంటి అధికారి ఉండాలి. 120 కోట్ల మంది ఉన్న దేశంలో కోటి మంది వెధవలు చనిపోయినా నష్టం లేదు.

**- శివాజీ రాజా**

మా ట్రైలర్స్, టీజర్స్ లైక్ చేయకపోయినా పర్వాలేదు. ప్లీజ్ ఈ ఎన్‌కౌంటర్ న్యూస్ మాత్రం ట్రెండింగ్ చేయండి... ఇలా జరిగింది అని చాటింపు వేయండి

**- హరీశ్ శంకర్**

దోషి అనే వాడు శాశ్వతంగా ఈ లోకంలో ఉండకూడదు. ప్రతి స్త్రీ కూడా మన తల్లి, చెల్లి, అక్క అని భావించాలి.

**- సి.కళ్యాణ్**

# విజయమే లక్ష్యంగా తీశాడు!

**- తనికెళ్ల భరణి**


మున్నా కాశీ, భరణి

"విజయమే లక్ష్యంగా కొత్త పాయింట్‌తో మున్నా కాశీ ఈ సినిమా తీశాడు. వైవిధ్యమైన చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తున్న ఈ తరుణంలో ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నా" అని తనికెళ్ల భరణి అన్నారు. సంగీత దర్శకుడు మున్నా కాశీ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'హేజా'. ఎ మ్యూజికల్ హారర్... ఉపశీర్షిక. కెవిఎస్ఎన్ మూర్తి నిర్మాత. ఈ నెల 12న విడుదల కానుంది. గురువారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. మున్నా కాశీ మాట్లాడుతూ "తెలుగులో వస్తున్న తొలి మ్యూజికల్ హారర్ చిత్రం ఇదేనని అనుకుంటున్నా. ఒక సంగీతకారుడికి, దెయ్యానికి ఉన్న సంబంధం ఏంటనేది సినిమా" అన్నారు.

# తన్నీరు రెండో సినిమా



"సీరియళ్లు తీసిన అనుభవంతో సినిమా నిర్మాతనయ్యా. మొదటి ప్రయత్నంగా 'ఎమ్6' సినిమా చేశా. అదే ఉత్సాహంతో ఇప్పుడు మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టబోతున్నాను" అని విశ్వనాథ్ తన్నీరు అన్నారు. శుక్రవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆయన బ్యానర్‌లో నూతన చిత్రాన్ని ప్రకటించారు. "కాన్సెప్ట్ బేస్డ్ సినిమా ఇది. లవ్, కామెడీ, సెంటిమెంట్‌తోపాటు ఇప్పటి జనరేషన్‌కి చక్కని సందేశం ఇస్తున్నాం. ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం" అని చెప్పారు.

# లిటిల్స్

### చేసేయండి!



**కావలసినవి:**

- లేత నీలంరంగు కాగితం
- ఆకుపచ్చ, గోధుమ రంగులు
- పాప్‌కార్న్
- జిగురు
- పెన్సిల్

## పాప్‌కార్న్ పూల చెట్టు

- లేత నీలం రంగు కాగితాన్ని తీసుకొని పెన్సిల్‌తో దానిమీద ఒక కొమ్మ, ఆకుల బొమ్మ గీయండి.
- కొమ్మను గోధుమ రంగుతో నింపండి.
- కొమ్మల చివర ఆకులకు ఆకుపచ్చ రంగు వేయండి.
- ఆకులపై అక్కడక్కడా పాప్‌కార్న్‌ను జిగురుతో అతికించండి.
- దూరం నుంచి చూస్తే తెల్లని పూలు పూసినట్టుగా కనిపిస్తుంది.
- ఈ బొమ్మను ఇంట్లో గోడకు అతికించి మీ స్నేహితులకు చూపించండి.




### బొమ్మ గీయండి



### సరైన నీడను గుర్తించండి



### డైలీ సుడోకు -216

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 8 | | 5 | 4 | | |
| | 1 | 9 | 7 | | | | | |
| 2 | | | | 3 | | | | |
| | 9 | | | | 1 | | 5 | 8 |
| | | 8 | 4 | | 9 | 2 | | |
| 1 | 5 | | 2 | | | | 9 | |
| | | | | 9 | | | | 7 |
| | | | | | 7 | 6 | 4 | |
| | | 1 | 6 | | 3 | | | |

**సుడోకు - 215 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 9 | 6 | 2 | 5 | 7 | 1 | 3 | 8 |
| 2 | 1 | 7 | 3 | 4 | 8 | 5 | 9 | 6 |
| 5 | 3 | 8 | 1 | 6 | 9 | 4 | 2 | 7 |
| 3 | 8 | 4 | 9 | 2 | 5 | 6 | 7 | 1 |
| 7 | 2 | 5 | 8 | 1 | 6 | 9 | 4 | 3 |
| 1 | 6 | 9 | 7 | 3 | 4 | 2 | 8 | 5 |
| 8 | 4 | 1 | 5 | 7 | 2 | 3 | 6 | 9 |
| 9 | 5 | 2 | 6 | 8 | 3 | 7 | 1 | 4 |
| 6 | 7 | 3 | 4 | 9 | 1 | 8 | 5 | 2 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.








SPECTACULAR! GIGANTIC!
kavya
KAVYA FILM COMPANY
PRESENTS
మామాంగం
HISTORY OF THE BRAVE
DIRECTED BY M PADMAKUMAR
PRODUCED BY VENU KUNNAPPILLY
BOOKS YOUR TICKETS ONLY ON
book my show
RELEASING ON DECEMBER 12TH


SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
వెంకి మామ
డిసెంబర్
13న
విడుదల
ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈరోజు సా॥ 6 గం॥ నుండి - ఖమ్మం లేక్ వ్యూ క్లబ్, ఖమ్మం


WON THE MATCH
IN ALL CENTRES
Mis(s) Match
Adhiroh Creative Signs
PRESENTS
మిస్ మ్యాచ్
....is the real Match
N V NIRMAL KUMAR
G SRIRAM RAJU - K BHARAT RAM


KICK FULL
ENTERTAINER
SARASWATHI SUKLA PRESENTS
KARTIKEYA CREATIVE WORKS
SVE
FROM THE MAKERS OF
RX100
90ML
Producer ASHOK REDDY GUMMAKONDA
Written & Directed by SEKHAR REDDY YERRA
ANUP RUBENS
CHANDRABOSE


viacom 18
STUDIOS
Parallel Minds
AKSHAYASRI
PRESENTS
HARSHITHA MOVIES
WITH THE BLESSINGS OF
DR.RAVURI VENKATASWAMY
KARTHI JYOTIKA SATHYARAJ
దొంగ
A JEETHU JOSEPH FILM
RAVURI. V .SRINIVAS
★ DECEMBER 2019 ★


AN ANIRUDH MUSICAL
AUDIO FROM TODAY
LYCA
SUBASKARAN
PRESENTS
SUPERSTAR
RAJINIKANTH
దర్బార్
AN A R MURUGADOSS FILM
SANTOSH SIVAN
ANIRUDH
SREEKAR PRASAD
SANKRANTI 2020

**జ్యేష్ఠ కార్తె | డిసెంబర్ 15 వరకు**

# రైతులకు మేలు చేయని విత్తన బిల్లు వృథా



**మోదీ ప్రభుత్వం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలనుకుంటున్న విత్తన ముసాయిదా బిల్లు రైతుల కోసం కాకుండా బహుళ జాతి కంపెనీల కొమ్ముకాసేదిగా ఉందన్నారు ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.రామాంజనేయులు. విత్తన కంపెనీల నుంచి రైతులకు తగినంత నష్టపరిహారం ఇవ్వడంతో పాటు మోసాలకు పాల్పడే విత్తన కంపెనీలకు భారీ జరిమానాలు విధించే విధంగా విత్తన బిల్లును రూపొందిస్తేనే రైతులకు మేలు జరుగుతుందంటున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది.**

## బహుళజాతి కంపెనీల కొమ్ముకాస్తే రైతన్నలకు తీవ్ర నష్టం
## సుస్థిర వ్యవసాయ కేంద్ర సారథి డాక్టర్ రామాంజనేయులుతో ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ

***విత్తన బిల్లు రూపొందించడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నదంటారా?***

ముసాయిదా విత్తన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చేందుకే కేంద్ర ప్రభుత్వానికి 15 ఏళ్లు పట్టింది. 1966లో కేంద్రం విత్తన చట్టం చేసింది. అప్పుడు ప్రభుత్వం మాత్రమే విత్తనాలు సరఫరా చేసేది. ఆ తరువాత సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. బహుళ జాతి ప్రైవేటు విత్తన కంపెనీలు కూడా బరిలోకి దిగాయి. నకిలీ విత్తనాలు పెరగడం, నష్టపరిహారాలు సరిగా అందక రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. దాంతో కేంద్ర ప్రభుత్వం 2004లో కొన్ని మార్పులతో విత్తన చట్టం చేసింది. ఆ చట్టం ద్వారా కూడా రైతులకు న్యాయం జరగడం లేదు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విత్తన చట్టంలో మార్పు చేయాలని కోరాయి. దాంతో కేంద్రం విత్తన బిల్లును రూపొందించింది. అందుకు 15 సంవత్సరాల కాలం పట్టడం దురదృష్టకరం. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కూడా ముసాయిదా బిల్లు ఆమోదం పొందుతుందన్న నమ్మకం లేదు. ముసాయిదా బిల్లులోని అంశాలు రైతులకు ఏమాత్రం మేలు చేసేవిగా లేవు. బహుళజాతి కంపెనీలు యథేచ్ఛగా రైతుల్ని దోచుకునేవిగా ఉన్నాయి. అయినా బిల్లు వల్ల తమకు నష్టం జరుగుతుందని ఆక్షేపించడంతో ముసాయిదా బిల్లుకు ఈసారి కూడా మోక్షం లభించదేమో అనే ప్రచారం జరుగుతోంది. విత్తన కంపెనీల నుంచి రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు? సేద్యానికి విత్తనం ప్రాణం. నాణ్యమైన విత్తనాలు లభించకపోతే దిగుబడి తగ్గుతుంది. రైతు తీవ్రంగా నష్టపోతాడు. కట్టుదిట్టమైన చట్టం ద్వారా ప్రభుత్వం ఈ సమస్యల నుంచి రైతుల్ని గట్టెంక్కించాలి. 2004లో చేసిన విత్తన చట్టం రైతులకు మేలు చేయడానికి బదులు విత్తన కంపెనీలు యథేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు బాటలు వేసింది. ఈ నేపథ్యంలో మాకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయండి. నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలను బాధ్యుల్ని చేసి నష్టపరిహారం ఇప్పించండి అని మాత్రమే రైతులు కోరుతున్నారు. గతంలో ప్రభుత్వం చేసిన చట్టాలు విత్తన కంపెనీలను ఏమాత్రం బాధ్యుల్ని చేసేవిగా లేవు. రైతులకు తగినంత నష్టపరిహారం ఇప్పించడంతో పాటు, మళ్లీ తప్పు చేయకుండా కంపెనీలకు భారీ జరిమానాలు విధించేందుకు వీలు కల్పించే విధంగా కొత్త చట్టం రావాల్సిన అవసరం ఉంది.

***విత్తన ముసాయిదా బిల్లు - 2019లో ఎలాంటి మార్పులు చేయాలని మీరు కోరుతున్నారు?***

ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న విత్తన బిల్లు ప్రకారం ప్రైవేటు కంపెనీల నుంచి కొనుగోలు చేసిన విత్తనం మొలకెత్తకపోతే రైతులు నష్టపరిహారం కోసం వినియోగదారుల కోర్టును ఆశ్రయించాలి. ఇన్ని కిలోల విత్తనాలు మొలవకపోతే నామమాత్రంగా ఇంత మొత్తం చెల్లించాలని మాత్రమే బిల్లులో పేర్కొన్నారు. అలా



కాకుండా రైతులకు ఎంత నష్టం జరిగిందో అంత మొత్తాన్ని విత్తన కంపెనీలు పరిహారంగా చెల్లించాలని మేం కోరుతున్నాం. పంట ప్రారంభంలో విత్తనం మొలకెత్తకపోతే నష్టం కొంతవరకే ఉంటుంది. విత్తనం మొలకెత్తిన తరువాత పూత రాకపోతే రైతు అప్పటివరకు పెట్టిన పెట్టుబడి నంతా నష్టపోతాడు. అలాంటి సమయంలో రైతులకు తగినంత నష్టపరిహారం రావడం లేదు. ఇలాంటి వేలాది కేసులు దశాబ్దాలుగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. కాబట్టి రైతులకు నష్టపరిహారం విషయాన్ని బిల్లులో స్పష్టంగా పేర్కొనాలని మేం డిమాండ్ చేస్తున్నాం.

***బిల్లును యథాతథంగా ఆమోదిస్తే ఎలాంటి నష్టం జరుగుతుంది?***

గత 15 ఏళ్లలో చిన్న విత్తన కంపెనీలు, విత్తన కార్పొరేషన్లు ఉనికి కోల్పోయాయి. ఏటా 16 వేల కోట్ల విత్తన వ్యాపారం జరుగుతుంటే అదంతా నాలుగైదు కంపెనీల చేతుల్లో కేంద్రీకృతమైంది. దీనివల్ల ఆ కంపెనీలు ఆడింది ఆటగా పరిస్థితి మారుతోంది. మనం ఏ పంట పండించాలో కూడా ఆ కంపెనీలే నిర్ణయిస్తున్నాయి. మన దేశంలో సాగవుతున్న 65 శాతం భూముల్లో కేవలం నాలుగైదు పంటలే పండించడం ఇందుకు ఉదాహరణ. ఈ పరిణామాల వల్ల రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. తాజా బిల్లు ఆ కంపెనీల కొమ్ముకాసేది కాకుండా రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందిస్తేనే రైతులకు, దేశానికి మేలు జరుగుతుంది.

***విత్తన బిల్లులో రాష్ట్రాల పాత్ర ఎలా ఉండాలి?***

విత్తనాలు జాతీయ సంస్థల వద్ద నమోదు చేసుకోవాలని చట్టం చెబుతోంది. ప్రాంతీయంగా నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఎలాంటి విత్తనాన్ని అనుమతించాలనే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలి. అందుకోసం కేంద్రంతో పాటు రాష్ట్రాలకు కూడా విత్తనాలు నమోదు చేసుకునే అవకాశం ఉండాలి. కొత్త ముసాయిదా బిల్లు వస్తే గతంలో చేసిన చట్టాలన్నీ రద్దవుతాయి. గతంలో బిటి పత్తి విత్తనాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తెచ్చింది. ఆ చట్టంతో పాటు గతంలో చేసిన విత్తన నియంత్రణ చట్టంలోని కీలక అంశాలను కూడా తాజా ముసాయిదా బిల్లులో తప్పక చేర్చాలి.

***మన దేశంలో విత్తన కంపెనీలు భారీ రాయల్టీ వసూలు చేస్తున్నాయనే విమర్శ ఉంది కదా?***

అంతర్జాతీయంగా విత్తన కంపెనీలకు 5 శాతం రాయల్టీ లభిస్తోంది. మన దేశంలో మాత్రం 100 నుంచి 200 శాతం వరకు రాయల్టీ చెల్లిస్తున్నాం. దీనిపై ఏమాత్రం నియంత్రణ లేదు. అందుకే ప్రభుత్వం రాయల్టీ అంశాన్ని కూడా బిల్లులో చేర్చాలి. ఇకపోతే విదేశీ కంపెనీలు ధృవీకరించిన విత్తనాలను మనం దిగుమతి చేసుకునేందుకు తాజా బిల్లు ఆమోదముద్ర వేస్తోంది. ఇది సరి కాదు. చైనా విత్తనాన్ని చైనా కంపెనీ ధృవీకరించుకుంటే ఆ విత్తనం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భూములకు అనుకూలమో కాదో ఎలా తెలుస్తుంది? అందుకే విత్తనాల నాణ్యతను స్థానికంగా ధృవీకరించే అవకాశం ఉండాలి.

- కృషి డెస్క్





పలు పంటల సాగులో భాగంగా కనకాంబరం, బంతిపూల తోటలో రైతు నాగరాజు

# పల్లెకు జవం.. జీవం

## ఎకరం భూమిలో 22 రకాల పంటల సాగు.. మంచి ఆదాయం పొందుతున్న కడప జిల్లా రైతు

**వ్యవసాయ శాఖ ప్రారంభించిన పల్లెజీవం పథకం కరవు ప్రాంతాల రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. సేంద్రియ పద్ధతితో పాటు బహుళ పంటల సాగుతో మంచి ఆదాయం పొందుతున్నారు కడప జిల్లా కురువపల్లెకు చెందిన రైతు నాగరాజు. స్వల్పకాలిక పంటల నుంచి నిత్యం ఆదాయం పొందుతున్న ఆ రైతు ప్రస్థానం ఇది.**

కడప జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లె గ్రామం కురవపల్లెకు చెందిన రైతు దేవరింటి నాగరాజు చిన్నతనం నుంచి వ్యవసాయం చేస్తున్నారు. వాణిజ్య పంటల సాగు లాభాలు ఇవ్వకపోగా నష్టాలను తెచ్చిపెట్టింది. దీంతో ఆయన ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. ఈ లోగా వ్యవసాయ శాఖ పల్లెజీవం పథకం ప్రారంభించింది. చిన్న కమతాల్లో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందేలా సన్న చిన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఈ పథకం పట్ల నాగరాజు ఆకర్షితులయ్యారు. తనకున్న 1.10 ఎకరాల్లో ఆరు మాసాల క్రితం పల్లెజీవం పథకం కింద వివిధ పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రధాన పంటగా కనకాంబరాలు సాగు చేశారు. అంతర పంటలుగా స్వల్పకాలిక పంటలైన కొత్తిమీర, గోంగూర, చిన్న ఉల్లిపాయలు, బంతి, కంది, బెండ, గోరుచిక్కుడు, చిక్కుడు, కాకర, బీర సాగు చేశారు. కంచె పంటగా ఆముదాల సాగు చేపట్టారు. దీర్ఘకాలిక పంటలుగా అల్లనేరేడు, పులుసు నిమ్మ, దానిమ్మ, సపోటా, కొబ్బరి, గంగనేరేడు వంటి పండ్ల మొక్కలతో పాటు అవిశ పంట సాగు చేపట్టారు. ఈ పంటలన్నింటి సాగుకు కేవలం 18 వేల రూపాయల ఖర్చయింది. సాగు చేసిన స్వల్పకాలిక పంటల నుంచే పెట్టుబడి తిరిగి వచ్చిందన్నారు ఆ రైతు. బంతి పూలు విక్రయించగా రూ.15 వేలు, గోంగూరతో రూ.3 వేలు, కొత్తిమీరలో రూ.2 వేలు, చిక్కుడు, గోరుచిక్కుడులో రూ.5 వేలు, కాకర, బీరలలో రూ.1000 ఆదాయం వచ్చిందని వివరించారు. ప్రధాన పంట కనకాంబరం దిగుబడి ఇప్పుడిప్పుడే మొదలైందంటున్నారు. తొలి కోతలో రూ.750 వచ్చిందని, దీర్ఘకాలిక పంట కావడంతో రోజూ ఆదాయం ఉంటుందని ఆ రైతు వివరించారు. బహువార్షిక కంది సాగు చేపట్టానని, దీర్ఘకాలంలో కంది నుంచి కూడా ఆదాయం వస్తుందని ఆ రైతు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే పండ్లమొక్కలు పెద్దవైతే మంచి ఆదాయం వస్తుందన్నారు. అల్లనేరేడు కిలో రూ.100 పలుకుతుందని, నిమ్మ, దానిమ్మ, ఇతర పంటల నుంచి ఆదాయం రావడంతో పాటు ఇంటి అవసరాలకు పండ్లు కొనాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

గాలిలోని తేమ ఆధారంగా చేసే డ్రైసోయింగ్ సాగుకు ఎంతో లాభదాయకమని ఆ రైతు వివరించారు. అర ఎకరం పొలంలో జీరో బేస్డ్ వ్యవసాయం పల్లె జీవం పథకాల కింద డ్రైసోయింగ్ పంటలను సాగు చేశారు. ఇందులో జొన్న, కంది, గోంగూర, నువ్వులు... ఇలా తొమ్మిది రకాల విత్తనాలు విత్తారు. ప్రస్తుతం కొన్ని పంటలను నూర్పిడి చేయగా మరికొన్ని పంటలు సాగులోనే ఉన్నాయి. వర్షాలు లేని సమయంలో డ్రైసోయింగ్ విధానంలో సాగు ఎంతో లాభదాయకం అన్నారు నాగరాజు. ఒక బస్తా నువ్వులు, అర బస్తా జొన్న, అర బస్తా కందులు దిగుబడి వస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన వివరించారు.

### కషాయాలతో మంచి దిగుబడి

ప్రకృతి విధానంలో పంటల సాగు ఎంతో లాభదాయకమన్నారు నాగరాజు. జీవామృతం, ఘన జీవామృతం, వేపపిండి కషాయం, పులసర చెక్క కషాయం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, వాయిలాకు కషాయం వంటివి సొంతంగా తయారు చేసుకుని పంటలపై చల్లుతున్నట్లు ఆయన వివరించారు. పంటలకు చీడపీడలు రాకుండా ఈ కషాయాలు, జీవామృతాలు అద్భుతంగా పనిచేస్తున్నాయన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించగలుగుతున్నానని ఆ రైతు చెప్పారు. తన పొలానికి ఉపయోగించగా మిగిలిన కషాయాలను ఇరుగు పొరుగు రైతులకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందడం ఈ రైతు ప్రత్యేకత.

- ఆంధ్రజ్యోతి, చిన్నమండెం

### సేంద్రియ పంటలతోనే ఆరోగ్యం

ప్రకృతి విధానంలో పండించిన పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. జీవామృతాలు, కషాయాలను ఉపయోగించి పండించిన పంటలు నాణ్యంగా, రుచికరంగా కూడా ఉంటాయి. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించేందుకు ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. ఈ విధానంలో సాగయిన పంటలు ఎక్కువ కాలం నిల్వ కూడా ఉంటాయి. రైతులంతా ప్రకృతి విధానంలో పంటలు సాగు చేస్తే ప్రజల ఆరోగ్యం మెరుగవడంతో పాటు రైతుల ఆదాయం కూడా రెండింతలవుతుంది.

- దేవరింటి నాగరాజు

# తిరుపతిలో చూడచక్కని మిద్దెతోట

*ఉద్యోగంతో పాటు బాధ్యతగా మిద్దెతోటలు సాగుచేసే వారు అరుదు. తిరుపతి పట్టణానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతోద్యోగి విష్ణుప్రియ నిర్వహిస్తున్న మిద్దెతోట గురించి పరిచయం చేస్తున్నారు ప్రముఖ మిద్దెతోట నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి.*



మిద్దెతోటల సంస్కృతి వ్యాప్తిలో భాగంగా ఇది వరకు మూడు మోడల్ మిద్దెతోటల గురించి తెలుసుకున్నాం. దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న ఇటుక మడుల మిద్దెతోట, మంచిర్యాలలో ఉన్న పక్కా ఇటుక మడుల మిద్దెతోట, ఘట్‌కేసర్‌లోని ఫైబర్ టబ్బుల మిద్దెతోట గురించి తెలుసుకున్నాం. ఈసారి మనం తిరుపతిలో ఉన్న మోడల్ మిద్దెతోట గురించి తెలుసుకుందాం. ఆ మిద్దెతోట నిర్వాహకులు స్టేట్‌బ్యాంక్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న విష్ణుప్రియ. ఈమె భర్త సీనియర్ పాత్రికేయులు, ప్రముఖ కథారచయిత. వీరు నాలుగేళ్లుగా మిద్దెతోట నిర్వహిస్తున్నారు. పక్కా ఇటుకల మడులతో, ఫైబర్ మడులతో ఉన్నది వీరు సాగుచేసే మిద్దెతోట. పది సంవత్సరాల క్రితం వరకు మిద్దెతోటలకు సరైన సాధనం లేదు. ఎవరికి తోచిన పద్ధతిలో వారు చేసుకునేవారు. ఏ పగిలిన పాత ప్లాస్టిక్ బకెట్‌లో లేక ఏ చిన్న మట్టి లేదా సిమెంటు కుండీల్లోనో మిద్దెతోటలు సాగుచేసేవారు. పటిష్ఠమైన ఇటుక మడుల డిజైన్ అందుబాటులోకి రావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో మిద్దెతోటల నిర్మాణం ఊపందుకుంది. రెండు సంవత్సరాలుగా ఫైబర్ టబ్బులు కూడా అందుబాటులోకి రావడంతో ఒక్కరోజులోనే మిద్దెతోట నిర్మాణం సాధ్యమవుతోంది. తిరుపతిలో మొదటి పక్కా మిద్దెతోట విష్ణుప్రియ గారిదే. మేసన్ పనివారిని పెట్టుకుని నాలుగు అడుగుల వెడల్పు, ఒక అడుగు లోతు కలిగిన ఇటుకల మడులను కట్టించుకున్నారు. వాటికి తోడు ఫైబర్ టబ్బులను కూడా వాడారు. పండ్ల మొక్కలను పెంచడానికి చక్కని సాధనం ఫైబర్ మడులు. చాలా రకాల కూరగాయల మొక్కలు, ఎర్ర చిక్కుడు, పొదచెమ్మ, సొర, బెండ వంటివే కాకుండా ఆకుకూరలు, అరటి, ద్రాక్ష, ఆపిల్ బేర్ వంటి పండ్ల మొక్కలు కూడా ఉన్నాయి. రకరకాల పూల మొక్కలు కూడా పెంచుతున్నారు. గత నాలుగేళ్లుగా బయటి మార్కెట్ మీద ఆధారపడకుండా ప్రకృతి సిద్ధంగా సేద్యం చేస్తూ కూరగాయలను, పండ్లను పండించుకుంటున్నారు. మిద్దెతోట మూలంగా ఇల్లు చల్లగా ఉంటుందని, మిద్దెతోట సేద్యం వల్ల శరీరానికి అవసరమైన వ్యాయామం లభిస్తోందని, అరగంట పాటు మిద్దెతోటలో గడిపితే ధ్యానం చేసినంత మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెబుతున్నారు విష్ణుప్రియ దంపతులు. అన్నింటినీ మించి రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడని కూరగాయలు, పండ్లని ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఇప్పటికే ఈ మిద్దెతోటను చాలామంది సందర్శించారు. మిద్దెతోట కల్చర్ వ్యాప్తికి కూడా విష్ణుప్రియ కృషి చేస్తున్నారు. తిరుపతి వెళ్లి వెంకటేశ్వరస్వామిని, అమ్మవారిని, ఇతర ఆలయాలను దర్శించినట్టుగానే ఈ మిద్దెతోటను కూడా చూడండి. వారి వాట్సాప్ నెంబర్ 89854 25888కు ముందుగా మెసెజ్ పెట్టి అనుమతి తీసుకుని వెళ్ళి చూడవచ్చు.





మిద్దెతోటలో విష్ణుప్రియ

# నెలాఖరుకు వరినాట్లు ముగించాలి



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగానికి ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చేస్తున్న వ్యవసాయ సూచనలు ఇవి.**

సలహా

- దాళ్వా వరి సాగు చేసే రైతులు డిసెంబరు నెలాఖరుకల్లా నాట్లు పూర్తి చేసుకోవాలి. వెదజల్లు పద్ధతిలో సాగు చేసే రైతులు డిసెంబరు మొదటి వారం లోపు విత్తుకోవాలి.
- దాళ్వాకు 120-125 రోజులు కాలపరిమితి కలిగిన రకాలు సాగుకు మిక్కిలి అనుకూలంగా ఉంటాయి. దోమ పోటును, అగ్గి తెగులును తట్టుకుని గింజ రాలిక తక్కువ కలిగి, చేనుపై పడని రకాలు సాగు చేయడం మేలు.
- దాళ్వాకి ఎం.టి.యు. 1121 (శ్రీధృతి), ఎం.టి.యు. 1153 (చంద్ర), ఎం.టి.యు. 1156 (తరంగిణి), ఎం.టి.యు. 3626 (ప్రభాత్), ఐ.ఆర్ 64, ఎన్.ఎల్.ఆర్ 34449 (నెల్లూరు మషూరి), ఎం.టి.యు. 1210 (సుజాత), ఎన్.ఎల్.ఆర్ 3354 (నెల్లూరు ధాన్యరాశి) రకాలు సాగుకు అనువైనవి. నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకుని సాగు చేసుకోవాలి.
- సార్వాలో పండించిన పైన తెలిపిన రకాలను దాళ్వాలో నిద్రావస్థ తొలగించడానికి లీటరు నీటికి 6.3 మిల్లీలీటర్ల గాఢ నత్రికామ్లంలో 24 గంటలు నానబెట్టిన తరువాత 24 గంటల పాటు మండి కట్టుకుంటే మొలక సరిగా వస్తుంది.
- నాటు విధానంలో ఎకరానికి 20-25 కిలోలు, వెదజల్లే పద్ధతిలో, యంత్రాలతో నాటే విధానంలో 10-12 కిలోలు, బెంగాల్ నాటు విధానంలో 8-10 కిలోలు విత్తనం సరిపోతుంది.
- యంత్రాలతో సాగు చేసేటప్పుడు బెంగాల్ ఊడ్పు విధానంలో లేత నారు (16-18 రోజుల వయస్సు) వాడుకోవాలి.
- 5 సెంట్ల నారుమడికి దమ్ములో 12 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, నారుమడి చల్లిన వారం నుండి పది రోజులకు 2 కిలోల యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.
- నారుమడిలో కలుపు నివారణకు ప్రిటిలాక్లోర్ 50% ద్రావకం 2 మి.లీ., లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. నారు ఎదిగే దశలో ఇంకా కలుపు ఉన్నట్లయితే 15వ రోజున సైహలోఫాస్ బ్యుటైల్ 10% ద్రావకం 2 మి.లీ., లేదా బిస్పైరిబాక్ సోడియం 10% ద్రావకం లీటరు నీటికి 0.4 మి.లీ., చొప్పున ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి.

**రైతులు మరిన్ని సలహాల కోసం ఉచిత ఫోన్ నెంబర్ 1800-425-0430ను సంప్రదించవచ్చు.**

# తేనెటీగలు.. లాభాలకు బాటలు

*మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేపట్టేందుకు ఎక్కువ శాతం మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో లాభసాటిగా ఉన్న తేనెటీగల పెంపకంపై రైతులు దృష్టి సారిస్తున్నారు. పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడంతో పాటు మంచి ఆదాయం ఇచ్చే తేనెటీగల పెంపకం విశేషాలివి.*





స్వచ్ఛమైన తేనెకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. దీంతో తేనెటీగల పెంపకంపై రైతులు దృష్టి సారిస్తున్నారు. రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉండటంతో ప్రభుత్వం కూడా రైతులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నది. ఇతర పంటలను సాగు చేసుకుంటూనే తేనెటీగలను పెంచుకునే అవకాశం ఉంది. తేనెటీగల పెంపకం కోసం ప్రత్యేకంగా స్థలం కానీ, పొలం కానీ అవసరం లేదని, పెద్దగా పెట్టుబడి కూడా అవసరం లేదు. స్వచ్ఛమైన తేనెను అందించే తేనెటీగలు ఏ రకంగా ఉంటాయో తెలుసుకుని వాటిని పెంచితే మంచి లాభాలు గడించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొంటె తేనెటీగలు, విసనకర్ర తేనెటీగలు, పుట్ట లేక దేశవాళి తేనెటీగలు, ఐరోపా తేనెటీగలు, కొండిలేని తేనెటీగలు... ఈ అయిదు రకాల తేనెటీగల్లో దేశవాళి, ఐరోపా తేనెటీగలే నాణ్యమైనవి. వీటి ద్వారానే తేనె పుష్కలంగా లభిస్తుంది. వివిధ రకాల పుష్పాల్లో లభించే మకరందాన్ని, పుప్పొడి, వంటి వాటిని తేనెటీగలు సేకరించి నాణ్యమైన తేనెను అందిస్తాయి. సమీపంలో పంటలే తేనెకు ఆధారం. పంటలు, తోటలు అధికంగా ఉన్న ప్రదేశాలు వీటి పెంపకానికి అనువైనవి. అలాంటి చోట ఎక్కువ తేనె ఉత్పత్తి అవుతుంది. పండ్ల మొక్కలు, కూరగాయలు, అపరాలు, సుగంధ ద్రవ్యాలు, నూనె గింజలు, ధాన్యాలు, ఇతర జాతి మొక్కల వద్ద ఈ తేనెటీగలను పెంచవచ్చు. తేనెటీగలను ఒకేచోట ఎక్కువకాలం పెంచడం వల్ల ఆ ప్రాంతంలో ఉండే మొక్కల నుంచి వచ్చే మకరందం, పుప్పొడి క్రమేపి తగ్గిపోతుంటుంది. కాబట్టి ప్రతి 15 రోజులకు ఒకసారి తేనెపట్టులు వుంచే స్థానాన్ని మార్చుకుంటూ పోవడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు. తేనెటీగల పెంపకం ద్వారా స్వచ్ఛమైన తేనెతోపాటు మైనం, పుప్పొడి, రాజాహారం, వివిధ జబ్బులను నయంచేసే, సౌందర్య సాధనాలు తయారుచేసేందుకు వినియోగించే విషం, ప్రొపోలస్ వంటి ఉప ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం సంపాదించవచ్చు. మార్కెట్‌లో తేనెపట్టుకు మంచి డిమాండ్ ఉండడంతో లీటరు రూ.500 వరకూ ధర పలుకుతోంది. ఒక హెక్టారుకు 3 కాలనీలు (పెట్టెలు) పెడితే మంచి దిగుబడి వస్తుంది. 3 పెద్ద ఈగలు (ఐరోపా ఈగలు), 2 చిన్న ఈగలను (దేశవాళి ఈగలు) ఒక కాలనీగా పరిగణిస్తారు. ఏడాదికి ఒక్కో పెట్టె నుంచి 20 నుంచి 25 కేజీల స్వచ్ఛమైన తేనె లభిస్తుంది. తేనెటీగలు పెంచే ప్రాంతంలో వేసిన కొన్ని రకాల పంటల దిగుబడులు పెరుగుతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ముఖ్యంగా ఆవాలు పంట వద్ద తేనెటీగలు వేస్తే పంట దిగుబడి శాతం 43 శాతానికి పైగా పెరుగుతుంది. ప్రొద్దుతిరుగుడు పంట 35-48 శాతం వరకూ పెరుగుతుంది. ప్రత్తిపంట 19 శాతం, లూసర్న్ 112 శాతం, ఉల్లి 93 శాతం, ఆపిల్ 44 శాతం దిగుబడి పెరుగుతుందని పరిశోధనల్లో వెల్లడైంది.

- ఆంధ్రజ్యోతి, తాడేపల్లిగూడెం వ్యవసాయం

### అవగాహనతో భారీ లాభాలు



తేనెటీగల పెంపకంపై పూర్తి అవగాహనతో సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయి. దీనితో పాటు మనం పండించే పంటకు కూడా ఈ తేనెటీగలు లాభాలు తెస్తాయి. సహజమైన, స్వచ్ఛమైన తేనెకు మంచి ధర లభిస్తుంది. ప్రస్తుతం తేనెకు ఉన్న డిమాండ్‌ను అర్థం చేసుకుని రైతులు తేనెటీగల పెంపకం చేపడితే లాభదాయకం.

- జి.శాలిరాజు, కీటకశాస్త్రవేత్త

సమాచారం

### 8న అవగాహన సదస్సు

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలోని కొర్నెపాడులో ఉన్న రైతుశిక్షణా కేంద్రంలో డిసెంబర్ 8వ తేదీ ఆదివారం నాడు వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ అవగాహన కార్యక్రమం జరుగుతుంది. ఇందులో చిరుధాన్యాలతో తయారుచేసే తినుబండారాలు నువ్వుల లడ్లు, వేరుశనగ చిక్కీలు, జొన్నలు- అరికలు- కొర్రలతో తయారుచేసే మురుకులు, బూందీ మొదలైన వాటి తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపెడతారు. అనంతరం శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోగోరేవారు 97053 83666, 0863-2286255 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.




# ఇంకా ఊగిసలాటలోనే
# అమరావతి రియల్టీ

రాజధాని అమరావతి స్థిరాస్తి రంగంలో ఇంకా ఊగిసలాట కొనసాగుతోంది. గత ప్రభుత్వం చేపట్టిన గృహ, మౌలిక ప్రాజెక్టుల పూర్తిపై సీఎం జగన్ కొంత స్పష్టత ఇచ్చినా, ఇంకా పూర్తి స్పష్టత కోసం మార్కెట్ వర్గాలు ఎదురు చూస్తున్నాయి. అప్పటి వరకు మార్కెట్లో ఈ అనిశ్చితి తప్పదని భావిస్తున్నారు.

## పెండింగ్‌లో రూ. 1,300 కోట్ల బిల్లులు..స్పష్టత కోసం ఎదురు చూపులు

అమరావతిలో తుది దశకు చేరిన కొన్ని కీలక ప్రాజెక్టుల పూర్తికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో గత ఆరు నెలలుగా ఆగిపోయిన ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ టవర్లు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లతో కూడిన ఎల్‌పీఎస్ జోన్ల అభివృద్ధి పనుల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. ఈ చర్యతో అనిశ్చితిలో ఉన్న అమరావతి రియల్టీలో కాస్తంత కదలిక వచ్చింది.

### ధరల్లో కదలిక

ముఖ్యమంత్రి నిర్ణయంతో అమరావతి రియల్టీకి మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని ప్లాట్ల యజమానులు, ఇతర వర్గాలు సంతోషపడ్డాయి. కొంత మందైతే 'అమరావతి' సెంటిమెంట్ మరోసారి పుంజుకుంటుందని భావించారు. అందుకు తగ్గట్టే గత 10 రోజుల్లో రాజధాని ప్రాంతంలో ప్లాట్ల గురించి వాకబు చేసే వారి సంఖ్య కొద్దిగా పెరిగింది. ప్లాట్ల ధరలూ చదరపు గజానికి సగటున రూ.500- 1500 వరకూ పెరిగాయి.

### సీఎం ప్రకటనే చాలదు

అయితే సీఎం ప్రకటనతోనే అమరావతి రియల్టీ గాడిన పడే అవకాశం కనిపించడం లేదు. ఆగిపోయిన అభివృద్ధి పనులు ప్రారంభమైతేనే అసలైన ఊపు వస్తుందని మార్కెట్ వర్గాల అంచనా. ఈ ప్రాజెక్టులు చేపట్టిన కంపెనీలకు ప్రభుత్వం నుంచి రూ.1,300 కోట్ల వరకు అందాల్సి ఉంది. ఈ బకాయిల్లో కొంతైనా అందితే తప్ప, ఈ కంపెనీలు పనులు పునఃప్రారంభించే అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి చూస్తే ఇది ఇపుడిపుడే సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఒకవేళ నిధులు విడుదల చేసి పనుల మొదలు పెట్టినా, మార్కెట్ పుంజుకునేందుకు ఎంత లేదన్నా కొన్ని వారాల సమయం పడుతుంది. అప్పటి వరకు ప్లాట్ల ధరలు ఇప్పుడున్న స్థాయిలోనే కొనసాగుతాయని భావిస్తున్నారు.

### కంపెనీల తిప్పలు

రాజధాని అమరావతి ప్రాంతంలో కొన్ని కంపెనీలు ప్రభుత్వం తరఫున అనేక ప్రాజెక్టులు చేపట్టాయి. ఇందులో కొన్ని 75 శాతం వరకు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1,300 కోట్ల వరకు రావాల్సి ఉంది. ఈ బిల్లులు ఎప్పుడు క్లియర్ అవుతాయో తెలియక కంపెనీలు కొన్ని నెలలుగా పనులు ఆపేశాయి. ఉద్యోగులు, యంత్ర సామాగ్రినీ వేరే ప్రాంతాలకు తరలించాయి. పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లిస్తేనే తిరిగి పనులు మొదలు పెట్టాలని అవి భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికిప్పుడు బిల్లులు చెల్లించినా, ఈ కంపెనీలు మళ్లీ పనులు ప్రారంభించడం జనవరి తర్వాతగానీ సాధ్యం కాకపోవచ్చు.

### సచివాలయం, హెచ్‌వోడీలపై అనిశ్చితి!

సీఎం ప్రకటనకు కట్టుబడి ప్రభుత్వం రాజధానిలోని కొన్ని కీలక ప్రాజెక్టులను పూర్తి చేయించినా, ఈ ప్రాంత రియల్టీలో మళ్లీ గత జోరును చూడడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఎం ప్రకటన.. చాలా వరకూ పూర్తయి, తుది దశలో ఉన్న ప్రభుత్వ గృహ టవర్లు, వాటికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఎల్‌పీఎస్ జోన్ల దశల వారీ అభివృద్ధికి మాత్రమే పరిమితమనే విషయాన్ని మార్కెట్ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయాలు, శాసనసభ, హైకోర్టు తదితరాలను గత ప్రభుత్వం నిర్ణయించిన విధంగా అమరావతిలోని గవర్నమెంట్ సిటీలోనే ఉంచాలా? లేక మరెక్కడికైనా మార్చాలా? అనే విషయాల్ని రాష్ట్ర ప్రభుత్వం 'నిపుణుల కమిటీ' నివేదిక ఆధారంగా తీసుకోబోతున్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.



### మారిస్తే శరాఘాతమే

అసెంబ్లీ, సెక్రటేరియట్- హెచ్‌వోడీ టవర్లు, హైకోర్టులను అమరావతిలోని ప్రభుత్వ నగరం నుంచి మరే ప్రదేశానికైనా మార్చాలని నిర్ణయిస్తే, అది అమరావతి రియల్టీకి శరాఘాతమే అవుతుంది. అసెంబ్లీ, సెక్రటేరియట్ తదితరాలను చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి చేరువలోకి మార్చే అంశాన్ని ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే అమరావతి ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, గెజిటెడ్ అధికారులు, ఎన్జీవోల నివాసం కోసం ఉద్దేశించిన హౌసింగ్ టవర్లు, కొన్ని రహదారులు, ఎల్‌పీఎస్ జోన్ల అభివృద్ధి పనులకే పరిమితమవుతుంది. ఆ పనులతో రాజధాని రియల్టీకి పెద్దగా ఒరిగేదేమీ ఉండదు.

### వేచి చూడడమే మేలు

రాజధాని అమరావతిని నమ్ముకుని ఈ ప్రాంత రియల్టీలో చాలా మంది పెట్టుబడులు పెట్టారు. వారిలోనూ చాలా మంది ఇలానే భావిస్తున్నారని తెలుస్తోంది. ప్రభుత్వం రాజధాని భవితపై విస్పష్ట ప్రకటన చేసే వరకు ఆగడమే మంచిదని వీరు భావిస్తున్నారు. కొత్త ఇన్వెస్టర్లూ ఇప్పటికిప్పుడే పెట్టుబడులు పెట్టేందుకు సాహసించడం లేదు. పెట్టుబడులకు ఢోకా లేదని నిర్ధారణ అయ్యే వరకూ వేచి చూసేందుకే మొగ్గు చూపుతున్నారు.

### ప్లాట్ల యజమానులదీ అదే వైఖరి

ఇప్పటికే రాజధాని ప్లాట్ల ధరలు ఇప్పటికో భారీగా పడిపోయాయి. ఇంకా పెద్దగా తగ్గే అవకాశం లేదని ప్లాట్ల యజమానుల అంచనా. ఇప్పుడు కొద్దిగా ధరలు పెరిగాయని అమ్ముకునే బదులు అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు వంటి వాటిపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వెలువడేవరకు ఆగడం మంచిదని ఎక్కువ మంది నిర్ణయించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి (అమరావతి)

ఆధునిక పోకడలు ఇంటి అలంకరణను సమూలంగా మార్చేస్తున్నాయి. పిండి కొద్దీ రొట్టె అన్నట్లుగా డబ్బులు ఎంత ఖర్చు పెట్టగలిగితే అంత స్థాయిలో సౌకర్యవంతమైన సేవలను సొంతం చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

ఒకప్పుడు ఇంటి ప్రధాన ముఖ ద్వారం, లివింగ్‌రూం, పడక గదులు, వంట గదిలపైనే యజమానులు ఎక్కువగా దృష్టి పెట్టేవారు. బాత్‌రూమ్‌లపై శ్రద్ధ తక్కువే! అలాంటి పరిస్థితి ప్రస్తుతం మారిపోయింది. ఇంట్లో స్నానాల గదులపై అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఇరుకుగా కాకుండా విశాలంగా వాటిని నిర్మిస్తున్నారు. గోడల చుట్టూ టైల్స్‌తో అలంకరణ.. ప్రత్యేకంగా బాత్ టబ్‌లు.. షవర్‌బాత్‌లు రకరకాల హంగులతో స్నానాల గదులను తీర్చిదిద్దుతున్నారు. మారుతున్న అభిరుచులకు తగ్గినట్లుగా అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు బాత్‌రూమ్ ఫిట్టింగ్‌లను మార్కెట్లో ప్రవేశపెడుతున్నాయి. అలాంటి మార్పులేమిటో తెలుసుకుందాం..

అదిరే..
# స్నానాల గదులు

- ఇళ్లలో వాడే వాష్‌బేసిన్‌లు రకరకాల రంగుల్లోను, ఆకృతుల్లోను అందుబాటులోకి వచ్చాయి. వాటి ధర కూడా ఎక్కువ ఉండటం లేదు. ఆన్‌లైన్ కూడా కూడా ఇవి దొరుకుతున్నాయి.
- స్నానాల గదిలో రకరకాల షవర్ పార్టీషన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి వల్ల స్నానం చేసినప్పుడు మొత్తం బాత్‌రూమ్ అంతా తడి అవదు. గ్లాస్, ప్లాస్టిక్‌లతో వీటిని తయారుచేస్తున్నారు. ధర కూడా తక్కువగానే ఉంటుంది.

## అభిరుచి ఆధారంగా

- బాత్‌స్టూల్స్.. రకరకాల బెంచ్‌లు.. అద్దాలతో తయారుచేసిన కేబినెట్‌లు.. అందుబాటులోకి వస్తున్నాయి. వీటితో పాటుగా నీటితో తడిసినా పాడుకాని ఫర్నీచర్ అందుబాటులోకి వచ్చింది. ఇవి రకరకాల బడ్జెట్‌లలో అందుబాటుల్లో ఉన్నాయి. బ్యాక్టీరియా చేరని సిరామిక్ వస్తువులు కూడా అందుబాటులోకి వచ్చాయి. బాత్‌రూమ్ తేమగా ఉన్నా పెద్ద సమస్య ఉండదు.
- పీవీసీలోనూ బాత్రూమ్ ఫిట్టింగ్స్ చాలా ఆకర్షణీయమైన డిజైన్లలో వస్తున్నాయి. వీటిలో ప్లాస్టిక్ ప్యానెల్ ఉంటుంది. ఇది తేమను తట్టుకుంటుంది. నీరు పడినా పాడవదు. కావాల్సిన రంగుల్లో దొరుకుతాయి. ఉష్ణోగ్రతను తట్టుకుంటుంది. తేలిగ్గా శుభ్రం చేసుకోవచ్చు.

-హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)



ఇల్లు అద్దెకిచ్చినా..
# రాయితీలు పొందొచ్చు



చాలా మంది తమ ఇళ్లను అద్దెకు ఇస్తూ ఉంటారు. సమీప బంధువులైతే ఎటువంటి సమస్యలుండవనే ఉద్దేశంతో అద్దె తక్కువకైనా వారికే ఇస్తారు. ఉచితంగా ఇచ్చేవారూ లేకపోలేదు. ఇంట్లో ఉండే వారు అద్దె ఇచ్చినా.. ఉచితంగా ఉన్నా ఏం చేయాలో ఆదాయపు పన్ను చట్టంలో స్పష్టంగా ఉంది. దీనిని తెలుసుకుంటే రకరకాల సమస్యల నుంచి తప్పించుకోవచ్చు.

- ఆదాయపు పన్ను చట్టం 10 సెక్షన్ (13ఏ) ప్రకారం- సమీప బంధువులకు ఇంటిని అద్దెకు ఇస్తే కొన్ని రాయితీలను పొందవచ్చు. అయితే ఈ రాయితీలు పొందటానికి కూడా కొన్ని నిబంధనలను పాటించాలి. కిరాయిదారుడితో యజమాని ఒక ఒప్పందాన్ని చేసుకొని దాని రిజిస్ట్రర్ చేయించాలి. ఆదాయపు పన్ను అధికారులు అడిగినప్పుడు ఈ ఒప్పందాన్ని చూపించాల్సి ఉంటుంది.
- వీలైనంత వరకూ అద్దెను డబ్బు రూపంలో కాకుండా చెక్ లేదా బ్యాంకు ట్రాన్స్‌ఫర్ రూపంలో చేయాల్సి ఉంటుంది.
- కిరాయిదారుడు చెల్లించే సొమ్ము యజమానికి ఆదాయం అవుతుంది కాబట్టి దీనిని ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్సులో చూపించాలి. లేకపోతే కొన్నిసార్లు ఇబ్బందులు వచ్చే అవకాశముంది.
- హెచ్‌ఆర్‌ఏ, హోమ్‌లోన్- ఈ రెండింటినీ కూడా ఆదాయ పన్ను రిటర్న్సులో చూపించుకోవచ్చు. అయితే ఈ రెండు ఒకే అడ్రస్సులో ఉన్నట్లు పేర్కొంటే సమస్యలు తప్పవు.






# ఫిర్యాదు ఎలా చేయాలి?

స్విమ్మింగ్‌పూల్.. క్లబ్ హౌస్..చిల్డ్రన్ పార్క్.. మల్టీ పర్పస్ హాల్.. ఇలా రకరకాల హంగులతో ప్రాజెక్టును పూర్తి చేస్తామని బిల్డర్లు చెబుతూ ఉంటారు. ప్రాజెక్టు పూర్తయ్యేసరికి కొన్ని మాత్రమే అందుబాటులోకి వస్తాయి. మరి కొన్ని పూర్తికావు. కొన్ని సార్లు బిల్డర్ అరకొరగా పనులు పూర్తి చేసి వెళ్లిపోతారు. కొన్ని సందర్భాల్లో యజమానుల సంఘానికి నిర్వహణ బాధ్యతలు అప్పచెప్పిన తర్వాత వారు సరిగ్గా వ్యవహరించరు. అలాంటప్పుడు చట్టప్రకారం ఏం చేయవచ్చు అనే విషయాన్ని తెలుసుకుందాం..

## అప్పగించే వరకూ బాధ్యత బిల్డర్‌దే

- రెరాలోని 11(4)(డీ) నిబంధన ప్రకారం ఒక భవంతి నిర్వహణను యజమానుల సంఘానికి అప్పగించే వరకూ మౌలిక సేవలను అందించాల్సిన బాధ్యత ప్రమోటర్‌పై ఉంది. ఒకవేళ ప్రమోటర్లు సరైన సేవలను అందించకపోతే వారిపై కోర్టులో దావా వేసే అవకాశాన్ని కూడా ఉంది.
- ప్రమోటర్ దగ్గర నుంచి నిర్వహణను వీలైనంత త్వరగా యజమానుల సంఘం తీసుకుంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. లేకపోతే ప్రమోటర్లు సరైన సేవలను అందించకపోతే ఇబ్బంది పడాల్సి ఉంటుంది.
- ఇక మెయింటెనెన్స్ ఛార్జీల విషయానికి వస్తే- సాధారణంగా గేటెడ్ కమ్యూనిటీలలో చదరపు అడుగుకు రెండు నుంచి మూడు రూపాయల వరకూ వసూలు చేస్తారు. కమ్యూనిటీలో ఉన్న ఉమ్మడి ఆస్తులైన క్లబ్ హౌస్‌లు, గార్డెన్లు, లిఫ్ట్‌లు మొదలైన వాటి నిర్వహణకు వీటిని ఉపయోగిస్తారు. స్విమ్మింగ్‌పూల్, జిమ్ వంటి వాటికి అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆస్తుల నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిపై ఫిర్యాదు చేయవచ్చు. జీఎస్‌టీ విధానం అమలులోకి వచ్చిన తర్వాత- ఏ వెల్ఫేర్ అసోషియేషన్ అయినా ఒకో సభ్యుడి దగ్గర నుంచి రూ. 7,500 కన్నా ఎక్కువ మెయింట్‌నెన్స్ వసూలు చేస్తుంటే 18 శాతం పన్నుగా వసూలు చేయవచ్చు. అంత కన్నా తక్కువ వసూలు చేస్తే అసోషియేషన్‌జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఒకవేళ బిల్డర్ కానీ అసోసియేషన్ కానీ బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే జిల్లా వినియోగదారుల ఫోరంలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఒక వేళ వినియోగదారుడు కోటి రూపాయల కన్నా ఎక్కువ పరిహారం కోరుతూ ఉంటే నేషనల్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రసల్ కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) కూడా నేరుగా ఫిర్యాదు చేసే అవకాశముంది. దీనితో పాటుగా రెరాలో కూడా ఫిర్యాదు చేయవచ్చు

స్థిరాస్తి కొనుగోలు లేదా అమ్మకం కోసం
ఆంధ్రజ్యోతి రియల్ ఎస్టేట్ పేజీ
మీకు ఎంతో ఉపయోగకరం
PLOT FOR SALE
HOUSE FOR SALE
FLAT FOR SALE
LAND FOR SALE
ఇలాంటివి ఎన్నో... మరెన్నో... మీకోసం
ప్రకటనల కొరకు
సంప్రదించండి : 99854 01166, 99854 11173
లేదా మీ దగ్గరలోని ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని సంప్రదించండి.

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 40,445.15 | 11,921.50 | 38,175 | 44,115 | 71.20 | 62.97 |
| 334.44 | 96.90 | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) 6 | 135 | 9 పైసలు | |

# 5 నుంచి 6 శాతానికి..

**జీఎస్‌టీ శ్లాబ్ రేటు పెంచే యోచనలో ప్రభుత్వం**




న్యూఢిల్లీ: లోటు ఆదాయంతో సతమతం అవుతున్న కేంద్ర ప్రభుత్వం.. ఖజానా నింపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) రేట్లను పునర్ వ్యవస్థీకరించే యోచనలో ఉంది. ప్రస్తుతం జీఎస్‌టీలో నాలుగు (5,12,18,28 శాతం) పన్ను శ్లాబులున్నాయి. అందులో 5 శాతం శ్లాబు రేటు ను 6 శాతానికి పెంచాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. తద్వారా ప్రభుత్వానికి జీఎస్‌టీ ఆదాయం నెలకు రూ.1,000 కోట్ల మేర పెరగవచ్చని అంచనా. ఈ నెల 18న సమావేశం కానున్న జీఎస్‌టీ మండలి ఈ విషయమై చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ శ్లాబ్ రేటును పెంచితే నిత్యావసరాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే, ఆహారోత్పత్తులు, పాదరక్షలు, సామాన్యులు ఉపయోగించే వస్త్రాలన్నీ ఈ శ్లాబ్ పరిధిలోకే వస్తాయి.

**మొత్తం వసూళ్లలో 5 శాతం వాటా**

ప్రభుత్వానికొచ్చే మొత్తం జీఎస్‌టీ ఆదాయంలో 5 శాతం శ్లాబ్ ద్వారా సమకూరే వాటా 5 శాతమే. నెలవారీ జీఎస్‌టీ వసూళ్లను రూ.1.20 లక్షల కోట్ల స్థాయికి పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ, సెప్టెంబరులో జీఎస్‌టీ ఆదాయం 19 నెలల కనిష్ఠ స్థాయి రూ.91,916 కోట్లకు పడిపోయింది. ఆ తర్వాత కాస్త పుంజుకుంది. అక్టోబరులో రూ.95,380 కోట్లకు, నవంబరులో రూ.1.03 లక్షల కోట్లకు పెరి గింది.

# 63 వేల మారుతి కార్లు వెనక్కి!

న్యూఢిల్లీ: పెట్రోల్ స్మార్ట్ హైబ్రిడ్ (ఎస్‌హెచ్‌వీఎస్) తరహాకు చెందిన సియాజ్, ఎర్టిగా, ఎక్స్‌ఎల్6 మోడళ్లలో 63,493 కార్లను వెనక్కి రప్పిస్తున్నట్లుగా మారుతి సుజుకీ ఇండియా ప్రకటించింది. వాటిలో మోటార్ జనరేషన్ యూనిట్ (ఎంజీయూ)లో ఉన్న సమస్యను సరిచేసేందుకే ఈ రీకాల్ అని తెలిపింది. ఈ కార్లన్నీ ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబరు 21 మధ్యలో ఉత్పత్తి అయినవని వెల్లడించింది. వినియోగదారుల ప్రయోజనార్థం, సమస్య ఉన్న కార్లన్నింటినీ వెనక్కి తెప్పిస్తున్నామని, బాగున్న వాటిని వెంటనే తిరిగిచ్చేస్తామని వివరించింది. సమస్య ఉన్న కార్లలో ఉచితంగా మరో భాగాన్ని అమర్చనున్నట్లు పేర్కొంది. తమ డీలర్లు శుక్రవారం నుంచి వినియోగదారులను సంప్రదించడం మొదలుపెట్టారని మారుతి స్పష్టం చేసింది.

# ఇక 24 గంటలూ నెఫ్ట్ లావాదేవీలు

**▸▸ ఈ నెల 16 నుంచి అందుబాటులోకి**




ముంబై: దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలను మరింతగా ప్రోత్సహించే చర్యల్లో భాగంగా డిసెంబరు 16 నుంచి నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) వ్యవస్థను 24 గంటలూ అనుమతిస్తున్నట్టు శుక్రవారంనాడు ఆర్‌బీఐ ప్రకటించింది. ఈ వ్యవస్థ సెలవులతో సహా ఏడాదిలో అన్ని రోజులు అందుబాటులో ఉంటుందని తెలిపింది. నెఫ్ట్ లావాదేవీలను గంటలవారీ బ్యాచులుగా సెటిల్ చేయనున్నట్టు పేర్కొంది. పని దినాల్లో ఈ బ్యాచులు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటాయి. మొదటి, మూడో శనివారాల్లో సెటిల్‌మెంట్లు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు జరుగుతాయి. తాజాగా మారిన విధానానికి అనుగుణంగా కరెంట్ ఖాతాలో తగినంతగా నిల్వలు ఉంచాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది.

# కార్వీ ఆస్తుల జప్తు..?




**లైసెన్సు రద్దుపై ఎక్స్ఛేంజీల తుది ఆదేశాలే తరువాయి**

## అటాచ్‌మెంట్ ప్రారంభించనున్న సెబీ?

ముంబై: కార్వీ స్టాక్ బ్రోకింగ్‌పై మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ' ముమ్ముందు మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఖాతాదారుల షేర్లను దుర్వినియోగపర్చిన ఈ బ్రోకింగ్ కంపెనీ ట్రేడింగ్ లైసెన్సును స్టాక్ ఎక్స్ఛేంజీలు తాత్కాలికంగా రద్దు చేశాయి. ఇందుకు సంబంధించి ఎక్స్ఛేంజీలు తుది ఆదేశాలు జారీ చేశాక.. కార్వీతో పాటు దాని ప్రమోటర్ల ఆస్తులను సెబీ జప్తు చేయవచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సాధారణంగా, అక్రమ డిపాజిట్ స్కీమ్‌లలో ప్రమోటర్లు ఇన్వెస్టర్లకు సొమ్ము తిరిగి చెల్లించడంలో విఫలమైనప్పుడు నియంత్రణ మండలి వారి ఆస్తులను జప్తు చేస్తుంటుంది. ఇప్పటివరకు ఏ బ్రోకర్‌కు చెందిన ఆర్థికేతర ఆస్తులు, సంస్థలను జప్తు చేయడం జరగలేదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్.. డీన్ వీఆర్ నరసింహన్ అన్నారు. డిఫాల్ట్ బ్రోకర్ల వ్యక్తిగత ఆస్తులను సైతం జప్తు చేస్తే ముమ్ముందు ఈ తరహా ఘటనలు పునరావృతం కావని ఆయన అభిప్రాయపడ్డారు.

కార్వీ స్టాక్ బ్రోకింగ్ మొత్తం 95,000 మంది ఖాతాదారులకు చెందిన రూ.2,300 కోట్ల విలువైన షేర్లను వారి అనుమతి లేకుండానే తనఖా పెట్టి రుణాలు పొందింది. ఆ రుణ నిధులను తన రియల్టీ వ్యాపారంలోకి మళ్లించింది. కార్వీ ఆధీనంలో ఉన్న ఖాతాదారుల షేర్లను తిరిగి వారి అకౌంట్లలోకి బదిలీ చేయాలని డిపాజిటరీ సంస్థ ఎన్‌ఎస్‌డీఎల్‌ను గతనెలలో సెబీ ఆదేశించింది. దాంతో 83,000 మంది (దాదాపు 90 శాతం మంది) ఖాతాదారులకు కార్వీ తాకట్టు పెట్టుకున్న షేర్లను ఎన్‌ఎస్‌డీఎల్ తిరిగి బదిలీ చేసింది. అయితే, సెబీ నిర్ణయాన్ని కార్వీ రుణదాతలు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్)లో సవాలు చేశాయి. కంపెనీ తమకు తాకట్టు పెట్టిన షేర్లపై తమకే హక్కు ఉంటుందన్నది వారి వాదన. ఇప్పటికే ఖాతాదారులకు బదిలీ చేసిన షేర్లను తిరిగి తీసుకోవడం లేదా ఈ కేసులో తుది ఆదేశాలు జారీ చేసేవరకు వారిని స్తంభింపజేయాలని శాట్‌ను బ్యాంక్‌లు కోరాయి. అయితే, సాధ్యం కాదన్న శాట్.. మిగతా 10 శాతం (7000 మంది) ఖాతాదారులకు షేర్ల బదిలీని మాత్రం తాత్కాలికంగా నిలిపివేసింది.

**కార్వీ ఖాతాదారులకు ఇతర బ్రోకర్ల గాలం**

కార్వీ ట్రేడింగ్ లైసెన్సును రద్దు చేసిన నేపథ్యంలో కంపెనీ ఖాతాదారులకు ప్రత్యర్థి బ్రోకరేజీ కంపెనీలు గాలం వేస్తున్నాయి. అకౌంట్‌పై రుసుము మినహాయింపు, ఇతర సేవలపై డిస్కౌంట్లను ఎరగా వేస్తున్నట్లు తెలుస్తోంది. సెబీ వివరాల ప్రకారం.. కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు దాదాపు 12 లక్షల మంది ట్రేడింగ్ ఖాతాదారులున్నారు. అందులో 3 లక్షల మంది చురుకుగా ట్రేడింగ్ జరుపుతుంటారు. సరాసరిగా 20,000-25,000 మంది క్లయింట్లు రోజూ ట్రేడింగ్ జరుపగా, అందులో 15,000-18,000 మంది కార్వీ ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా లావాదేవీలు నెరుపుతున్నారు.

## బీమా పాలసీలు విక్రయించనున్న పోస్ట్‌మెన్!

న్యూఢిల్లీ: రానున్న కాలంలో బీమా పాలసీలు మరింత ఎక్కువ మందికి అందుబాటులోకి రానున్నాయి. త్వరలోనే పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవక్‌లు కూడా బీమా పాలసీలను విక్రయించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాల మేరకు పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవక్‌లు పాలసీలను విక్రయించాలంటే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) స్పాన్సర్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఐపీపీబీ కార్పొరేట్ ఏజెంట్‌గా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో తపాలా శాఖ (డీఓపీ)కు చెందిన పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవక్‌లు పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్స్ (పీఓఎస్)గా వ్యవహరించేందుకుగాను స్పాన్సర్ చేసేలా ఐఆర్‌డీఏఐ అనుమతిని ఐపీపీబీ కోరవచ్చని తెలుస్తోంది. కాగా డీఓపీ పోస్ట్‌మెన్, గ్రామీణ్ సేవక్‌లను గుర్తించాల్సి ఉండటమేకాకుండా ఎప్పటికప్పుడు జాబితాలను అందించాల్సి ఉంటుందని ఐఆర్‌డీఏఐ చెబుతోంది. "పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవక్‌లు బ్యాంకింగ్ సదుపాయాలు లేని ప్రాంతాల్లోని ప్రజలకు సేవలు అందిస్తారు. సుదూర, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి బీమా ఉత్పత్తులను విక్రయిస్తారు" అని ఐఆర్‌డీఏఐ పేర్కొంది. దేశంలో బీమా వ్యాపారంలో వృద్ధికి, బీమా విస్తరణ, సాంద్రతను పెంచేందుకు పీఓఎస్ వ్యక్తులకు సంబంధించిన మార్గదర్శకాలు దోహదపడతాయని ఐఆర్‌డీఏ తెలిపింది.

# ఆప్షన్స్ ట్రేడింగ్ పేరుతో బ్రోకర్ల మాయ

**రూ.80,000 కోట్ల పన్ను ఎగవేత**

**హైదరాబాద్‌లోనూ ఐటీ అధికారుల సోదాలు**



న్యూఢిల్లీ : మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా స్టాక్ మార్కెట్లో మోసాలు ఆగడం లేదు. లిక్విడిటీ లేని కొన్ని కంపెనీల షేర్లనూ కొంత మంది బ్రోకర్లు, మదుపరులు స్టాక్ ఆప్షన్స్ ద్వారా పన్నుల ఎగవేత దందాకు ఉపయోగించుకుంటున్నారు. గత ఐదేళ్లలో బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో జరిగిన కొన్ని డెరివేటివ్స్ కాంట్రాక్టుల లావాదేవీలను తనిఖీ చేసినప్పుడు ఈ విషయం బయట పడింది. ఈ అక్రమాల దందాతో గత ఐదేళ్లలో దాదాపు రూ.80,000 కోట్ల పన్ను ఎగవేత జరిగిందని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారుల అంచనా. దీంతో ఐటీ అధికారులు హైదరాబాద్‌తో పాటు దేశంలోని 150 చోట్ల దాదాపు 20,000 బ్రోకరేజీ సంస్థలు, మదుపరుల నివాసాలు, ఆఫీసుల్లో సోదాలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ నెల 4న ప్రారంభమైన ఈ సోదాలు, మరికొద్ది రోజుల పాటు కొనసాగొచ్చని తెలుస్తోంది.

**రివర్సల్ ట్రేడింగ్**

ఈ పన్ను ఎగవేతల కోసం ఆపరేటర్లు లిక్విడిటీ లేని కొన్ని లిస్టెడ్ కంపెనీల షేర్లలో రివర్సల్ ట్రేడింగ్ చేసేవారు. ఈ సంవత్సరం మార్చి వరకు, లిస్టెడ్ కంపెనీల షేర్లు కొని ఏడాది తర్వాత అమ్మగా వచ్చే లాభాలపై దీర్ఘకాలిక మూల ధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) లేదు. కాకపోతే ఈ షేర్ల లావాదేవీలపై సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) చెల్లించి ఉండాలి. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఆపరేటర్లు, తమకు కావాల్సిన మదుపరులతో ఏ మాత్రం లిక్విడిటీ లేని కంపెనీల షేర్లు కొనిపించేవారు. కంపెనీలు కూడా ఒక సంవత్సరం పాటు లాకిన్ పీరియడ్ ఉన్న షేర్లను, ప్రిఫరెన్షియల్ పద్ధతిలో వారికి కేటాయించేవి. ఆపరేటర్లు రిగ్గింగ్ ద్వారా ఏడాది లోపే ఈ షేర్ల ధరలు భారీగా పెంచేసేవారు. సంవత్సరం గడిచాక ఆపరేటర్లే కొన్ని సంస్థల ద్వారా అధిక ధరలకు ఈ షేర్లు కొనిపించేవారు. తద్వారా మదుపరులు ఎల్‌టీసీజీటీ నుంచి తప్పించుకునేవారు. ఈ లావాదేవీల ద్వారా ప్రయోజనం పొందిన బ్రోకర్లు, మదుపరులు, ఈ మొత్తం వ్యవహారం నడిపించిన ఆపరేటర్లకు వివిధ ముసుగు సంస్థల ద్వారా నగదు ముట్టజెప్పేవారు.

**ఇలా బయట పడింది**

2014 ఏప్రిల్ నుంచి 2015 సెప్టెంబరు మధ్య కాలంలో ఆప్షన్స్ విభాగంలో ఏ మాత్రం లిక్విడిటీ లేని కొన్ని కంపెనీల షేర్లలో పెద్ద ఎత్తున రివర్సల్ ట్రేడ్ జరిగినట్టు సెబీ గుర్తించింది. కొన్ని బ్రోకరేజీ సంస్థలు లేదా మదుపరులు ఈ కంపెనీల షేర్లను స్వల్ప కాలంలో.. పెద్ద మొత్తంలో ధరల తేడాతో, తమ మధ్య, అదే పనిగా అమ్మడం, కొనడం ద్వారా ఈ అక్రమాలకు తెర తీసినట్టు తేలింది. ఆ తర్వాత తీగ లాగితే డొంకంతా కదిలినట్టు, బ్రోకర్లు చేస్తున్న ఈ భారీ అక్రమ దందా బయటపడింది. ఐటీ అధికారుల సోదాలు పూర్తయితే గానీ ఈ దందా పూర్తి వివరాలు తెలిసే అవకాశాలు లేవు.

# రెండేళ్లలో 4 ఎస్‌యూవీలు

**▸▸ 'కార్పొరేట్' వ్యాపారంపై దృష్టి ▸▸ 82% లోకలైజేషన్**

**▸▸ హైదరాబాద్‌లో ఫోక్స్‌వ్యాగన్ కార్పొరేట్ బిజినెస్ సెంటర్**



ఫోక్స్‌వ్యాగన్ డైరెక్టర్ స్టీఫెన్ నాప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీ కార్ల కంపెనీ ఫోక్స్‌వ్యాగన్ వచ్చే రెండేళ్లలో దేశీయ మార్కెట్లోకి నాలుగు స్పోర్ట్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ)ను విడుదల చేయనుంది. 2020 మధ్య నాటికి తొలి ఎస్‌యూవీని ప్రవేశపెడతామని, నాలుగు ఎస్‌యూవీల్లో ఒకటి పెద్దది, ఒకటి మధ్య స్థాయి విభాగానికి చెందినదని ఫోక్స్‌వ్యాగన్ ప్యాసింజర్ కార్స్ డైరెక్టర్ స్టీఫెన్ నాప్ తెలిపారు. 2021లో 'క్రెటా' విభాగంలో ఎస్‌యూవీని కంపెనీ ప్రవేశపెట్టనుంది. భారత మార్కెట్లో 2022 వరకూ రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టాలని ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ 2018లో నిర్ణయించింది. అందులో భాగంగా కొత్త మోడళ్ల అభివృద్ధి, పుణెలోని పరిశోధన అభివృద్ధి కేంద్రంపై పెట్టుబడులు పెట్టనున్నామని స్టీఫెన్ వివరించారు.

కార్పొరేట్ వ్యాపారంపై దృష్టి పెట్టడం, కొనుగోలుదారులకు ఓనర్‌షిప్ వ్యయాన్ని తగ్గించడం తదితర మార్గాల ద్వారా భారత్‌లో స్థిరమైన పురోగతిని సాధించాలని భావిస్తున్నామని.. వచ్చే ఐదేళ్లలో ప్యాసింజర్ కార్ల మార్కెట్లో 3 శాతం వాటాను దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఫోక్స్‌వ్యాగన్ కార్పొరేట్ వ్యాపారం ఆకర్షణీయంగా పెరుగుతోందని, మొత్తం అమ్మకాల్లో ఈ విభాగం నుంచి 40 శాతం ఉందని స్టీఫెన్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కంపెనీ కార్పొరేట్ బిజినెస్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓనర్‌షిప్ కాస్ట్‌ను తగ్గించడానికి గత ఏడాదిలో విడిభాగాల ధరలను 15 శాతం తగ్గించామని, పోలో, వెంటో, టైగన్ తదితర మోడళ్లను మార్కెట్లో కొనసాగిస్తూనే కొత్త మోడళ్లను విడుదల చేస్తామని చెప్పారు.

ప్రస్తుతం ఫోక్స్‌వ్యాగన్ కార్ల తయారీలో 82 శాతాన్ని స్థానికంగానే (లోకలైజేషన్) చేస్తోంది. భవిష్యత్తులో దీన్ని 93 శాతానికి పెంచనుంది. దీని వల్ల కొనుగోలుదారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని స్టీఫెన్ అన్నారు. పుణెలోని కంపెనీ పరిశోధన, అభివృద్ధి కేంద్రంలో ప్రస్తుతం 650 మంది ఇంజనీర్లు ఉన్నారు. వీరిని 5,000 మందికి పెంచనున్నాం. ఇక్కడ భారత్ కోసమే కాక, ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసే కార్లను డిజైన్ చేస్తున్నామన్నారు.

**బీఎస్-6 కార్ల వ్యయం 15% ఎక్కువ**

బీఎస్-6 ప్రమాణాలతో మార్కెట్లోకి వచ్చే కార్ల వ్యయం 15 శాతం వరకూ పెరగనుంది. డీజిల్ వాహనాల వ్యయం 12-15 శాతం, పెట్రోల్ కార్ల వ్యయం 5 శాతం వరకూ పెరుగుతుందని స్టీఫెన్ అంచనా వేశారు. 2020 ఏప్రిల్ 1 నుంచి మార్కెట్లో బీఎస్-6 ప్రమాణాల కార్లనే విక్రయించాల్సి ఉంది. బీఎస్-4 ప్రమాణాల కార్లతో ఇబ్బందేమీ లేదని అభిప్రాయపడ్డారు. పెరిగే మొత్తం వ్యయ భారాన్ని వాహన కంపెనీలు కొనుగోలుదారులకు బదిలీ చేయకపోవచ్చని, కొత్త ప్రమాణాల అమలు ప్రభావం వచ్చే ఏడాది మొదటి రెండు త్రైమాసికాల్లో కార్ల అమ్మకాలపై ఉండగలదని చెప్పారు. ఫోక్స్‌వ్యాగన్ బీఎస్-4 ప్రమాణాల కార్ల తయారీని డిసెంబరు చివరకు నిలిపివేయనుంది. మార్కెట్లోకి ముందుగా బీఎస్-6 ప్రమాణాలున్న పెట్రోల్ కార్లను, ఆ తర్వాత డీజిల్ కార్లను విడుదల చేయనుందని తెలిపారు.

## బీమా కంపెనీల్లో బ్యాంకులకు 10 శాతానికి పైగా వాటా !

ముంబై: ప్రభుత్వరంగంలోని 10 బ్యాంకుల విలీన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ బ్యాంకులు ఒకటికి మించి బీమా కంపెనీల్లో పది శాతానికి పైగా వాటాను కలిగి ఉండేలా అనుమతివ్వాలని ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది. అయితే యాజమాన్య వాటాను మాత్రం ఒక కంపెనీకే పరిమితం చేయాలనుకుంటోంది. అంతేకాకుండా బహుళ యాజమాన్యాన్ని ఒక విభాగానికే పరిమితం చేయాలనుకుంటోంది. అంటే జీవిత బీమా లేదా సాధారణ బీమాకు పరిమితం కావాల్సి ఉంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. ఒక బ్యాంకు ఒకటికి మించి బీమా కంపెనీలను ప్రమోట్ చేయడానికి అనుమతి లేదు. ప్రస్తుతం 10 ప్రభుత్వరంగ బ్యాంకులు నాలుగు బ్యాంకులుగా విలీనమవుతున్నవిషయం తెలిసిందే. వీటిలో పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు, కెనరా బ్యాంకు, ఓబీసీలు జీవిత బీమా అనుబంధ కంపెనీలను నడిపిస్తున్నాయి.

## మళ్లీ చమురు మంట

వియన్నా : అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర మళ్లీ సెగల కక్కుతోంది. బ్రెంట్ రకం బ్యారల్ ముడి చమురు ధర శుక్రవారం ఒక్కరోజే రెండు శాతానికిపైగా పెరిగి 65 డాలర్లకు చేరువైంది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రోజువారీ చమురు ఉత్పత్తి మరో 5 లక్షల పీపాలు తగ్గించాలని చమురు ఉత్పత్తి దేశాల సమాఖ్య 'ఒపెక్, రష్యా నిర్ణయించడం ఇందుకు కారణం. దీంతో గత ఏడాది అక్టోబరు నాటి ఉత్పత్తితో పోలిస్తే, రోజువారీ చమురు ఉత్పత్తి 17 లక్ష పీపాల మేర తగ్గనుంది. ఇదిగాక తన రోజువారీ ఉత్పత్తి మరో నాలుగు లక్షల పీపాలు తగ్గించుకునేందుకు సౌదీ అరేబియా అంగీకరించింది.

## విక్టోరియన్ ప్రభుత్వంతో ఐకేపీ నాలెడ్జ్ పార్క్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్యాక్టీరియా, వైరస్ వంటివి యాంటీ బయాటిక్స్, యాంటీ వైరల్ ఔషధాలను తట్టుకుని నిలబడగలగడంపై, దీనికి పరిష్కారాలను కనుగొనడంపై హైదరాబాద్‌కు చెందిన ఐకేపీ నాలెడ్జ్ పార్క్ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుకు విక్టోరియన్ ప్రభుత్వంతో చేతులు కలిపింది. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం కూడా పాలుపంచుకుంటుంది..

## మెట్‌ఫార్మిన్‌లో మలినాలు ఉన్నాయా?

**▸▸ పరీక్షించండి.. గ్రాన్యూల్స్‌కు ఈయూ హెల్త్ అథారిటీల సూచన**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కంపెనీ తయారు చేసే మెట్‌ఫార్మిన్‌లో 'నైట్రోసోడిమిథిలామైన్' మలినాలు ఉన్నాయో లేదో పరీక్షించాలని గ్రాన్యూల్స్ ఇండియాకు ఈయూ హెల్త్ అథారిటీలు సూచించాయి. మెట్‌ఫార్మిన్ తయారీ సింథసిస్‌కు సంబంధించి క్షుణ్ణంగా రిస్క్ అసెస్‌మెంట్ చేశామని, నైట్రోసోడిమిథిలామైన్ (ఎన్‌డీఎంఏ) ఉండేందుకు అవకాశం లేదని ఈయూ అథారిటీస్‌కు కంపెనీ తెలిపింది. అయితే.. మెట్‌ఫార్మిన్‌ను అనలిటికల్ టెస్టింగ్ చేస్తున్నామని, ప్రాథమిక పరిశీలనలో ఈ మలినం లేదని తెలుస్తోందని పేర్కొంది. పరీక్షలు మరింత పురోగతి సాధించిన తర్వాత తెలిసే విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేయనున్నట్లు ఈయూ అథారిటీలకు తెలిపింది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 6వ తేదీకి.. | | విజయవాడ | 452 |
| హైదరాబాద్ | 430 | విశాఖపట్నం | 460 |
| 7వ తేదీకి.. | | వరంగల్ | 433 |
| చిత్తూరు | 471 | డజను గుడ్లు రూ. 66 | |
| గోదావరి | 452 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 83 | విజయవాడ | 93 |
| వరంగల్ | 83 | గుంటూరు | 93 |
| మహబూబ్‌నగర్ | 83 | ఒంగోలు | 95 |
| కరీంనగర్ | 83 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 83 | నెల్లూరు | 90 |
| విశాఖపట్నం | 85 | అనంతపురం | 91 |
| గోదావరి | 88 | | |

**బులియన్**



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,280 | 38,860 | 39,350 | 38,900 | 38,220 |
| క్రితం ముగింపు | 38,370 | 38,950 | 39,370 | 38,950 | 38,260 |
| 22 క్యారెట్లు | 36,460 | 36,000 | 36,200 | 36,060 | 36,400 |
| క్రితం ముగింపు | 36,520 | 36,100 | 36,220 | 36,150 | 36,440 |
| వెండి (కిలో) | 44,400 | 45,400 | 45,400 | 46,400 | 47,600 |
| క్రితం ముగింపు | 44,000 | 45,600 | 45,300 | 46,000 | 47,500 |

# సెన్సెక్స్ @ 45,500

**▸▸ వచ్చే డిసెంబరు నాటికి చేరే చాన్స్**

**▸▸ కోటక్ సెక్యూరిటీస్ అంచనా**

**ఈ రంగాల షేర్లు మేలు**

- బ్యాంకింగ్
- మాతృ సంస్థల అండ ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలు
- ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలు
- క్యాపిటల్ గూడ్స్ సంస్థలు
- నిర్మాణ రంగ కంపెనీలు
- హెల్త్‌కేర్ కంపెనీలు
- ఆగ్రోకెమికల్ కంపెనీలు



ముంబై: ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ కుంటి నడక నడుస్తోంది. మరో ఏడాది పాటు ఈ తిప్పలు తప్పవని ఆర్థిక నిపుణుల అంచనా. అయినా స్టాక్ మార్కెట్ రికార్డులతో హోరెక్కుతోంది. ప్రస్తుతం ఈ రికార్డుల హోరుకు కొద్దిగా బ్రేక్ పడినా, వచ్చే ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్ జోరుకు ఢోకా ఉండదని బ్రోకరేజీ సంస్థల అంచనా. కోటక్ సెక్యూరిటీస్ అయితే, వచ్చే ఏడాది డిసెంబరు నాటికి సెన్సెక్స్ 45,500 పాయింట్ల కీలక మైలురాయికి చేరుకుంటుందని తన తాజా నివేదికలో పేర్కొంది. శుక్రవారం నాటి సెన్సెక్స్ ముగింపు 40,445 పాయింట్లతో పోలిస్తే ఇది దాదాపు 12.5 శాతం ఎక్కువ.

కార్పొరేట్ టాక్స్ కోతతో పెరగనున్న కంపెనీల రాబడులు, ఎఫ్‌పీఐలు, సిప్ పెట్టుబడులు వచ్చే ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్‌ను ముందుకు తీసుకుపోతాయని కోటక్ సెక్యూరిటీస్ తెలిపింది. అయితే నిర్వహణ సరిగా లేని కంపెనీల షేర్ల జోలికి మాత్రం పోవద్దని మదుపరులను హెచ్చరించింది. వచ్చే ఏడాది మదుపరులకు మంచి లాభాలు తెచ్చిపెట్టే అవకాశం ఉన్న కొన్ని రంగాలనూ తన నివేదికలో వెల్లడించింది.

# ప్రభుత్వ మద్దతు లేకుంటే మూసివేతే!

**▸▸ వొడాఫోన్ ఐడియా చైర్మన్ కుమార్ మంగళం బిర్లా**



న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు చెల్లించాల్సి ఉన్న బకాయిలకు సంబంధించి ప్రభుత్వం నుంచి మద్దతు లభించకపోతే వొడాఫోన్ ఐడియాను మూసివేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆ సంస్థ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా అన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉపశమనం పొందనట్టయితే వొడాఫోన్ ఐడియా కథ ముగిసినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడిక్కడ హెచ్‌టీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొన్న సందర్భంగా వొడాఫోన్ ఐడియా భవితవ్యంపై అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. ఒక్క టెలికాం రంగానికే కాకుండా మొత్తం పరిశ్రమకు ప్రభుత్వం నుంచి మద్దతు లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. సుప్రీం ఆదేశాల మేరకు వొడాఫోన్ ఐడియా రూ.53,038 కోట్ల బకాయిలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశంలో మూడో అతిపెద్ద టెలికాం సేవల సంస్థగా వొడాఫోన్ ఐడియా ఉంది. ఓవైపు ప్రత్యర్థి కంపెనీల నుంచి పోటీ మరోవైపు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వానికి బకాయిలు చెల్లించాల్సి రావడంతో కంపెనీపై ఒత్తిడి తీవ్రంగా పెరుగుతోంది. గత ఏడాదిలో బిర్లాకు చెందిన ఐడియా సెల్యులార్, వొడాఫోన్ పీఎల్‌సీకి చెందిన వొడాఫోన్‌లు విలీనమైన విషయం తెలిసిందే.

"టెలికాం రంగం చాలా కీలకమైన రంగంగా ప్రభుత్వం గుర్తించింది. మొత్తం డిజిటల్ ఇండియా ప్రోగ్రామ్ దీనిపై ఆధారపడి ఉంది. ఇది చాలా వ్యూహాత్మక రంగం" అని బిర్లా అన్నారు. టెలికాం రంగంలో ప్రభుత్వ రంగం నుంచి ఒకటి, ప్రైవేటు రంగం నుంచి రెండు కంపెనీలు ఉండాలని కోరుకుంటున్నట్టు ప్రభుత్వం బహిరంగంగానే చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి ఉద్దీపన లభిస్తుందన్న ఆశతో ఉన్నట్టు ఆయన చెప్పారు.

**బలమైన ఆర్థిక ఉద్దీపన అవసరం**

దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనాన్ని తొలగించడానికి కార్పొరేట్ పన్ను తగ్గింపు ఒక్కటే సరిపోదని, బలమైన ఆర్థిక ఉద్దీపనను ప్రభుత్వం అందించాలని కుమార్ మంగళం బిర్లా అన్నారు. మందగమనం ఉన్న సంవత్సరంలో ఆ ప్రభావాన్ని ఎదుర్కొనే విధంగా ఆర్థికపరమైన విధాన అవసరం ఉంటుందని చెప్పారు. కార్పొరేట్లకు సంబంధించిన రుణాల్లో వృద్ధి త్వరలో పుంజుకునే అవకాశం లేదన్నారు. ఇప్పటికే కంపెనీల ఆస్తి, అప్పుల ఖాతాల్లో అప్పుల కుప్పలు పెరిగిపోయాయని చెప్పారు. పన్ను తగ్గింపులు ఎప్పుడైనా ఆహ్వానించదగినవేనని, పన్ను తగ్గింపులతో తమ వద్ద మరింతగా నిధులు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.



కొత్త కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ తర్వాత చంద్రబాబు కుటుంబ సభ్యులు, ఆ పార్టీ నేతలు







నూతన కార్యాలయంలో తన సీటులో కూర్చుంటున్న మాజీ సీఎం చంద్రబాబు

చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తున్న ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, పాదాభివందనం చేస్తున్న ఎంపీ గల్లా జయదేవ్

# కొత్త చిరునామా

- టీడీపీ కేంద్ర కార్యాలయం ప్రారంభం
- సంప్రదాయబద్ధంగా గృహ ప్రవేశం
- పెద్ద సంఖ్యలో హాజరైన నేతలు, కార్యకర్తలు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం శుక్రవారం ఉదయం ఇక్కడ ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకగా ప్రారంభమైంది. విజయవాడ- గుంటూరు జాతీయ రహదారిపై డీజీపీ కార్యాలయానికి చేరువలో నూతనంగా నిర్మించిన ఈ భవనంలోకి పండితులు నిర్ణయించిన ముహూర్తానికి అనుగుణంగా సంప్రదాయబద్ధంగా గృహ ప్రవేశం చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేరుమీద నిర్మించిన ఈ కార్యాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జాతీయ రహదారికి అభిముఖంగా సుమారు మూడున్నర ఎకరాల భూమిని ప్రభుత్వం టీడీపీకి కేటాయించింది. ఇందులో రెండున్నర లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో మొత్తం 3 భవనాలు నిర్మించాలని ఆ పార్టీ తలపెట్టింది. మొదటి భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. దీనిని సుమారు 75 వేల అడుగుల విస్తీర్ణంతో నిర్మించారు. మూడు అంతస్తుల ఈ భవనంలో కింది హాలులో 12 అడుగుల ఎత్తు ఉన్న ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భవనం లోపలికి అడుగు పెట్టిన వారికి మొదట ఈ విగ్రహమే కనిపిస్తుంది. దాని పక్కన విలేకరుల సమావేశ మందిరం, అధికార ప్రతినిధులు, సందర్శకుల గదులు ఏర్పాటు చేశారు.

### ముందుగా యాగం... తర్వాత ప్రారంభం

పార్టీ కార్యాలయ భవన ప్రారంభానికి ముందు అందులోని హాల్‌లో శుక్రవారం ఉదయం చండీ యాగం, శ్రీసూక్త యాగం చేశారు. యాగం అనంతరం పూజా ద్రవ్యాలతో కూడిన పట్టు వస్త్రాలను పూర్ణాహుతి చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి కలిసి యాగ కుండంలో పూర్ణాహుతి సమర్పించారు. తర్వాత గోపూజ జరిపారు. ఆ తర్వాత ముహూర్తం ప్రకారం ఉదయం 10.03 నిమషాలకు రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఇరు పక్కలా రెండు తెలుగు రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు కళా వెంకట్రావు, ఎల్.రమణ ఉండగా చంద్రబాబు కార్యాలయాన్ని ప్రారంభించారు. తర్వాత హాల్లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటకు చెందిన శిల్పి వడయార్ రూపుదిద్దారు. ఈ విగ్రహం తయారీకి సుమారుగా రూ.35 లక్షలు వ్యయం అయినట్లు సమాచారం. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన టీడీపీ పతాకాన్ని చంద్రబాబు ఎగురవేశారు. అనంతరం అక్కడ నుంచి మూడో అంతస్తులోని తన కార్యాలయంలోకి చంద్రబాబు వెళ్ళి తన సీట్లో కూర్చుని పండితుల నుంచి ఆశీర్వచనం తీసుకొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనను అక్కడ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నేత పీఆర్ మోహన్ ప్రారంభోత్సవం సందర్భంగా శంఖారావం చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా కార్యాలయం కిటకిటలాడింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే నేతలు, కార్యకర్తలు రావడం మొదలు పెట్టారు. మధ్యాహ్నం మూడు గంటలవరకూ ఈ ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

### కార్యాలయానికి విరాళం

పార్టీ నేత కడప గోవింద రెడ్డి రూ.5 లక్షలు, ఎమ్మెల్సీ అశోక్ బాబు రూ.1.75 లక్షలు పార్టీ కేంద్ర కార్యాలయానికి విరాళంగా ఇచ్చారు. వారిని చంద్రబాబు అభినందించారు.

## ప్రచారానికి తెరదించిన 'ప్రకాశం'

ప్రకాశం జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు పార్టీ మారతారని జరుగుతున్న ప్రచారానికి వారు శుక్రవారం తెర దించారు. జిల్లాకు చెందిన మొత్తం నలుగురు ఎమ్మెల్యేలు టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. వీరితోపాటు ఇదే తరహా ప్రచారానికి గురైన గుంటూరు జిల్లా టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ కూడా వచ్చారు. అసెంబ్లీలో చంద్రబాబు ప్రతిపక్ష హోదాను పోగొట్టడానికి టీడీపీ ఎమ్మెల్యేలను లాగాలన్న పథకంలో భాగంగా.. ప్రకాశం జిల్లాలో నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు, గుంటూరు జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యేపై వైసీపీ నేతలు ఒత్తిడి పెంచారు. అయితే చంద్రబాబు వారితో మాట్లాడి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఎమ్మెల్యేలంతా టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరు కావడంతో పార్టీ మార్పు ప్రచారానికి తెరపడింది. ప్రకాశం జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కరణం బలరాం, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఏలూరి సాంబశివరావు ముందుగా వచ్చారు. కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం వారు ముగ్గురూ, గుంటూరు జిల్లా ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్... చంద్రబాబుతో కలిసి ఒకే టేబుల్‌పై కూర్చుని భోజనం చేశారు. అయ్యప్ప దీక్షలో ఉన్నందువల్ల ఆలస్యంగా వస్తానని ముందే సమాచారం పంపిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ కొంత ఆలస్యంగా వచ్చారు. తర్వాత వీరంతా కలిసి తెలుగుదేశం శాసనసభాపక్షం సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై జరిగిన చర్చలో కూడా వీరు చురుగ్గా పాల్గొన్నట్లు సమాచారం. అనగాని సత్య ప్రసాద్ తన నియోజకవర్గం నుంచి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిలబడి ఫొటోలు దిగారు.

# ప్రభుత్వ వైఫల్యాలపై.. సమర భేరి

- 21 అంశాలపై అసెంబ్లీలో నిలదీద్దాం
- తెలుగుదేశం శాసనసభాపక్షం నిర్ణయం
- కొత్త కార్యాలయ భవనంలో తొలి భేటీ
- అందరూ చర్చల్లో చురుగ్గా పాల్గొనాలి
- ఆరు నెలల గడువు ముగిసింది
- ప్రభుత్వాన్ని పూర్తిస్థాయిలో నిలదీయాలి
- ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచన

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై గళమెత్తి గట్టిగా పోరాడాలని తెలుగుదేశం శాసనసభాపక్ష సమావేశం నిర్ణయించింది. కొత్తగా నిర్మించిన ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం టీడీఎల్పీ సమావేశాన్ని తొలిగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు దీనికి అధ్యక్షత వహించారు. వివిధ వర్గాల ప్రజలకు సంబంధించి మొత్తం 21 అంశాలను సమావేశాల్లో లేవనెత్తాలని నిర్ణయించారు. ఉల్లి, నిత్యావసరాల ధరల పెరుగుదల.. ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలు.. ఇసుక ధర విపరీతంగా పెరిగిపోవడం.. రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం.. అమరావతి సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పనులు నిలిపివేయడం.. సంక్షేమ పథకాల్లో కోత.. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అనేక పథకాలు, పనుల నిలిపివేత లేదా రద్దు.. పెట్టుబడులు వెనక్కి.. బిల్డ్ ఏపీ పేరుతో ప్రభుత్వ భూముల విక్రయాలు.. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం- దుబారా ఖర్చులు.. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు-వారి ఆత్మహత్యాయత్నాలు.. ఉపాధి హామీ బిల్లుల పెండింగ్.. హౌసింగ్ బిల్లుల పెండింగ్.. ఇళ్ల నిర్మాణం నిలిపివేత, మీడియాపై ఆంక్షల జీవో.. వలంటీర్ల నియామకంలో అక్రమాలు.. ప్రశ్నపత్రాల లీక్.. నదుల అనుసంధానం.. విభజన హామీల అమలు.. మహిళలపై అత్యాచారాలు, దాడులు.. టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యాలు, తప్పుడు కేసులు.. రైతుల ఆత్మహత్యలు, రైతు రుణ మాఫీ నాలుగైదు విడతల ఎగవేత వంటివి ఇందులో ఉన్నాయి. కోల్డ్ స్టోరేజీల్లో శనగ పంట నిల్వ చేసుకొన్న 30 వేల మంది రైతులకు తలకు రూ.45 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.6 వేలు మాత్రమే ఇచ్చారని, దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నించాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు డయాలసిస్ చేయకుండా వెనక్కి పంపిస్తున్నారని, గత ప్రభుత్వం ఇచ్చిన పనులు రద్దు చేసి ఇప్పుడు నియోజకవర్గానికి రూ.కోటి ఇచ్చినట్లు చెప్పుకోవడం ప్రభుత్వ వైఫల్యమేనని ఉండి ఎమ్మెల్యే రామరాజు విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు రద్దు చేస్తున్నారని, మూడు సెంట్ల ఇళ్ల స్థలాన్ని రెండు ముక్కలు చేసి ఇద్దరికి ఇస్తున్నారని కొండపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ప్రభుత్వం అనేక విషయాల్లో మాట తప్పుతోందని కొందరు ఎమ్మెల్యేలు విమర్శించారు. 'ఆదరణ పథకాన్ని రద్దు చేశారు. గోదాముల్లో పరికరాలు తుప్పుపట్టిపోతున్నా బీసీలపై కోపంతో వారికి పంపిణీ చేయడం లేదు. బీసీ మహిళలకు రూ. 15 వేలు సాయం చేస్తామని ఇవ్వలేదు. గత ఆరు నెలల్లో ఆత్మహత్య చేసుకున్న భవన నిర్మాణ కార్మికుల్లో అత్యధికులు బీసీలే. అయినా ప్రభుత్వంలో స్పందన లేదు' అని ఒక ఎమ్మెల్యే ఆరోపించారు. రైతులందరికీ పంట బీమాను ప్రభుత్వమే చెల్లిస్తుందని ఘనంగా ప్రచారం చేశారని.. రూ.వెయ్యి కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇరవయ్యో వంతు కూడా ఇవ్వలేదని.. సున్నా వడ్డీలో కూడా మోసమే కనిపిస్తోందని మరో ఎమ్మెల్యే విమర్శించారు. కియా కార్ల ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వెళ్లిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తానే 18 వేల ఉద్యోగాలు తెచ్చానని చెప్పుకోవడం దివాలాకోరుతనమని మరో నేత వ్యాఖ్యానించారు.

## సన్నద్ధమై రండి..

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బాగా సన్నద్ధమై సమావేశాలకు రావాలని, అన్ని రకాల చర్చల్లో చురుగ్గా పాల్గొని ప్రజల తరపున గళం వినిపించాలని చంద్రబాబు సూచించారు. ఆరు నెలల సమయం అయిపోయినందున ఇప్పుడు ప్రభుత్వ పనితీరుపై గట్టిగా నిలదీయాలన్నారు. ప్రస్తుత సమావేశాలను ఏడు రోజుల్లో ముగించాలని ప్రభుత్వం యోచిస్తోందని వింటున్నామని, అది సరికాదని... ప్రజా సమస్యలు పూర్తి స్థాయిలో చర్చించడానికి వీలుగా కనీసం 15 రోజులు సభ నడిపేలా డిమాండ్ చేయాలని అన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంపై సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. కేసులు పెట్టినా, ఆస్తులు ధ్వంసం చేసినా, బిల్లులు పెండింగ్‌లో పెట్టినా కార్యకర్తలో పోరాట పటిమ సడలలేదని, గతంతో పోలిస్తే ఎన్నికల్లో పరాజయం తర్వాత ఈసారి ఐదారు నెలల్లోనే వారిలో పట్టుదల, ఉత్సాహం వచ్చాయని చంద్రబాబు పేర్కొన్నారు. కార్యకర్తలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నాయకులంతా వారికి అండగా ఉండాలని, వీలైనంత మేర వారికి సాయం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు, శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, టీడీఎల్పీ ఉప నేతలు అచ్చెన్నాయుడు, రామానాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నెల్లూరు.. మాఫియాల అడ్డా!

- ఎదుర్కొనే సమర్థ అధికారే లేరు
- వచ్చినా మా ఎమ్మెల్యేలు ఉండనివ్వరు
- ముగ్గురు ఎస్పీలను మార్చేశాం కదా!
- నగరాన్ని గ్యాంగ్‌స్టర్స్‌కు అప్పగించారు
- లక్షలాది మంది కుమిలిపోతున్నారు
- మాజీ మంత్రి ఆనం సంచలన వ్యాఖ్యలు
- అనిల్, కోటంరెడ్డిలపై పరోక్ష విమర్శలు
- సింహపురి వైసీపీలో విభేదాలు బహిర్గతం



నెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వైసీపీలో నెలకొన్న విభేదాలు, కుమ్ములాటలు శుక్రవారం బయటపడ్డాయి. మాజీ మంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి.. తన పార్టీకే చెందిన జలవనరుల మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలపై మాటలదాడికి దిగారు. వారి పేరెత్తకుండా నెల్లూరు నగరంలో శాంతిభద్రతలపై శుక్రవారమిక్కడ విలేకరుల సమావేశంలో విమర్శలు గుప్పించారు. వ్యవస్థలు తమ పని తాము చేసుకుని వెళ్లే పరిస్థితి నెల్లూరు నగరంలో లేదన్నారు. మాఫియా ముఠాల ఆగడాలపై ఎవరికి చెప్పుకోవాలో తెలియక లక్షలాది మంది నగరవాసులు కుమిలిపోతున్నారని చెప్పారు. 'స్వచ్ఛమైన తేనె కావాలంటే వెంకటగిరి అడవికి వెళ్లాలి. ఏ రకం మాఫియా కావాలన్నా నెల్లూరు నగరానికి వెళ్లాలి. కబ్జారాయుళ్లు, లిక్కర్ మాఫియా, బెట్టింగ్ మాఫియా, ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా.. ఇలా ఒక్కటేమిటి..? ఏ రకం మాఫియా కావాలన్నా నెల్లూరు నగరంలోనే ఉన్నాయి. కొద్దిమంది మాఫియా గ్యాంగ్‌స్టర్స్‌కు నెల్లూరు నగరాన్ని అప్పగించేశారు. వేల కుటుంబాలు, లక్షలాది మంది ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోప కుమిలిపోతున్నారు. ఇలాంటి మాఫియాను ఎదుర్కొని ఆత్మస్థైర్యంతో ముందుకు నడిచే పోలీసు అధికారులు ఉన్నారా, దొరుకుతారా..? అలాంటి వారు ఉన్నా, ఇక్కడకు వచ్చినా.. వారిని ముందుకు కదలనివ్వని పరిస్థితి. వారు ఒక అడుగు ముందుకు వేస్తే, నాలుగు అడుగులు వెనక్కి వచ్చి తమ ఉద్యోగ భద్రత గురించి ఆలోచించాల్సిన పరిస్థితి. వాళ్ల పని చేస్తామన్నా మేం (ప్రజాప్రతినిధులం) ఉండనివ్వం కదా! మా ఎమ్మెల్యేలు ఉండనివ్వరు కదా! ముగ్గురు ఎస్పీలను మార్చేశారు కదా! సంవత్సరం కూడా పని చేయని ఎస్పీలు ఉన్నారు. కారణం మా ప్రజాప్రతినిధులే. అధికారులను వారి పనిని వారు చేసుకోనివ్వకపోతే వ్యవస్థలు ఎలా బతుకుతాయి? ప్రజలు ఎలా బతుకుతారు? ఏది ఏమైనా నెల్లూరు నగరంలో మాఫియా ఆగడాలను అడ్డుకునే సమర్థుడైన పోలీసు అధికారి రావాలని, ప్రజలను భయభ్రాంతుల నుంచి విముక్తి కలిగించాలనే నేను కోరుకుంటున్నాను..' అని వ్యాఖ్యానించారు. ఆనం వ్యాఖ్యలు రాజకీయ వర్గాలతో పాటు సామాన్య ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారాయి. ఆయన మాటల వీడియో క్లిప్పింగ్‌లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

# వెళ్లారు.. వచ్చారు!

**జగన్‌కు టైమ్ ఇవ్వని అమిత్‌షా.. రమ్మని చెప్పి మరీ కలవని వైనం.. అర్ధరాత్రి దాకా ఎదురుచూపులు**

- ఉదయమూ 'నో అపాయింట్‌మెంట్'
- 15 గంటలు ఉండి తిరుగుప్రయాణం
- ప్రత్యేక విమానంలో వచ్చినా దక్కని ఫలం
- విస్మరణపై వైసీపీ ఎంపీల్లో చర్చలు
- కలవడం ఇష్టంలేకే షా ఇలా చేశారా!?

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు' గురువారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఏపీ భవన్ సమాచార కేంద్రం నుంచి మీడియాకు అందిన సమాచారం. 'ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ నుంచి బయలుదేదారు' ఇది శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో మరో సందేశం!



నారాయణ మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సీఎం జగన్, భారతి

ఢిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి ఈ మధ్యకాలంలో ఏం చేశారు? ఎవరిని కలిశారనే సమాచారాన్ని మాత్రం ఏపీ భవన్ మీడియా అధికారులు చెప్పలేకపోయారు. ఎందుకంటే... కేంద్ర మంత్రులు సహా ఢిల్లీ పెద్దలెవరినీ జగన్ కలవలేక పోయారు. ఆయనకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి ముఖం చాటేశారు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు దాదాపు 15 గంటలు ఢిల్లీలో ఉన్నప్పటికీ.. షాను జగన్ కలవలేకపోయారు. అక్టోబరు 21న కూడా ముఖ్యమంత్రికి ఇదే రకమైన అనుభవం ఎదురైంది. అప్పుడు ఢిల్లీలో 24 గంటలు వేచి చూసినప్పటికీ... అమిత్ షాకు ఆయన జన్మదిన శుభాకాంక్షలు చెప్పేందుకే పరిమితం కావాల్సి వచ్చింది. నిజానికి జగన్‌కు ప్రధానమంత్రి, హోంమంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించేందుకు వైసీపీ నేత విజయసాయి రెడ్డి, లోక్‌సభలో పార్టీ నేత మిథున్ రెడ్డి గురువారమంతా తీవ్ర కృషి చేశారు. వీరు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని, షా కార్యాలయాల ఎదుట సుదీర్ఘంగా నిరీక్షించిన దృశ్యం మీడియా దృష్టికి వచ్చింది. అయితే, జగన్‌ను కలిసేందుకు ప్రధానికి తీరిక లేదని పీఎంవో ముందే స్పష్టం చేసింది. షాను మాత్రం రాత్రి 10 తర్వాత కలవొచ్చునని ఆయన అధికార వర్గాలు తెలిపాయి.

### అర్ధరాత్రిదాకా చూసినా...

అమిత్ షాను కలిసేందుకు జగన్ గురువారం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి రాగానే రాత్రి 9 గంటల ప్రాంతంలో పార్టీ ఎంపీలతో అన్యమనస్కంగానే కొద్ది సేపు పిచ్చాపాటీగా మాట్లాడారు. ఆ తర్వాత భోజనానికి వెళ్లిపోయారు. సరిగ్గా గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్... షా నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఆయన ఇతర సమావేశాల్లో బిజీగా ఉన్నారని తెలిసింది. తాను సమాచారం అందించిన తర్వాతే అమిత్‌షా నివాసానికి బయలుదేరాలని విజయసాయిరెడ్డికి ప్రవీణ్ ప్రకాశ్ ఫోన్ చేసి చెప్పారు. గంటన్నరకు పైగా నిరీక్షించినప్పటికీ షా కార్యాలయ సిబ్బంది నుంచి సమాచారం లేదు. చివరకు శుక్రవారం బ్రేక్ ఫాస్ట్ తర్వాత పిలిపిస్తామని చెప్పడంతో... ప్రవీణ్ ప్రకాశ్ వెనుతిరిగారు. కానీ శుక్రవారం ఉదయం 10 గంటలవరకు షా కార్యాలయం నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. పైగా, ఆయన పుణెలో జరిగే పోలీసు ఉన్నతాధికారుల సమావేశానికి వెళతారని, మరో రెండు రోజులు ఆయనను కలుసుకోవడానికి వీలుపడదని ఆయన కార్యాలయ వర్గాలు చెప్పినట్లు తెలిసింది. అంతకు ముందే ముఖ్యమంత్రి వ్యక్తిగత సహాయకుడు నారాయణ అనారోగ్యంతో మృతి చెందినట్లు సమాచారం అందడంతో జగన్ ఢిల్లీ పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని వెనుదిరిగారు. మధ్యాహ్నానికైనా షా సమయం ఇచ్చి ఉంటే జగన్ ఆయనను కలుసుకుని అక్కడి నుంచే విమానాశ్రయానికి వెళ్లాలని భావించారని, అలా జరగకపోవడంతో తన నివాసం నుంచే వెళ్లిపోయారని వైసీపీ ఎంపీ ఒకరు చెప్పారు.

### ఎందుకిలా...

అమిత్ షాను జగన్ కలుసుకోలేకపోవడం వైసీపీ, ఇతర పార్టీల ఎంపీల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్రం తమ పట్ల ఎందుకిలా వ్యవహరిస్తోందో అంతుబట్టడంలేదని ఒక వైసీపీ ఎంపీ అన్నారు. 'ముందుగా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే జగన్ ఢిల్లీకి వచ్చే వారే కాదు. వచ్చిన తర్వాత కలిసేందుకు సమయం ఇవ్వకపోవడం అవమానకరమే" అని మరో ఎంపీ వ్యాఖ్యానించారు. గురువారం మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణంరాజు, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌తో పాటు పలువురు నేతలను షా కలుసుకున్నారు. మరి జగన్ విషయంలో ఎందుకిలా వ్యవహరించారో అంతుచిక్కడంలేదని ఇంకో ఎంపీ అన్నారు. గత పర్యటన సమయంలో కూడా అమిత్ షా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు అపాయింట్‌మెంట్ ఇచ్చి... జగన్‌ను మాత్రం నిరీక్షించేలా చేయడంపై ఎంపీల మధ్య చర్చ జరిగింది. జగన్‌కు కచ్చితంగా ఏదో సందేశం పంపేందుకే షా ఈరకంగా వ్యవహరించారని వారు భావిస్తున్నారు. జగన్‌ను కలుసుకోవడంపై కేంద్ర పెద్దలకు అంత ఆసక్తి లేదని, అది ఆయనకు అనుభవపూర్వకంగా తెలియజేసేందుకే ఢిల్లీ పిలిచి మరీ విస్మరించారని పరిశీలకులు భావిస్తున్నారు. మొత్తానికి... జగన్ వరుసగా రెండుసార్లు ప్రత్యేక విమానం వేసుకుని ఢిల్లీకి వచ్చినప్పటికీ, ఖర్చు తప్ప ఫలితం దక్కలేదు.

## జగన్ వ్యక్తిగత సహాయకుడి మృతి

- 'అనంత' వెళ్లి సీఎం దంపతుల నివాళి
- మధ్యలో కడప ఎయిర్‌పోర్టులో కాసేపు

ధర్మవరం/కడప, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుటుంబానికి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న దంపెట్ల నారాయణ (60) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం దిగువపల్లికి చెందిన ఈయన మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎంకు విషయం తెలియగానే సతీసమేతంగా ప్రత్యేక విమానంలో కడపకు చేరుకుని.. అక్కడి నుంచి హెలికాప్టర్లో దిగువపల్లి వెళ్లారు. నారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన భార్య భవాని, తల్లి సాలమ్మ, కుమారుడు సాయికృష్ణ, కూతురు నిఖితలను ఓదార్చారు. కాగా.. దిగువపల్లి వెళ్లేందుకు కడప విమానాశ్రయంలో దిగిన జగన్ దంపతులకు అక్కడ కలెక్టర్ హరికిరణ్, ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్, ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. సీఎం ఎమ్మెల్యేలతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్నం 3.20 గంటలకు దిగువపల్లికి హెలికాప్టర్లో బయల్దేరారు. తిరిగి సాయంత్రం 4.45కి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుని 4.55కు గన్నవరం బయల్దేరి వెళ్లారు.

## వైసీపీలోకి మాజీ ఎమ్మెల్యే బీఎమ్మార్!

- టీడీపీకి రాజీనామా... నేడు జగన్ సమక్షంలో చేరిక

నెల్లూరు, అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు వైసీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. శుక్రవారం సాయంత్రం టీడీపీ సభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ నిర్ణయాన్ని శనివారం ప్రకటిస్తానని చెపుతున్నప్పటికీ ఇప్పటికే వైసీపీలో చేరటానికి ముహూర్తం నిర్ణయం అయిపోయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నేటి మధ్యాహ్నం 12 గంటలకు జగన్ సమక్షంలో ఆయన పార్టీలో చేరడానికి సర్వం సిద్ధమైందని తెలుస్తోంది. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ క్రియాశీల సభ్యుడిగా పనిచేసిన మస్తాన్‌రావు కావలి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఒక సారి గెలిచారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వైసీపీ నేతలతో సన్నిహితంగా ఉంటూ వచ్చిన ఆయన ఇటీవల కాకినాడలో ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ మత్స్యకార దినోత్సవానికి కూడా హాజరయ్యారు.

## ఉనికి కోసం పవన్ పాకులాట: మంత్రి మోపిదేవి

కాకినాడ సిటీ, డిసెంబరు 6: "ఉనికి కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాకులాడుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు డైరెక్షన్‌లో ఆయన నడుస్తున్నారు" అని మంత్రి మోపిదేవి వెంకటరమణ విమర్శించారు. కాకినాడలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే అసెంబ్లీ సమావేశాల సమయంలో ధర్నా చేస్తానని పవన్ వ్యాఖ్యానించడంపై స్పందించారు. ఉల్లి ధరల నియంత్రణలో భాగంగా రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కిలో రూ.25కి అమ్ముతున్నామన్నారు. ప్రస్తుతం టమాట కిలో రూ.10కి అమ్ముతున్నామనీ, దాని ధరను రూ.25కు పెంచి రైతుకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు, వినియోగదారులకు మేలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంటే పవన్ పద్ధతి లేకుండా మాట్లాడుతున్నారనీ విమర్శించారు.

## సైనిక బోర్డుకు పవన్ కోటి సాయం

- అమర జవాన్ల కోసం వీడియో విడుదల
- 8న మండపేటలో జనసేనాని పర్యటన

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ సైనిక్ బోర్డు(కేఎస్‌బీ)కి రూ.కోటి విరాళంగా ఇవ్వాలని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ మొత్తాన్ని ఎప్పుడు ఇచ్చేదీ త్వరలో వెల్లడిస్తారని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అమర సైనికుల సంస్మరణార్థం ఏటా డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీనిని పురస్కరించుకుని సైనిక బోర్డు కార్యదర్శి బ్రిగేడియర్ మృగేంద్రకుమార్ బోర్డు కార్యకలాపాలను తెలుపుతూ పవన్‌కు ఇటీవల లేఖ రాశారు. పతాక దినోత్సవం గురించి పవన్ గళంతో ఒక వీడియోను పంపమని కోరారు. ఆయన కోరిక మేరకు పవన్ కల్యాణ్ ఒక వీడియోను పంపారు. కాగా, గోదావరి జిల్లాల్లో వరి రైతుల కష్టాలు తెలుసుకునేందుకు పవన్ ఈ నెల 8న తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రైతులను స్వయంగా కలుసుకుని వారితో మాట్లాడనున్నారు.

## పవన్‌కు రెడ్డి సంఘం క్షమాపణ చెప్పాలి

- రాష్ట్ర కాపు నాడు డిమాండ్

తెనాలి రూరల్, డిసెంబరు 6: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై రెడ్డి సంఘం చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర కాపునాడు మండిపడింది. ఈ వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని సోమవారంలోగా పవన్ కల్యాణ్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. లేదంటే న్యాయ పోరాటానికి దిగుతామని పేర్కొంది. తెనాలిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాపునాడు కార్యదర్శి తోటకూర వెంకటరమణరావు మాట్లాడారు. పవన్ కల్యాణ్ తల తీసేస్తాం, ఎముకలు విరిచేస్తాం అంటూ రెడ్డి సంఘం బెదిరించడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సోదరభావంతో మెలుగుతున్న ఈ రెండు సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కేవలం రెడ్డి కులస్తులు ఓట్లు వేస్తేనే జగన్ ముఖ్యమంత్రి కాలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కాపునాడు అధ్యక్షుడు దంతాల కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు చందు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## ఇది సాహసోపేతం

'దిశ' కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా. తెలంగాణ పోలీసులది చాలా సాహసోపేత చర్య. దేశ ప్రతిష్ఠను, సంస్కృతిని మసకబారుస్తున్న ముష్కరులకు ఇలాగే శాస్తి చేయాలి. ఎన్‌కౌంటర్ వార్తతో 'దిశ' హత్యాచార ఘటనపై రగిలిపోతున్న యావత్ దేశప్రజలకు ఊరట లభించింది. పోలీసులు, సైన్యం, ఇతర దళాలూ ఇదే పంథాలో నడిచి ఉగ్రవాదులు, నేరగాళ్ల నుంచి దేశానికి విముక్తి కల్పించాలి.

- బాబా రాందేవ్, యోగా గురువు

ఈ ఎన్‌కౌంటర్ వార్త నా గాయానికి ఆయింట్‌మెంట్ రాసినట్లుంది. ఈ దేశంలో కనీసం ఓ కూతురికైనా న్యాయం జరిగింది. సంతోషం. ఏడేళ్లుగా పోరాడుతున్నా... చట్టాల్ని ఉల్లంఘించి అయినా న్యాయం చేయండని! జరగలేదు... ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను.. ఈ నెల 13న మళ్లీ కోర్టుకు వెళ్లాలి..

- ఆశాదేవి, నిర్భయ తల్లి

● తెలంగాణ నిర్భయ



# ఎదురు కాల్పులు తప్పలేదు

## దిశ హంతకులు తప్పించుకోజూశారు.. పోలీసులపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు

- రివాల్వర్ లాక్కుని కాల్పులు జరిపారు
- కాల్పులు ఆగాక చూస్తే నలుగురూ మరణించారు
- దిశ హంతకుల ఎన్‌కౌంటర్‌పై సీపీ సజ్జనార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సజ్జనార్

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దిశ హంతకులు నలుగురూ పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జన్నార్ ప్రకటించారు. కేసు దర్యాప్తులో భాగంగా నేరం ఎలా చేశారో చెప్పించేందుకు(సీన్ రీ కన్‌స్ట్రక్షన్) శుక్రవారం తెల్లవారుజామున దిశను దహనం చేసిన అండర్‌పాస్ వద్దకు తీసుకెళ్లినపుడు ఆ నలుగురు తప్పించుకొనే ప్రయత్నంలో భాగంగా రాళ్లు, కర్రలతో పోలీసులపై దాడి చేశారన్నారు. పోలీసుల నుంచి ఆయుధాలు లాక్కొని కాల్పులు జరిపారని చెప్పారు. పోలీస్‌లు జరిపిన ఎదురు కాల్పుల్లో నలుగురూ మృతి చెందారన్నారు. దిశ అత్యాచారం, హత్య కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన పరిస్థితుల్ని ఘటనా స్థలంలో సీపీ మీడియాకు వివరించారు. నలుగురు నిందితుల్ని కోర్టు అనుమతితో బుధవారం తమ కస్టడీలోకి తీసుకున్నామన్నారు. కస్టడీలో విచారించిన సమయంలో కేసుకు సంబంధించిన పలు విషయాలు వెల్లడించారన్నారు. దిశ సెల్ ఫోన్, పవర్‌బ్యాంక్, వాచీ ఘటన జరిగిన పరిసర ప్రాంతంలో దాచిపెట్టినట్లు చెప్పారన్నారు. వాటిని సేకరించేందుకు కస్టడీలో ఉన్న నలుగురు నిందితుల్ని శుక్రవారం తెల్లవారుజామున ఘటన స్థలానికి తీసుకెళ్లామని సజ్జనార్ వివరించారు. ఘటన స్థలంలో బాధితురాలి సెల్‌ఫోన్, పవర్ బ్యాంకు, చేతి గడియారం లభించాయని చెప్పారు. దిశ బతికుండగానే నిందితులు నిప్పు పెట్టారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఆమె అప్పటికే మృతి చెందిందని సజ్జనార్ స్పష్టం చేశారు.

ఏర్పడి పోలీసులపై రాళ్లు, కర్రలతో పాటు ఇతర వస్తువులతో ఒక్కసారిగా దాడి చేశారని చెప్పారు. పోలీసుల నుంచి రెండు పిస్టల్స్ లాక్కొని.. కాల్పులు ప్రారంభించారని తెలిపారు. కాల్పులు జరపొద్దని, లొంగిపోవాలని హెచ్చరించినా వినిపించుకోలేదన్నారు. తప్పని పరిస్థితుల్లో పోలీసులు ఎదురుకాల్పులు జరపాల్సి వచ్చిందని సీపీ వివరించారు. కాల్పులు ఆగిపోయిన తర్వాత పరిశీలిస్తే నలుగురు నిందితులు మరణించినట్లు తెలిపారు. అరీఫ్, చెన్నకేశవుల వద్ద పోలీసుల నుంచి లాక్కున్న పిస్టల్స్ ఉన్నాయన్నారు. తొలుత అరీఫ్.. ఆపై చెన్నకేశవులు కాల్పులు జరిపారని సీపీ తెలిపారు. పోలీస్‌ల నుంచి గన్స్ లాక్కొనే సమయానికే గన్స్ అన్‌లాక్ చేసి ఉన్నట్లు సీపీ తెలిపారు. ఎదురుకాల్పులు శుక్రవారం తెల్లవారు జామున 5:45 నుంచి 6:15 గంటల మధ్య జరిగాయన్నారు. దిశ ఘటన తర్వాత ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రజలు సంచరించే సమయంలో నిందితుల్ని బయటకు తీసుకురావడం వల్ల ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందనే తెల్లవారు జామున సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు తీసుకొచ్చామని సీపీ సజ్జనార్ తెలిపారు. నిందితులు జరిపిన దాడిలో నందిగామ ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్ తలకు గాయాలయ్యాయన్నారు. వారిని కేర్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

### లొంగిపోవాలంటున్నా!

సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా కస్టడీలో ఉన్న నలుగుర్నీ ఘటన స్థలానికి తీసుకెళ్లామని, దాచిపెట్టిన వస్తువులు అక్కడ పెట్టాం... ఇక్కడ పెట్టాం అంటూ చెప్పి అటూ, ఇటూ తిప్పారని సీపీ తెలిపారు. దిశను కాల్చివేసిన ప్రాంతానికి సుమారు 200 మీటర్ల దూరంలో నలుగురు నిందితులూ గుంపుగా

### ఇదీ జరిగింది

శంషాబాద్ తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద నవంబరు 27న రాత్రి దిశను కిడ్నాప్ చేసిన నిందితులు ఆ తర్వాత అత్యాచారం చేసి హత్య చేశారని సీపీ తెలిపారు. 'మృతదేహాన్ని చటాన్‌పల్లి వద్ద కాల్చివేశారు. దర్యాప్తు ఆధారంగా మక్తల్ మండలం నారాయణపేట జిల్లాకు మహ్మద్ ఆరీఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట్ల చెన్నకేశవులని అరెస్ట్ చేశాం. 30న మెజిస్ట్రేట్ కోర్టు వారికి రిమాండ్ విధించడంతో చెర్లపల్లి జైలుకు తరలించాం. 4న కస్టడీకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్న క్రమంలో ఇలా జరిగింది' అని వివరించారు.

## మరిన్ని హత్యలు?

దిశ హంతకులు కరుడుగట్టిన నేరస్థులని, గతంలో అనేక నేరాలు చేసినట్లుగా అనుమానంగా ఉందని, ఆ కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నామని సజ్జనార్ తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వివరాలు సేకరిస్తున్నామన్నారు. ముఖ్యంగా దారివెంట, నిర్మానుష్య ప్రాంతాల్లో కాల్చివేయబడిన మహిళల మృతదేహాలు దొరికిన ఘటనలు, మహిళల మిస్సింగ్ ఘటనలపై ఆరా తీస్తున్నామన్నారు. తమకు లభించిన సమాచారం ఆధారంగా వీరిపై ఇంకా లోతుగా విచారణ చేయనున్నట్లు తెలిపారు. నిందితులంతా 20 ఏళ్ల పైవారేనని అరీఫ్ వయస్సు 26 ఏళ్లు కాగా మిగతా వారికి 20 ఏళ్లు అని సీపీ చెప్పారు.

## అందరికీ రిపోర్ట్ పంపిస్తాం

దిశ హంతకుల ఎన్‌కౌంటర్ ఘటనకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఎన్‌హెచ్‌ఆర్సీకి సమగ్ర నివేదిక పంపిస్తామని సీపీ తెలిపారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు.

## ఎన్‌కౌంటర్లో ఎస్ఐ, కానిస్టేబుల్‌కు గాయాలు

- హైటెక్‌సిటీ కేర్ ఆస్పత్రిలో చికిత్స

హైదరాబాద్ సిటీ, డిసెంబర్6 (ఆంధ్రజ్యోతి): దిశ హంతకుల ఎన్‌కౌంటర్లో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. స్థానిక ఆస్పత్రికి వారిని తీసుకుపోగా, అక్కడి వైద్యుల సూచన మేరకు శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో హైటెక్ సిటీకేర్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఎస్ఐ వెంకటేశ్వర్లు(35), కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్(35)లను ఐసీయూలో చేర్చుకొని చికిత్స అందిస్తున్నారు. వెంకటేశ్వర్లును రాయితో కొట్టడంతో నుదుటిపై గాయమైంది. అరవింద్ గౌడ్‌పై కర్రతో దాడి చేయగా ఎడమ చేయి మొద్దుబారిపోయిందని, భుజంపై గాయమైందని ఆస్పత్రి మెడికల్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ డాక్టర్ గోపీ కృష్ణ తెలిపారు. ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు.

## నిర్భయ నిందితులకూ ఇక ఉరి?

- క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరించిన ఢిల్లీ గవర్నర్
- ఆమోదించి ఫైలు రాష్ట్రపతికి పంపిన హోంశాఖ
- రేపిస్టులు క్షమార్హులు కారు: రామ్‌నాథ్ కోవింద్
- హైదరాబాద్ ఎన్‌కౌంటర్ జరిగిన వెంటనే కదిలిన ఫైలు

న్యూఢిల్లీ-జైపూర్, డిసెంబరు 6: హైదరాబాద్ ఎన్‌కౌంటర్ వార్త వినగానే నిర్భయ తల్లి ఆశాదేవి స్పందన ఇది. ఏడేళ్ల కింద ఢిల్లీలో కదులుతున్న బస్సులో ఆమె కుమార్తెను ఐదుగురు వ్యక్తులు పాశవికంగా రేప్ చేసి చంపేశారు. ఈ ఘటన జాతి యావత్తునూ కదిలించింది. చట్టాల్లో మార్పులు జరిగేలా చేసింది. నిర్భయ తల్లి స్పందన అధికార యంత్రాంగంలో వేడి పుట్టించింది. 'ఏడేళ్లయినా ఇంతవరకూ ఎందుకు నిర్భయకు న్యాయం జరగలేదని?' మీడియాలో శరపరంపరగా కథనాలు నడిచాయి. అధికార యంత్రాంగం వైఫల్యాన్ని బట్టబయలు చేశాయి. ఆమె నిందితుల్లో ఒకరైన వినయ్ శర్మ తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ పెట్టుకున్న పిటిషన్‌పై దృష్టి మళ్లింది. కొన్ని నెలలుగా దీన్ని అట్టేపెట్టుకున్న ఢిల్లీ గవర్నర్ అనిల్ బైజాల్ రెండ్రోజుల కిందటే (బుధవారంనాడు) దాన్ని తిరస్కరిస్తూ కేంద్ర హోంశాఖకు ఫైలు పంపారు. ఆయన క్లియర్ చేయడానికి ప్రోద్బలమిచ్చింది కూడా దిశ రేప్ ఉదంతమే! దేశవ్యాప్తంగా దిశ అత్యాచార ఘటన ప్రకంపనలు రేపడంతో ఆయన హడావుడిగా క్షమాభిక్షను తిరస్కరించి పంపారు. అనంతరం హోంశాఖ వద్ద మరికొంత జాప్యం జరిగింది. దీనిపై పరిశీలన పూర్తికాలేదు. ఈలోగా హైదరాబాద్ ఘటన- ఆశాదేవి స్పందనల సెగ హోంశాఖకు తగిలింది. అది కూడా 'క్షమాభిక్షను తిరస్కరిస్తున్నట్లు' రాసి ఆ ఫైలును రాష్ట్రపతికి పంపింది. ఇదంతా గంటన్నర వ్యవధిలో పూర్తయిపోయింది. ఈ ఒక్క పరిణామమే కాదు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా 'రేపిస్టులకు అసలు క్షమాభిక్ష ఎందుకు..?' అని ప్రశ్నిస్తూ మౌంట్ అబూలో చేసిన ప్రసంగం ప్రసార మాధ్యమాల్లో వైరల్ అయి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. "మన బిడ్డలపై జరుగుతున్న పాశవిక దాడులు దేశ ఆత్మనే చిదిమేస్తున్నాయి. పోక్సో చట్టం కింద దోషులుగా తేలినవారు అసలు క్షమాభిక్షకే అనర్హులు. క్షమాభిక్ష కోరుతూ అర్జీ పెట్టుకునే హక్కు వారికి ఉండరాదు. ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సినది పార్లమెంటే. కానీ ఆ దిశగా కదలాలి" అని ప్రజాపతి బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయలో చేసిన ప్రసంగంలో ఆయన అభిప్రాయపడ్డారు. 'మహిళల పట్ల గౌరవం కలిగి ఉండేలా బాలురకు చిన్నప్పటి నుంచీ తెలియజెప్పే కృషి జరగాలి. ప్రతీ తల్లీ, తండ్రీ, పౌరులు, మీరు, నేను అందరం.. ఈ కృషి చేయాలి' అని ఆయన ఉద్బోధించారు.

## ఎందుకింత హర్షాతిరేకాలు?

### పాలాభిషేకాలు.. సంబరాలు ఇస్తున్న సంకేతాలేమిటి?

హైదరాబాద్, డిసెంబరు 6: హైదరాబాద్ మహానగరంలో అదో మధ్యతరగతి కుటుంబం. ఆ ఇంట్లో అందరూ ఉన్నత విద్యావంతులే. ఉదయం ఎనిమిది గంటల వేళలో దిశ నిందితులంతా ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారన్న సమాచారం ఆ ఇంటి పెద్దకు సమాచారం అందింది. కట్ చేస్తే.. ఆ సాయంత్రం వరకూ ఆ ఇంట్లో వారి సంభాషణ అంతా ఆ ఘటన మీదనే... మణికొండలో ఒక సూపర్ మార్కెట్. షాపింగ్ చేస్తున్న అతనికి ఫోన్ వచ్చింది. దిశ నిందితులు ఎన్ కౌంటర్ లో హతమయ్యారన్నది సారాంశం. ఆ విషయాన్ని అక్కడే ఉన్న ఉద్యోగులకు చెప్పారు. క్షణాల్లో అక్కడ పని చేస్తున్న మహిళా ఉద్యోగులు అతని వద్దకు వచ్చారు. మీరు చెప్పింది నిజమా సార్? అని ప్రశ్నించారు. అవునన్న అతనితో.. 'దిశ ఘటన తర్వాత మా ఇళ్లల్లోని వారంతా ఉద్యోగం మానేసి ఊరికి రమ్మంటున్నారు. మంచి జరిగింది.. మా వాళ్లందరికీ ధైర్యం వస్తుంది. మంచిగా జరిగింది సార్ ' అని విపరీతమైన సంతోషానికి గురయ్యారు. మొత్తంగా భావోద్వేగంతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇందులో భాగంగానే నిత్యం రద్దీగా ఉండే పంజాగుట్ట చౌరస్తాలో స్థానికులు పెద్దఎత్తున చేరటమే కాదు.. అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌కు అభినందనలు తెలిపారు. సైబరాబాద్ సీపీ సజ్జనార్ ఫోటోకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. జిందాబాద్‌లతో మోతెక్కించారు. ఉదయం నుంచి మొదలైన బాణసంచా కాల్చటం.. సాయంత్రం వరకూ సాగుతూనే ఉంది. సామాన్యులే కాదు సెలబ్రిటీలు కూడా!. నాకు ఆ తూటాల్ని దాచుకోవాలని ఉందంటూ ఒక సినీ ప్రముఖుడు ట్వీట్ చేశారు. ఆయన వ్యాఖ్యకు సానుకూల స్పందన అంతా ఇంతా కాదు. ఆ మాటకు వస్తే.. ఎన్‌కౌంటర్ విషయం బయటకు వచ్చిన రెండు గంటల వ్యవధిలో ట్విట్టర్ టాప్ ట్రెండింగ్ పదాల్లో ఎన్‌కౌంటర్.. హైదరాబాద్ పోలీస్.. దిశా కేస్ నిలిచాయి. ప్రజలు ఇలా స్పందిస్తారని తాము అస్సలు ఊహించలేదని పోలీసు ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. న్యాయం జరిగినట్లు ప్రజలు బలంగా అభిప్రాయపడ్డారని మాజీ డీజీపీ అరవిందరావు వ్యాఖ్యానించారు.

## అంత్యక్రియలకు బ్రేక్!

- ఎల్లుండి రాత్రి వరకు చేయొద్దన్న హైకోర్టు
- హైకోర్టులో హక్కుల సంఘాల పిటిషన్

హైదరాబాద్/మహబూబ్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దిశ హంతకుల ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణ జరపాలని, నలుగురి మృతదేహాలకు స్వతంత్ర నిపుణులతో మళ్లీ పోస్టుమార్టం చేయించాలని కోరుతూ ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ పిటిషన్‌ను తొమ్మిదవ తేదీ ఉదయం పరిశీలిస్తామని ప్రకటించింది. సోమవారం రాత్రి 8 గంటల వరకు మృతదేహాలకు అంత్యక్రియలు చేయరాదని ఆదేశించింది. ఎన్‌కౌంటర్ మృతుల పోస్టు మార్టం నివేదికను పెన్‌డ్రైవ్ లేదా సీడీ రూపంలో శుక్రవారం సాయంత్రమే మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కోర్టు న్యాయమూర్తికి అందించాలని ఆదేశించింది. అలాగే మృతదేహాలను డిసెంబర్ 9 రాత్రి 8 గంటల వరకు భద్రపరచాలని జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌రావులతో కూడిన ధర్మాసనం శుక్రవారం హౌజ్ మోషన్‌లో ఆదేశాలు జారీ చేసింది. దిశ హంతకుల ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణ కోరుతూ ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశాయి. దీన్ని పరిగణనలోకి తీసుకుని హైకోర్టు ధర్మాసనం హౌజ్ మోషన్‌లో విచారణ చేపట్టింది. మళ్లీ 9న ఉదయం 10.30 గంటలకు కేసు విచారించాలని ధర్మాసం నిర్ణయించింది.

### హక్కుల కమిషన్ ఆదేశం కూడా!

దిశ హంతకుల అంత్యక్రియలకు బ్రేక్ పడింది. తాము వచ్చి పరిశీలించిన తర్వాతే మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించాలని, అంతవరకు అంత్యక్రియలు నిర్వహించొద్దని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశించడంతో ప్రభుత్వం అప్పగింతను నిలిపేసింది. మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో గాంధీ ఆసుపత్రి వైద్యులు స్థానిక ఫోరెన్సిక్ విభాగం వారితో సంబంధం లేకుండా పోస్టుమార్టం మొదలు పెట్టారు. తమకు సమాచారం లేకుండా ఎలా చేస్తారని ఫోరెన్సిక్ విభాగాధిపతి పార్వతి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ కలుగజేసుకొని వేరే డాక్టర్లు, సిబ్బందిని సమకూర్చడంతో పోస్ట్‌మార్టం ప్రక్రియ 5 గంటలకు మొదలైంది. తర్వాత జిల్లా జడ్జి ప్రేమావతి సైతం తాను రాకుండానే పోస్ట్‌మార్టం ప్రక్రియ మొదలు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడే మొదలు పెడుతున్నారని ఎస్పీ చెప్పడంతో ప్రక్రియను కొనసాగించేందుకు ఆమె అనుమతించారు. ఆరిఫ్, శివ, నవీన్, చెన్నకేశవుల మృతదేహాలకు రాత్రి 9 గంటల వరకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను ఫ్రీజర్లలో భద్రపరచి, మార్చురీలో ఉంచి తాళం వేశారు. బయట పోలీసులు ప్రత్యేక పహారా ఏర్పాటు చేశారు.

# అక్కడే... అంతం

(మూడో పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులతోపాటు వివిధ వర్గాల ప్రజలు చేసిన డిమాండ్‌ను పోలీసులు ఆ రూపంలో నెరవేర్చినట్లయింది. పరోక్షంగా ఈ తరహా దారుణాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరిక చేసినట్లయింది. గత నెల 27న శంషాబాద్ టోల్‌గేట్ వద్ద వెటర్నరీ డాక్టర్ 'దిశ'పై నిందితులు అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని షాద్‌నగర్ చటాన్‌పల్లి సర్వీస్ రోడ్డులో బ్రిడ్జి కింద 28వ తేదీ తెల్లవారుజామున పెట్రోల్, డీజిల్ పోసి దహనం చేశారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్లు మహ్మద్ ఆరీఫ్, చింతకుంట చెన్నకేశవులు, క్లీనర్లు జొల్లు శివ, జొల్లు నవీన్‌లను అరెస్ట్ చేశారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను పది రోజుల కస్టడీకి బుధవారమే తీసుకున్నారు. బుధ, గురువారాల్లో నిందితులను పూర్తిస్థాయిలో విచారించారు. దర్యాప్తులో భాగంగా సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం శుక్రవారం తెల్లవారు జామున పది మంది స్పెషల్ పార్టీ పోలీసులు నలుగురు నిందితులను ఘటనా స్థలానికి తీసుకెళ్లారు. తొలుత, శంషాబాద్ టోల్‌గేట్, లారీ పార్కింగ్, పెట్రోల్ ఎక్కడ కొన్నది, ఏయే మార్గంలో మృతదేహాన్ని తీసుకెళ్లిందీ ఆరా తీశారు. అనంతరం, చటాన్‌పల్లి బైపాస్ రహదారి అండర్‌పాస్ వద్దకు తీసుకొచ్చారు. దిశ సెల్‌ఫోన్, గడియారం, పవర్ బ్యాంక్ దాచిపెట్టిన స్థలానికి తీసుకెళ్లారు. దిశను దహనం చేసిన స్థలం నుంచి 250 మీటర్ల దూరంలోనే బీడుగా ఉన్న పొలంలోకి వెళ్లగానే నలుగురూ తిరుగుబాటు చేయడంతో ఎన్‌కౌంటర్ చేశామని పోలీస్ అధికారులు తెలిపారు. దిశను తెల్లవారు జామున దుండగులు పెట్రోల్ పోసి దహనం చేసిన సమయంలోనే.. అదే ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌కు గురయ్యారు.

### 20 మీటర్ల దూరంలో మృతదేహాలు

ఘటనా స్థలంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఒక్కో మృతదేహం సుమారు 20 మీటర్ల దూరంలో పడి ఉంది. ఘటనా స్థలంలో క్లూ టీం తనిఖీలు నిర్వహించింది. వరి పొలం, మృతదేహాలు పడి ఉన్న ప్రాంతంలోని గడ్డిలో ప్రతి అంగుళంలో పూర్తి సాంకేతిక పరికరాలతో ఆధారాలు సేకరించింది. నిందితుల పిస్టల్స్ నుంచి బుల్లెట్ క్యాప్స్ పడి ఉన్న ప్రాంతం.. పోలీస్‌లు ఉపయోగించిన పిస్టల్ బుల్లెట్ క్యాప్స్ పడిన ప్రాంతం.. ఇతర ఆధారాలను సేకరించింది.

### నలుగురు నిందితులు.. 11 బుల్లెట్లు

'దిశ' హంతకులు నలుగురి మృతదేహాల్లో 11 బుల్లెట్ గాయాలు ఉన్నాయి. ప్రధాన నిందితుడైన మహ్మద్ ఆరిఫ్ శరీరంపై 4 బుల్లెట్ గాయాలున్నాయి. ఆరిఫ్ చాతీలో రెండు; కుడివైపు పక్కటెముకలో ఒక బుల్లెట్ దిగినట్లు తెలుస్తోంది. శివ శరీరంపై 3; నవీన్ తలకు ఒక బుల్లెట్ గాయం, చెన్నకేశవులుకు 3 బుల్లెట్ గాయాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో నవీన్ ఒక్క బుల్లెట్ దెబ్బకే నేలకొరగడం గమనార్హం. అతని తలలో కుడివైపు చెవి వెనక బుల్లెట్ దిగిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. చెన్నకేశవులు మర్మాంగం నుంచి రక్తస్రావం జరిగిన ఆనవాళ్లు ఉన్నాయి.



### అరగంటలో అంతం

- 5:30లకు సీన్ ఆఫ్ అఫెన్స్ వద్దకు నిందితులను తీసుకెళ్లారు.
- 5:35లకు దిశకు సంబంధించిన సెల్‌ఫోన్, వాచ్, పవర్‌బ్యాంకు పాతిపెట్టిన చోటు చూపిస్తామని పొలాల్లోకి తీసుకెళ్లిన నిందితులు
- 5:38లకు నిందితులు చూపించిన చోట సెల్‌ఫోన్, వాచ్, పవర్‌బ్యాంకును స్వాధీనం చేసుకున్న పోలీసులు
- 5:40లకు పోలీసులు వస్తువులు స్వాధీనం చేసుకునే పనిలో ఉండగా.. ఒక్కదగ్గరకు చేరిన నిందితులు
- 5:42లకు పారిపోదామని మిగిలిన మిత్రులకు సైగ చేసిన మహ్మద్ పాషా అలియాస్ ఆరిఫ్
- 5:45లకు తమ పక్కనే ఉన్న ఇద్దరు పోలీసుల వద్ద నుంచి రెండు తుపాకులను లాక్కున్న మహ్మద్ ఆరిఫ్, చెన్నకేశవులు తుపాకులు లాక్కున్నారు.
- 5:49లకు మిగిలిన పోలీసులు నిందితులపై తుపాకులు ఎక్కుపెట్టారు. హ్యాండ్సప్ అని హెచ్చరించారు.
- 5:50లకు నిందితులు వినకుండా పోలీసులపై కాల్పులు జరిపారు.
- 5:52లకు మిగిలిని ఇద్దరు నిందితులు శివ, నవీన్‌లు ఆ ప్రదేశంలో ఉన్న రాళ్లు, కర్రలు తీసుకొని పోలీసులపై తిరగబడ్డారు. నందిగామ ఎస్సై వెంకటేశ్వర్లు కానిస్టేబుల్ అరవింద్ గౌడ్‌లు తీవ్రంగా గాయపడ్డారు
- 5:55లకు వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం, ఆత్మరక్షణ, ప్రాణాలను దక్కించుకోవడంలో భాగంగా పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు.
- 6:00లకు పోలీసులు కాల్పులు ఆపేశారు. 6:02లకు పోలీసులు తేరురకొని చూడగా మృతదేహాలు పడి ఉన్నాయి.

## అప్పుడూ ఇప్పుడూ.. సత్యమే సాక్షి!

- 'దిశ' కాలిపోతున్నప్పుడు చూసిన రైతు
- పోలీసులకు సమాచారం ఇచ్చింది ఆయనే

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆయనో రైతు! ప్రతిరోజూ తెల్లవారుజామునే పొలానికి వెళతారు! కొట్టంలో పాలు పితుక్కుని ఇంటికి వస్తారు! యాదృచ్ఛికమే కానీ.. 'దిశ' మంటల్లో కాలిపోతున్న సమయంలో ఆయన అటే వెళ్లారు! 'దిశ' హంతకుల ఎన్‌కౌంటర్ సమయంలోనూ ఆయన అక్కడి నుంచే వెళ్లారు! ఇంకా విచిత్రం ఏమిటంటే.. 'దిశ' హంతకులు హతమైనది కూడా ఆయన పొలంలోనే! ఆయనే.. రైతు సత్యం! గత నెల 28న తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో పొలంలోని కొట్టంలో పాలు పితికేందుకు వెళ్లిన సత్యం సర్వీస్ రోడ్డులో మంట చూశాడు. ఎవరో చలి మంట వేసుకుని ఉంటారని భావించి పట్టించుకోలేదు. ఉదయం 7 ఏడు గంటలకు తిరిగి వచ్చేటప్పుడు ఇంకా మంట కొనసాగుతోంది. అనుమానం వచ్చి దగ్గరకు వెళ్లి చూశాడు. మంటల్లో ఓ చేయి కనిపించింది. దాంతో, షాద్‌నగర్ పోలీసులకు సమాచారం అందించాడు. శుక్రవారం ఉదయం 5 గంటలకు కూడా ఎప్పటిలాగే పొలంలోని కొట్టంలో పాలు పితికేందుకు వెళ్లాడు. ఆ సమయంలో కొందరు పోలీసులు అతనిని అటు రావద్దని, తర్వాత రమ్మని చెప్పి పంపించారు. పోలీసుల సూచన మేరకు వెనక్కు తగ్గిన సత్యం.. ఆరు గంటల తర్వాత వచ్చి తన పని తాను చేసుకుని వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని సత్యం సోదరుడు వెంకటయ్య తెలిపారు. తమకు అక్కడ 30 ఎకరాల పొలం ఉందని, వరి, టమాటా పండిస్తున్నామని చెప్పారు. నలుగురు నిందితులూ హతమైనది తమ పొలంలోనేనని వెల్లడించారు.



పోలీసులపై పూల వర్షం కురిపిస్తున్న జనాలు

## ఆగ్రహించిన వారే అభినందించారు

### రాళ్లు విసిరినవారే పూలవర్షం కురిపించారు.. పోలీసులు జిందాబాద్ అంటూ నినదించారు

షాద్‌నగర్ బృందం: సరిగ్గా ఏడు రోజుల కిందట! నవంబరు 30వ తేదీ! షాద్‌నగర్‌వాసులు పోలీసులపై తిరుగుబాటు చేశారు. పోలీసు స్టేషన్ ముందు ఆందోళన చేసి పోలీసులపై రాళ్లు, చెప్పులు విసిరారు! సరిగ్గా వారంలోనే.. అప్పట్లో రాళ్లు, చెప్పులు విసిరిన వారే పోలీసులను అభినందిస్తూ పూల వర్షం కురిపించారు. నాడు శాపనార్థాలు పెట్టిన మహిళలు పోలీసులపై పూలు చల్లారు. హీరో సజ్జనార్ అంటూ ఫ్లెక్సీలు ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన దిశ హంతకులు ఎన్‌కౌంటర్లో చనిపోయారని తెలుసుకున్న జనం వేలాదిగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. 'పోలీసులు జిందాబాద్', 'సజ్జనార్ సెల్యూట్', 'కేసీఆర్ జిందాబాద్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బందిపై పూలు చల్లుతూ వారికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఆనందం పట్టలేక బాణసంచా కాలుస్తూ 'దిశ అమర్ హై' అంటూ నినాదాలు చేశారు. హంతకులకు పోలీసులు సరైన శిక్ష వేశారని, దిశ ఆత్మ శాంతిస్తుందని నినదించారు. ఎన్‌కౌంటర్‌పై ఆనందం వ్యక్తం చేస్తూ.. మృతదేహాలను మహబూబ్‌నగర్ తరలించే వరకు వేలాదిగా తరలివచ్చి నినాదాలతో మారుమోగించారు. అంతేనా.. ఘటనా స్థలం జాతీయ రహదారికి అతి సమీపంలో ఉండడంతో ప్రయాణికులు కూడా వాహనాల్లోంచే పోలీసులకు సలాం తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. వాహన చోదకులు సైతం సరైన న్యాయం జరిగిందంటూ వాహనాల పైనుంచే నినాదాలు చేశారు.

# వెయ్యి తెగల జన్యుపటాలు సిద్ధం

- జన్యులోపంతో వచ్చే వ్యాధులకు సంజీవని
- దేశవ్యాప్తంగా ఏడుకోట్ల మందికి ఊరట
- సాంకేతికతను అభివృద్ధి చేసిన సీఎస్ఐఆర్

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చక్కెర కర్మాగారాల నుంచి వెలువడే మొలాసిస్, ఇథనాల్ తయారీలో ఉత్పన్నమయ్యే వ్యర్థాలను రీసైకిల్ చేసే సాంకేతికతను కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఆర్) అభివృద్ధి చేసింది. వాటినుంచి వ్యవసాయానికి ఉపయోగపడే పొటాష్ ఎరువు తయారయ్యేలా, రీసైక్లింగ్ చేసిన నీరు సాగుకు ఉపయోగించుకునేలా రూపొందించిన ఈ టెక్నాలజీని తాజాగా అమల్లోకి తెచ్చింది. దీనికి అంతర్జాతీయ పేటెంట్‌కు దరఖాస్తు చేసినట్లు సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్ సి.మాండే వెల్లడించారు. మానవాళికి ఉపయోగపడే పరిశోధనలకు శ్రీ పద్మావతి వేంకటేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించనున్న రామకృష్ణ పరమహంస రీసెర్చ్ గ్రాంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

### ఇథనాల్ వ్యర్థాల నుంచి పొటాష్‌ను తయారుచేసే టెక్నాలజీ అమల్లోకి వచ్చిందా?

ఒక లీటరు ఇథనాల్ తయారీలో 15లీటర్ల వ్యర్థాలు వస్తాయి. వాటినుంచి వేరుచేసిన పొటాష్‌ను వ్యవసాయంలో ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం భారత్ ఇతర దేశాల నుంచి పొటాష్‌ను దిగుమతి చేసుకుంటోంది. ఈ టెక్నాలజీతో పర్యావరణానికి హాని లేకుండా చేయడమే కాకుండా... మన అవసరంలో 20శాతం పొటాష్‌ను ఇక్కడే ఉత్పత్తి చేయవచ్చు. దీనివల్ల ఏటా రూ.700కోట్ల వరకు విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. 15వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఈ సాంకేతికతను మహారాష్ట్రలోని ఔరంగాబాద్ డిస్టిలరీస్‌లో రెండునెలలుగా అమలు చేస్తున్నాం. ఇప్పుడు అక్కడ నుంచి పొటాష్‌ను అమ్ముతున్నారు.

### డిస్టిలరీల్లో ఈ టెక్నాలజీని పెట్టాలంటే ఎంత ఖర్చవుతుంది?

రూ.30కోట్ల వరకూ ఖర్చవుతుంది. పొటాష్ ఉత్పత్తితో ఈ మొత్తం రెండున్నరేళ్లలో తిరిగొచ్చేస్తుంది. ఈ టెక్నాలజీని కనిపెట్టినందుకు మమ్మల్ని అభినందిస్తూ ఇటీవలే ప్రధాని మోదీ స్వయంగా లేఖ కూడా రాశారు. దీని గురించి అడిగి తెలుసుకున్నారు.

### జన్యుమ్యాపింగ్ మానవాళికి ఎలా ఉపయోగపడతాయి?

దేశంలో సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో 38పరిశోధనా సంస్థలున్నాయి. ఇందులో జన్యుమ్యాపింగ్‌పై కొన్ని సంస్థలు పరిశోధనలు చేస్తున్నాయి. మనదేశంలో అనేక జాతులు, ప్రాంతాలున్నాయి. అందువల్ల వ్యక్తుల జన్యు అమరికల్లో కూడా వైవిధ్యం ఉంటుంది. ఇలా వైవిధ్యం ఉన్న వెయ్యిమంది జన్యుపటాలు సిద్ధం చేశాం. ఇవి జన్యు లోపం వల్ల వచ్చే వ్యాధులను నివారించేందుకు సంజీవనిలా ఉపయోగపడతాయి. మనదేశంలో దాదాపు ఏడు కోట్లమంది ఈ తరహా వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ పరిశోధన ఫలాలతో వారికి ఊరట కలుగుతుంది.

### పరిశోధనలకు నిధుల లభ్యత ఎలా వుంది?

పశ్చిమ దేశాల్లో పరిశోధనలకు ప్రభుత్వం కేటాయించే నిధులతో పాటు దిగ్గజ పారిశ్రామికవేత్తలు సైతం గ్రాంట్‌లు ఇస్తుంటారు. బిల్‌గేట్స్ భారత్ పర్యటనకు వచ్చినప్పుడు ఇక్కడి దిగ్గజ పారిశ్రామికవేత్తలు కూడా తమ సంపాదనలో కొంత శాతం పరిశోధనలకు గ్రాంట్‌గా ఇవ్వాలని పిలుపునిచ్చారు. పద్మావతి వేంకటేశ్వర ఫౌండేషన్ ఏటా రూ.3కోట్ల గ్రాంట్ ఇవ్వడం మరింతమందికి స్ఫూర్తినిస్తుంది. దీన్ని 'నోబెల్ ప్రైజ్ ఆఫ్ ది ఈస్ట్'గా అభివర్ణించవచ్చు.

### బయోడీజిల్ తయారీ విజయవంతమైందా?

పర్యావరణానికి హానిచేయని బయోడీజిల్‌ను తయారుచేసే ప్రక్రియను కొనుగొన్నాం. జట్రోపా మొక్కనుంచి తీసిన డీజిల్‌తో డెహ్రాడూన్ నుంచి ఢిల్లీ విమానం నడిచింది. దీన్ని వాణిజ్యపరంగా విజయవంతం చేసే పరిశోధనలు చేస్తున్నాం. త్వరలోనే అవి సాకారమవుతాయి.

### ఏపీలో పరిశోధనా సంస్థలు ప్రారంభించే అవకాశాలున్నాయా?

సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ గోవాలో ఉంది. ఆ సంస్థ శాఖ విశాఖపట్నంలో ఉంది. అంటే ప్రస్తుతం ఇక్కడ మా ముద్రలున్నాయి. కొత్త పరిశోధన సంస్థలను అవసరాన్ని బట్టి ప్రారంభించాల్సి ఉంటుంది.





అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కమిషనర్

పార్లమెంట్ హౌస్‌లో నివాళి అర్పిస్తున్న మోదీ

## అంబేడ్కర్ ఆశయాలే ఆదర్శం: రమణారెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 63వ వర్ధంతి కార్యక్రమం ఢిల్లీలోని ఆంధ్రా భవన్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి ఏపీ భవన్ ప్రత్యేక కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, సమాజంలో బడుగు, బలహీనవర్గాలకు సామాజిక న్యాయం చేయడానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

## భార్యను ఇస్త్రీ పెట్టెతో కాల్చి.. భర్త ఆత్మహత్య

కదిరి, డిసెంబరు 6: తాగుడుకు బానిసైన భర్త.. భార్యను ఇస్త్రీపెట్టెతో కాల్చి చిత్రహింసలకు గురిచేసి ఆపై తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా కదిరిలో చోటుచేసుకుంది. బాధితురాలు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా నల్లచెరువు మండలంలోని ఓరువాయి గ్రామానికి చెందిన మహిళకు కడప జిల్లా రాయచోటి మండలంలో చీకటోళ్లపల్లికి చెందిన చంద్రతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కొడుకు (6) ఉన్నాడు. తాగుడుకు బానిసైన చంద్ర రోజూ వేధింపులకు గురి చేస్తుండడంతో ఆమె నెల రోజుల క్రితం మదనపల్లెలోని తన చిన్న అన్న ఇంటికి వెళ్లి అక్కడే ఉంటోంది. ఐదు రోజుల క్రితం కుమారుడి ఆధార్ కార్డు కోసం చంద్ర ఇంటికి వచ్చింది. మూడు రోజులు ఇద్దరూ బాగానే ఉన్నారు. బుధవారం ఫుల్లుగా తాగొచ్చిన చంద్ర తలుపులు మూసేసి ఇస్త్రీ పెట్టెతో భార్య శరీరంపై వాతలు పెట్టాడు. దీంతో ఆమెను కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం అక్కడి నుంచి కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. చంద్ర శుక్రవారం తన ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

# 'కైలాస్'.. బుస్సే!

- అలాంటి దేశమే లేదు.. నిత్యానందకు మావద్ద భూభాగం అమ్మలేదు.. ఆశ్రయమూ తిరస్కృతి
- హైతీలో ఉండే చాన్సు.. నిత్యానంద వెబ్‌సైట్లో కావాలనే 'దేశ'ప్రచారం.. ఈక్వెడార్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ, డిసెంబరు 6 : వివాదాస్పద మతగురువు నిత్యానంద తనకంటూ ప్రత్యేకంగా ఒక దేశం, ప్రభుత్వం, జెండాను ఏర్పాటు చేసుకున్నారన్న వార్తలు విని, అంతా 'ఔరా' అన్నారు. 'కైలాస్' అనే పేరుపెట్టిన ఈ దేశానికి గుర్తింపు కోసం ఐక్యరాజ్యసమితిలో ప్రయత్నాలూ సాగుతున్నాయన్న కథనాలు చదివి, 'నిజమా' అని విస్తుపోయారు. అయితే, ఈ కథనాలేవీ వాస్తవం కాదని ఈక్వెడార్ స్పష్టం చేసింది. 'కైలాస్'ను తమ నుంచి కొనుగోలు చేసిన భూభాగంలో నిత్యానంద ఏర్పాటుచేశారన్న వార్తలను కొట్టివేసింది. చిన్నపిల్లల అక్రమ నిర్బంధం వ్యవహారంలో భారత్ నిత్యానంద కోసం గాలిస్తోంది. అత్యాచారం కేసులో ఆయన అభియోగాలను ఎదుర్కొంటున్నారు. అరెస్టు భయంతో దేశం దాటిపోయిన నిత్యానందకు.. తమ దేశం ఆశ్రయం ఇచ్చిందనేది వాస్తవం కాదని ఈక్వెడార్ పేర్కొంది. "నిత్యానంద మమ్మల్ని ఆశ్రయం కోరిన మాట నిజమే. శరణార్థిలా మాదేశంలో ఉండేదుకు అనుమతి ఇవ్వాలని ఆయన దరఖాస్తు చేసుకొన్నారు. ఆ దరఖాస్తును మేం తిరస్కరించాం. దీంతో ఆయన కరేబియన్ దీవుల్లో ఒకటైన హైతీకి తరలిపోయినట్టు తెలుస్తోంది" అని భారత్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది. ఉత్తర అమెరికాలో భాగమైన ఈక్వెడార్ నుంచి ఒక ద్వీపాన్ని నిత్యానంద కొని, అక్కడ హిందూదేశం నిర్మించుకొన్నట్టు తొలుత వార్తలు వచ్చాయి. అధికార మతంగా సనాతన హైందవాన్ని ప్రకటించుకొన్న ఈ దేశంలో, పాస్‌పోర్టు నుంచి పౌరసత్వందాకా ప్రతిదీ ప్రత్యేకమేనని కథనాలు వెలువడ్డాయి. అయితే, డిజిటల్ మీడియా, కొన్ని పత్రికల్లో కనిపించిన ఈ కథనాలన్నింటికీ నిత్యానంద సొంత వెబ్‌సైట్ కైలాస్.ఆర్గ్ వండివార్చిన సమాచారమే ఆధారమని ఈక్వెడార్ పేర్కొంది. కాగా, నిత్యానంద పాస్‌పోర్టును రద్దుచేసినట్టు కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటించింది. పిల్లల అక్రమ నిర్బంధం, ఇద్దరు మహిళల అదృశ్యం, అపహరణ కేసుల్లో నిత్యానంద కోసం గాలిస్తున్న గుజరాత్ పోలీసులు.. తాజా కథనాలతో అప్రమత్తం అయ్యారు. ఆయనపై బ్లూ కార్నర్ నోటీసు జారీచేసేలా ఇంటర్‌పోల్‌ను సంప్రదించాలని నిర్ణయించారు. ఈ విషయంలో తమకు సహకరించాలని సీఐడీకి శుక్రవారం లేఖ రాశారు.

## నాటు పడవ మునిగి 62 మంది మృతి



మారిటానియాలోని అట్లాంటిక్ సముద్ర తీరంలో ఓ నాటు పడవ పెద్ద రాయికి తగిలి నీట మునిగింది. ఈ ఘటనలో గాంబియా నుంచి స్పెయిన్‌లోని కనరీ ద్వీపానికి వలస వెళ్తున్న 62 మంది మృతి చెందారు. 83 మంది ఈదుకుంటూ తీరానికి చేరుకున్నారు. వీళ్లంతా స్పెయిన్‌కు అక్రమంగా వలస వెళ్తున్నారని మారిటానియా మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఇదే అతిపెద్ద బోటు ప్రమాదమని అధికారులు తెలిపారు.

## నల్సా చైర్మన్‌గా జస్టిస్ ఎన్వీ రమణ

- బాధ్యతలు స్వీకరించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి
- పేదలకు న్యాయం చేరాలని అధికారులకు సూచన



న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నియమించారు. సుప్రీంకోర్టులో రెండవ సీనియర్ జడ్జి అయిన జస్టిస్ ఎన్వీ రమణ నియామకం నవంబరు 27 నుంచే అమల్లోకి వచ్చిందని అధికార వర్గాలు తెలిపాయి. నల్సా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ రమణ శుక్రవారం ఢిల్లీలోని జామ్‌నగర్‌లోని ఆ సంస్థ కార్యాలయానికి వెళ్లారు. డైరెక్టర్ సునీల్ చౌహాన్, ఇతర అధికారులతో చర్చలు జరిపారు. దేశంలో న్యాయసేవలను సమర్థంగా పేదలకు, అణగారిన వర్గాలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు కృషి చేయాలని వారికి చెప్పారు. నల్సా భవిష్యత్‌లో అనుసరించాల్సిన తీరుతెన్నులపై ఆయన మార్గదర్శక సూత్రాలను నిర్దేశించారు. 2020లో ప్రజల వద్దకు వెళ్లి వారికి న్యాయసేవల గురించి వివరించాలని జస్టిస్ రమణ సూచించారు. లీగల్ సర్వీసెస్ క్లినిక్కులు, లీగల్ సర్వీస్ సంస్థల డిజిటలీకరణ, పోలీస్ స్టేషన్ స్థాయి నుంచి లీగల్ సేవలను అందుబాటులో తీసుకురావడం తదితర అంశాలపై వారితో ఆయన చర్చించారు. జిల్లా స్థాయి నుంచి పర్యవేక్షక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అణగారిన వర్గాలకు న్యాయసేవలు, చట్టాల గురించి తెలిపేందుకు ప్రాంతీయ భాషల్లో చిన్న చిన్న పుస్తకాలు ప్రచురించాలని సూచించారు. ప్రజల విశ్వాసం చూరగొనే ప్రయత్నం చేయాలని చెప్పారు. న్యాయపరమైన సాధికారికతకు బలమైన ఉద్యమం అవసరమని, అణగారిన వర్గాలకు న్యాయపరమైన సేవలను అందించేందుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు జస్టిస్ ఎన్వీ రమణ చెప్పారు.

### రాహుల్‌కు మళ్లీపగ్గాలు?

వయనాడ్, డిసెంబరు 6: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలను రాహుల్ గాంధీ మళ్లీ చేపట్టవచ్చని తెలుస్తోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాహుల్ ఆంతరంగిక బృంద సభ్యుడు కేసీ వేణుగోపాల్ ఈ విషయాన్ని సంకేతప్రాయంగా చెప్పారు. "మళ్లీ పగ్గాలు చేపట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో అనివార్యం. నేతలు, కార్యకర్తల మనోభావాలను ఆయన అంగీకరిస్తారు. ఈ ఏడాది జూలైలో ఆయన నిష్క్రమణ భావోద్వేగంతో కూడుకున్నది. దేశం క్లిష్ట దశలో ఉంది. పార్టీకి ఆయన నాయకత్వం అవసరం" అని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెలలో ఏఐసీసీ విస్తృత సమావేశం జరుగుతుందని, అందులో రాహుల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటారని మరో నేత చెప్పారు.

## మృగాళ్లకు గుణపాఠం

### ఎన్‌కౌంటర్‌పై వైసీపీ ఎంపీ రఘు

న్యూఢిల్లీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దిశపై జరిగిన అఘాయిత్యానికి బాధ్యులైన మృగాళ్లకు చక్కని గుణపాఠం జరిగిందని నరసాపురం వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ, ఈ ఎన్‌కౌంటర్‌పై ఏ ఒక్కరూ అభ్యంతరాలు చెప్పకూడదని, అభ్యంతరం చెబితే దిశ హంతకులను సమర్థించినట్టేనని అన్నారు.

### చావును కొని తెచ్చుకున్నారు: సీఎం రమేశ్

ప్రజలు కోరుకున్నట్టే దిశ కేసులో నిందితులు మరణదండనకు గురయ్యారని, వారి చావును వారే కొని తెచ్చుకున్నారని బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ వ్యాఖ్యానించారు. పోలీసులపై ఎదురు తిరిగి కాల్పులకు తెగపడ్డారని అందుకే ఎన్‌కౌంటర్ చేశారని అన్నారు. ఒక ఆడపిల్లను అత్యంత కిరాతకంగా హతమార్చిన దోషులకు ఇలాంటి శిక్ష పడటంవల్ల భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

### పోలీసులకు అభినందనలు: విష్ణువర్ధన్‌రెడ్డి

దిశ కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌ను బీజేపీ నేత, జాతీయ నెహ్రూ యువ క్రేందం ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అభినందించారు. కొన్ని విషయాలకు మౌనమే సమాధానం చెబుతుందనడానికి తెలంగాణ పోలీసు చర్యలే ఉదాహరణని వ్యాఖ్యానించా రు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని కూడా అభినందించారు.

### ఆ పోలీసులను అరెస్టు చేయాలి

#### ఏపీ మానవ హక్కుల ఫోరం డిమాండ్

విశాఖపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'దిశ' కేసులో నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు సిబ్బందిపై హత్యా నేరం కింద కేసు పెట్టి అరెస్టు చేయాలని ఏపీ మానవ హక్కుల ఫోరం(హెచ్‌ఆర్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు యాజీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కె.సుధ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనలో తెలంగాణ పోలీసులు పాల్గొన్నారు కాబట్టి దర్యాప్తు నిష్పాక్షికంగా జరుగుతుందనే విశ్వాసం లేదని, కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. చనిపోయింది రిమాండ్ ఖైదీలే కాబట్టి న్యాయస్థానం సుమోటోగా కలుగచేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులను పోలీసులు పథకం ప్రకారం ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. నిందితులు నేరం చేశారని నిర్ధారించి, శిక్షలు వేయాల్సింది న్యాయస్థానమే గానీ పోలీసులు కాదని అన్నారు. పోలీసులే తీర్పులు చెప్పేసి, వాటిని అమలు చేస్తే అది న్యాయం ఎలా అవుతుందో ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

### ఇంతటితో వదిలేయొద్దు: పవన్

దిశ ఉదంతం ఆడపడుచుల రక్షణకు ప్రస్తుతం ఉన్న చట్టాలు సరిపోవని హెచ్చరిస్తోందని పవన్ కళ్యాణ్ ఓ లేఖలో అభిప్రాయపడ్డారు. దీనిని మ నం ఇంతటితో వదిలి పెట్టకూడదన్నారు. ఇలాంటి కేసుల్లో 2,3 వారాల్లో శిక్షలు పడేలా నిబంధనలు రావాలన్నారు.

# మాకేదీ న్యాయం?

- 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌తో సర్వత్రా ఇదే ప్రశ్న
- స్పాట్‌లోనే రేప్ కేసులు తేల్చాలంటున్న బాధితులు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపైనే అఘాయిత్యానికి పాల్పడే తండ్రి.. ఒంటరి మహిళ కనిపిస్తే కాటేసే కామాంధుడు.. మనవరాలి వయసున్న పాపను చెరబట్టే వృద్ధుడు.. అక్రమ సంబంధానికి అడ్డొస్తే కాటికి పంపే రాక్షసుడు.. వయసుతో నిమిత్తం లేకుండా ఐదారేళ్ల బాలికలను చెరబట్టే మృగాళ్లు... వీళ్లందరినీ ఏమి చెయ్యాలి? ఆ కేసులు తేలి, ఎంతకాలానికి వారికి శిక్షలు పడాలి? బాధిత కుటుంబాల నుంచి పోలీసులకు ఇప్పుడు ఇలాంటి ప్రశ్నలే వస్తున్నాయి. తెలంగాణలో జరిగిన దిశ నిందితుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో 'మాకేది న్యాయం?' అన్న డిమాండ్ రాష్ట్రమంతా బలపడుతోంది. చిత్తూరు జిల్లాలో బంధువులు పెళ్లికి వచ్చిన దంపతులకు తీరని శోకాన్ని మిగిల్చాడు ఒక రాక్షసుడు. ఆరేళ్ల వయసున్న వాళ్ల కుమార్తెను తీసుకెళ్లి అత్యాచారం చేసి దారుణ హత్యకు పాల్పడ్డాడు. ఆ బాలిక తల్లితండ్రులు మాకు 'దిశ' తరహా న్యాయం చేయాలంటూ మదనపల్లె డీఎస్పీకి శుక్రవారం విజ్ఞాపనపత్రం అందించారు.

### ఆయేషా.. 12ఏళ్ల వ్యథ

విజయవాడలో 12 ఏళ్ల క్రితం అత్యంత దారుణంగా అత్యాచారం, హత్యకు గురైన ఆయేషామీరా హత్యకేసు మలుపుల మీద మలుపులు తిరుగుతూ చివరకు సీబీఐ విచారణ స్థితికి చేరింది. తెనాలికి చెందిన ఆయేషా మీరా ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కళాశాలలో బీఫార్మసీ చదువుతూ, దుర్గా హాస్టల్‌లో ఉండేవారు. ఆమె చేరిన మొదటి సంవత్సరంలోనే, 2007 డిసెంబర్ 27న హాస్టల్ గదిలో అత్యాచారం, హత్యకు గురయ్యారు. అర్ధరాత్రి కొందరు గుర్తుతెలియని దుర్మార్గులు పాల్పడిన ఈ దారుణ సంఘటన సంచలనం కలిగించింది. ఈ దారుణ హత్య వెనుక అప్పటి మంత్రి కోనేరు రంగారావు మనుమడు సతీశ్, అతని మిత్రులు ఉన్నారనే ఆరోపణలను ఆయేషా తల్లి షంషాద్ బేగం చేశారు. పోలీసులు మాత్రం అనాసాగరానికి చెందిన పిడతల సత్యంబాబును అరెస్టు చేశారు. సత్యంబాబును మహిళా న్యాయస్థానం దోషిగా తేల్చి, యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. అనంతర కాలంలో హైకోర్టు సత్యంబాబు ను ఈ కేసులో నిర్దోషిగా తేల్చి విడుదల చేసింది. ఈ కేసును తిరిగి విచారణ చేపట్టాలని సీబీఐకి అప్పగించారు. హత్య జరిగిన 11 ఏళ్ల తర్వాత విచారణ మొదలుపెట్టిన సీబీఐ సంవత్సరం పూర్తవుతున్నా ఇంకా విచారణ కొనసా...గిస్తూనే ఉన్నారు.

### నా భర్తను వదలొద్దు..

విజయవాడలోని భవానీపురంలో నివసించే బాలికను పొరుగింట్లో ఉండే పేరయ్య హత్యచేసి సంచిలో శవాన్ని దాచేశాడు. పెదనాన్న అని పిలిచిన ఆ బాలికను దారుణంగా చంపేసిన ఆ వ్యక్తి ఏమీ తెలియనట్టు పెడబొబ్బలు పెట్టాడు. చివరికి అతని భార్యకు ఇంట్లో సంచి కనిపించడంతో అసలు దారుణం వెలుగులోకి వచ్చింది. బెజవాడ వాసులు ఇప్పుడు తెలంగాణ ఎన్‌కౌంటర్‌ను ఇక్కడి పోలీసులకు గుర్తు చేస్తున్నారు. కర్నూలు జిల్లా బనగానపల్లెలో తండ్రి మైనారిటీ తీరని తన కుమార్తెపై రోజుల తరబడి అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేశాడు. తన భర్తను వదలొద్దని, కఠినంగా శిక్షించాలని బాధితురాలి తల్లి వేడుకొంటోంది. వీరంతా కోరుతున్న లాంటి 'న్యాయం' తాము చేయలేకపోయినా బాధితులు గట్టిగా నిలబడతామని పోలీసులు భరోసా ఇస్తున్నారు.

### అన్నీ ఆ కేసులే కాదు..

పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న అత్యాచారం కేసులన్నీ ఒకే కోవకు చెందినవి కాదు. పరిస్థితులు, సందర్భాలను బట్టి జరుగుతున్న ఆయా ఘటనలపై పోలీసులు.. అత్యాచారంగా పరిగణించి సెక్షన్ 376 నమోదు చేస్తున్నారు. వాస్తవానికి జరిగే అత్యాచారాలు వంద కేసులకు ఒకటో రెండో ఉంటాయనేది పోలీస్ అధికారుల అంచనా! మైనారిటీ తీరని బాలిక తనకు ఇష్టపడి యువకుడితో వెళ్లినప్పటికీ.. దానిని అత్యాచారం కేసుగా నమోదు చేస్తున్నారు. వివాహేతర సంబంధా లు వికటించి మహిళ ఫిర్యాదు చేస్తే దానిని కూడా అత్యాచారం కేసుగానే నమోదు చేస్తున్నారు. ఇలాంటి కేసులే ఎక్కువగా నమోదు అవుతున్నాయి. అలాగే, ఇలాంటి కేసుల్లో జాప్యానికి ప్రతిసారీ కోర్టులను తప్పుబట్టలేమని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు. అత్యాచారం కేసుల్లో ఫోరెన్సిక్ నివేదిక రావడంలోని జాప్యం ఆ కేసుపై ప్రభావం చూపుతోందని వాదిస్తున్నారు. సంచలనం సృష్టించిన కేసుల్లో మాత్రం నివేదికలను పోలీసు... వెంటపడి తెప్పించుకుంటున్నారు. మిగిలిన కేసుల్లో జాప్యం జరుగుతుంది.



## సామాన్యులు కాబట్టే కాల్చేశారు..

### ఆయేషా కేసులో అలా చేయగలరా?

"దిశ కేసులో దోషులను ఎన్‌కౌంటర్ చేయటం మంచి పరిణామమే. అయితే ఆ కేసులో ఉన్నది సామాన్యులు కనుకే ఎన్‌కౌంటర్ చేయగలిగారు. అందరికీ ఒకే న్యాయం అమలు చేయగలరా? అలా అమలు చేస్తే, మా పాప ఆయేషామీరా హత్య కేసులో దోషులను ఆ రోజే ఎందుకు కాల్చిపారేయలేకపోయారు? మా పాప కేసు వెనుక పెద్ద రాజకీయ వేత్తలు ఉన్నారు. సీఎం స్థాయిలోనే తొక్కేశారు. సీఎంలే నిందితులకు సహాయం చేస్తే బాధితులకు న్యాయం ఎట్లా జరుగుతుంది? ఆయే షా కేసులో సీబీఐ దర్యాప్తుపైనే కొండంత ఆశతో ఉన్నాం" - ఆయేషామీరా తల్లి షంషాద్‌బేగం

### మూగ యువతిపై అత్యాచారం

ధర్మవరం: అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలంలో మూగ, చెవుడు యువతిపై ఓ మదాంధుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. వృద్ధురాలైన పెద్దమ్మతో బాధితురాలు(35) కలిసి ఉంటోంది. శుక్రవారం తన గదిలో ఉన్న బాధితురాలిపై లక్ష్మీనారాయణ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె బంధువులు అటుగా రావడంతోఅక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఒక గ్యాంగ్.. 32 రేప్‌లు

ఉభయ గోదావరి జిల్లాల్లో లక్ష్మీనారాయణ అనే వ్యక్తి గ్రామాల్లో హరికథలు చెబుతుంటాడు. అతని కథలు వినేందుకు వచ్చిన అందమైన, బంగారు ఆభరణాలున్న మహిళలపై అతడు కన్నేసేవాడు. వాళ్లను మభ్యపెట్టి ఒంటరిగా బయటికి రప్పించి, అత్యాచారం చేసి నగలతో ఉడాయించేవాడు. కొన్ని కేసుల్లో శవాలను పాతిపెట్టేసేవాడు. 2012 నుంచి 2017వరకూ సాగిన ఈ అరాచకానికి రాజోలు పోలీసులు గత ఏడాది అడ్డుకట్ట వేశారు. చేపూరి భాగ్యవతి అనే మహిళ కనిపించకుండా పోవడంతో ఆమె భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న ఇన్స్‌పెక్టర్ క్రిస్టోఫర్.. హరిదాసు చేతికి సంకెళ్లు వేశారు. అతడికి తెలంగాణ పోలీసుల తరహా శిక్ష వేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన నలుగురు వ్యక్తుల గ్యాంగ్ ఈ రెండు జిల్లాలతోపాటు తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన 32మందిపై అత్యాచారానికి పాల్పడింది. ఏకాంతంగా కనిపించే జంటలను వేటాడి అబలలపై వాంఛ తీర్చుకునేవారు.

## ఇకనైనా 'దిశ' మారాలి

### ఎన్‌కౌంటర్‌పై విజయవాడలో సంబరాలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

'దిశ' కేసులో నిందితులను ఘటన జరిగిన ప్రదేశంలోనే ఎన్‌కౌంటర్ చేయడంపై విజయవాడలో మహిళా సంఘాలు, విద్యార్థినులు సంబరాలు చేసుకున్నారు. పోలీసులు 'దిశ'కు చాలా త్వరగా న్యాయం చేశారని ప్రశంసల జల్లు కురిపించారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో మేళతాళాల మధ్య సంబరాలు జరుపుకొన్నారు. వన్‌టౌన్‌లోని వస్త్రలత వద్ద జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్ ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. మాంటిస్సోరి కళాశాలలో విద్యార్థినులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ధర్నాచౌక్‌లో జనసేన మహిళా విభాగంలో ఆధ్వర్యంలో అమ్మాయిలపై జరుగుతున్న దారుణాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

### పునరావృతం కారాదు: అనుపమ పరమేశ్వరన్

దిశ ఘటన దురదృష్టకరమని ప్రముఖ సినీ నటి అనుపమ పరమేశ్వరన్ అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆమె ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ హర్షణీయమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని చెప్పారు. 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌తో ఆ కుటుంబానికి న్యాయం జరిగిందని సినీ నటి నిధి అగర్వాల్ అన్నారు. శ్రీకాకుళం వచ్చిన ఆమె ఎన్‌కౌంటర్‌పై మాట్లాడారు. తెలంగాణ పోలీసులు కాలయాపన చేయకుండా ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

### 'దిశ' గుర్తుగా కొబ్బరి మొక్క

'దిశ' కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై విజయనగరంలోనూ హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జిల్లాలోని చింతపల్లిలో కొబ్బరి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మంగం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దిశ జ్ఞాపకార్థం శుక్రవారం కొబ్బరి మొక్క నాటారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రేప్ చేసిన వాడికి రేపు ఉండకూడదని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు రవి పరస అన్నారు. సైబరాబాద్ సీపీ సజ్జనార్‌ను అభినందిస్తూ 'యు ఆర్ హీరో' అంటూ ఆయన నఖ చిత్రాన్ని సృజించారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బడివానిపేటలో సజ్జనార్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

### నేను సమర్థించలేను: మంత్రి ధర్మాన

'మంత్రి హోదాలో 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌ను సమర్థించలేను. కానీ, తప్పు చేస్తే ఎవరూ తప్పించుకోలేరు అనడానికి ఈ ఎన్‌కౌంటర్ రుజువు చేసింది' అని మంత్రి ధర్మాన కృష్ణదాస్ శ్రీకాకుళంలో అన్నారు.

### ప్రజల కోరిక మేరకే ఎన్‌కౌంటర్: కన్నబాబు

'నిందితులకు శిక్ష పడాలని ప్రజలు కోరుకున్నారు. కాబట్టే ఎన్‌కౌంటర్ స్థలంలో పోలీసులపై పూల వర్షం కురిపించారు. రాష్ట్రంలో మహిళల భద్రత, రక్షణకు మా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపడుతోంది. మహిళల రక్షణకు మహిళా మిత్ర, సైబర్ మిత్ర అనే యాప్‌లను రూపొందించింది.' అని మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. కాకినాడలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గతంలో వైఎస్ఆర్ హయాంలో వరంగల్‌లో యాసిడ్ దాడి జరిగినప్పుడు ఎన్‌కౌంటర్ జరిగిందనీ, అప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో యాసిడ్ దాడులు జరగలేదన్నారు.





తెలంగాణలో అత్యాచారం నిందితుల ఎన్‌కౌంటర్ తర్వాత విజయవాడలోని సిద్దార్థ కాలేజి విద్యార్థుల సంబరాలు

# ఉప్పల్‌లో విరాట్ విహారం

## భారత్ రికార్డు ఛేదన ● తొలి టీ20లో వెస్టిండీస్‌పై విజయం


రాహుల్ (40 బంతుల్లో 62)

**1** అంతర్జాతీయ టీ20ల్లో భారత జట్టుకు ఇదే అత్యధిక లక్ష్యఛేదన (208). గతంలో శ్రీలంక (207)పై ఛేదించింది.
- భారత్‌లో జరిగిన అంతర్జాతీయ టీ20ల్లో టీమిండియాపై అత్యధిక సిక్సర్లు (15) నమోదు కావడం ఇదే మొదటిసారి. ఓవరాల్‌గా మూడో అత్యధికం.
- అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు (52) తీసిన బౌలర్‌గా అశ్విన్‌తో కలిసి అగ్రస్థానంలో ఉన్న చాహల్.

**2** భారత్‌లో జరిగిన పొట్టి ఫార్మాట్‌లో భారత్‌పై రెండో అత్యధిక స్కోరు (207)ను సాధించిన జట్టుగా విండీస్. శ్రీలంక (215) టాప్‌లో ఉంది.

- అంతర్జాతీయ టీ20ల్లో భారత్ నుంచి అత్యధిక పరుగులు (56) సమర్పించుకున్న మూడో బౌలర్‌గా దీపక్ చాహర్. చాహల్ (64), జోగిందర్ శర్మ (57) ముందున్నారు.

**3** అతి తక్కువ ఇన్నింగ్స్ (29)లో 2 వేల పరుగులు పూర్తి చేసిన మూడో ఆటగాడిగా ఫించ్‌తో కలిసి సంయుక్తంగా ఉన్న రాహుల్. బాబర్ ఆజమ్ (26), కోహ్లీ (27) టాప్-2లో ఉన్నారు.


విరాట్ కోహ్లీ (50 బంతుల్లో 94 నాటౌట్)

**27 సిక్సర్లు.. 23 ఫోర్లు.. బ్యాట్స్‌మెన్‌కు స్వర్గధామంగా నిలిచిన ఉప్పల్ స్టేడియంలో భారత్, వెస్టిండీస్ ఆటగాళ్ల నుంచి వచ్చిన బౌండరీల వర్షమిది. ఏకంగా 416 పరుగులు నమోదైన ఈ మ్యాచ్‌లో నువ్వా.. నేనా అనేరీతిలో ఇరు జట్ల బ్యాట్స్‌మెన్ మైదానం నలువైపులా ఆడిన భారీ షాట్లను చూసి ప్రేక్షకులు ఉర్రూతలూగారు. అయితే హెట్‌మయెర్, లూయిస్ దూకుడుకు 207 పరుగుల భారీ స్కోరు సాధించినా పర్యాటక జట్టుకు నిరాశ తప్పలేదు. కింగ్ కోహ్లీ విశ్వరూపం ముందు అంతటి లక్ష్యం కూడా చిన్నబోయింది. లాఫ్టెడ్ డ్రైవ్, ఫ్లిప్ షాట్లతో అతడు సంధించిన కళ్లు చెదిరే సిక్సర్లకు అభిమానులు ఫిదా అయ్యారు. అయితే తొలి 20 పరుగులను 20 బంతుల్లో సాధించినా ఆ తర్వాత శివాలెత్తిన కోహ్లీ చివరి 74 పరుగులను 30 బంతుల్లోనే పూర్తి చేశాడు. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో విరాట్ అత్యధిక స్కోరు సాధించగా.. భారత్ రికార్డు ఛేదన పూర్తిచేసింది.**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** కెప్టెన్ విరాట్ కోహ్లీ (50 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 94 నాటౌట్) విజృంభించడంతో విండీస్‌తో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో భారత్ బోణీ చేసింది. శుక్రవారం ఉప్పల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్లతో ఘనవిజయం సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో విండీస్‌పై వరుసగా ఇది ఏడో గెలుపు కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 207 పరుగుల భారీ స్కోరు చేసింది. హెట్‌మయెర్ (41 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 56), లూయిస్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 40), పొలార్డ్ (19 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 37) మెరుపులు మెరిపించగా.. ఆఖర్లో హోల్డర్ (9 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 24 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. చాహల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రికార్డు లక్ష్య ఛేదనలో భారత్ 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 209 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ రాహుల్ (40 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 62) అర్ధసెంచరీ సాధించాడు. **విండీస్ ఈ మ్యాచ్‌లో ఏకంగా 23 ఎక్స్‌ట్రాలిచ్చుకోవడం గమనార్హం.** మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా కోహ్లీ నిలిచాడు. ఆదివారం తిరువనంతపురంలో రెండో మ్యాచ్ జరుగుతుంది.

**కోహ్లీ ధమాకా:** భారీ స్కోరు ఛేదనలో భారత్ నాలుగో ఓవర్‌లోనే రోహిత్ (8) వికెట్‌ను కోల్పోయింది. ఈ దశలో రాహుల్, కోహ్లీ జోడీ అలవోకగా విండీస్ బౌలర్లను ఎదుర్కొంటూ సెంచరీ భాగస్వామ్యంతో ఆదుకుంది. చెత్త బంతులను సిక్సర్లుగా మలుస్తూ రాహుల్ తన ఫామ్‌ను చాటుకోగా అటు కోహ్లీ మొదట నిదానం కనబర్చాడు. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా బౌలర్లపై ప్రతాపం చూపాడు. 12వ ఓవర్‌లో అతడు వరుసగా 6,4 బాదడంతో 14 పరుగులు వచ్చాయి. 37 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాక రాహుల్ మరో రెండు సిక్సర్లతో గేరు మార్చాడు. అయితే అతడికి మరో అవకాశం ఇవ్వకుండా 14వ ఓవర్‌లో పియెర్ దెబ్బతీశాడు. దీంతో రెండో వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆతర్వాత కోహ్లీ ఓ పుల్ షాట్‌తో సిక్సర్ సాధించి 35 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. విలియమ్స్ వేసిన 16వ ఓవర్‌లో కోహ్లీ వరుస బంతుల్లో 4,6తో చెలరేగగా, పంత్ (18) కూడా సిక్సర్ సాధించడంతో మొత్తం 23 పరుగులు వచ్చాయి. కానీ తర్వాతి ఓవర్‌లోనే పంత్ ఆఫ్ స్టంప్‌నకు ఆవల వెళుతున్న బంతిని ఆడి లాంగాఫ్‌లో క్యాచ్ ఇచ్చాడు. శ్రేయాస్ (4)కూడా నిరాశపరిచినా కోహ్లీ మాత్రం ఎక్కడా తగ్గకుండా 19వ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాది మ్యాచ్‌ను ముగించాడు.

**మెరుపు ఆరంభం:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్‌కు ఓపెనర్ ఇవాన్ లూయిస్ మెరుపు ఆరంభాన్నివ్వగా మధ్య ఓవర్లలో హెట్‌మయెర్, పొలార్డ్ అద్భుత ఇన్నింగ్స్‌తో స్కోరును కదం తొక్కించారు. వాషింగ్టన్ సుందర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే లూయిస్ వరుసగా 4,6తో 13 పరుగులు రాబట్టాడు. రెండో ఓవర్‌లోనే దీపక్ చాహర్ అవుట్ స్వింగర్‌కు మరో ఓపెనర్ సిమ్మన్స్ (2) స్లిప్‌లో క్యాచ్ ఇచ్చినా విండీస్ పరుగుల వేగం ఆగలేదు. బ్రాండన్ కింగ్ (31)తో జత కట్టిన లూయిస్ అదే జోరును కొనసాగించాడు. నాలుగో ఓవర్‌లో తను 6,4 సాధించగా కింగ్ డీప్ స్క్వేర్ లెగ్‌లో సూపర్ సిక్స్‌తో అదరగొట్టాడు. దీంతో ఈ ఓవర్‌లో దీపక్ 19 పరుగులు సమర్పించుకున్నాడు. ఆతర్వాత భువనేశ్వర్‌ను కూడా వదలకుండా వరుస బంతుల్లో లూయిస్ 6,4తో చెలరేగాడు. అయితే ఆరో ఓవర్‌లో సుందర్ అతడిని ఎల్బీ చేయడంతో రెండో వికెట్‌కు 26 బంతుల్లోనే 51 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పవర్‌ప్లేలో జట్టు 66 పరుగులు


హెట్‌మయెర్ (56)

సాధించింది. అటు స్పిన్ బౌలింగ్‌లో హెట్‌మయెర్, కింగ్ భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డారు. కానీ 11వ ఓవర్‌లో ముందుకు వచ్చి ఆడిన కింగ్‌ను కీపర్ పంత్ స్టంప్ చేశాడు. ఇక పొలార్డ్ తానెదుర్కొన్న రెండు, మూడు బంతులను 4,6గా మలిచి తన ఉద్దేశాన్ని చాటుకున్నాడు. అటు హెట్‌మయెర్ 35 బంతుల్లోనే ఓ సిక్సర్‌తో తొలి అర్ధసెంచరీని పూర్తిచేశాడు.

**మూడు క్యాచ్‌లు మిస్:** దీపక్ చాహర్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో భారత ఫీల్డింగ్ దారుణంగా సాగింది. పొలార్డ్ రెండు సార్లు ఇచ్చిన క్యాచ్‌ను బౌండరీ లైన్ దగ్గర రోహిత్, హెట్‌మయెర్ ఇచ్చిన క్యాచ్‌ను సుందర్ వదిలేశారు. ఇదే ఓవర్‌లో పొలార్డ్ రెండు భారీ సిక్సర్లు సాధించాడు. కానీ మరుసటి ఓవర్‌లోనే చాహల్ ఈ జోడీ దూకుడుకు అడ్డుకట్ట వేశాడు. తొలి బంతికి హెట్‌మయెర్ క్యాచ్‌ను రోహిత్ పట్టేయగా మూడో బంతికి పొలార్డ్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. నాలుగో వికెట్‌కు వీరి మధ్య 71 పరుగులు వచ్చాయి. 20వ ఓవర్‌లో హోల్డర్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను కోహ్లీ వదిలేయగా ఓ ఫోర్, సిక్సర్‌తో జట్టు స్కోరును 200 దాటించాడు.

### కోహ్లీ 'టిక్' మార్క్



కెరీర్ తొలినాళ్లలో విరాట్ కోహ్లీ మైదానంలో ఎంత దూకుడుగా ఉండేవాడో అభిమానులకు తెలిసిందే. ఆతర్వాత కెప్టెన్‌గా మారాక తను కాస్త శాంతస్వభావంతో మెలుగుతున్నాడు. కానీ విండీస్‌తో మ్యాచ్‌లో మాత్రం పలుమార్లు అసహనం కనబరుస్తూ పాత కోహ్లీలా కనిపించాడు. ఓసారి నోబాల్ కోసం లెగ్ అంపైర్‌కు సంజ్ఞ చేయగా మరోసారి రన్ తీసేటప్పుడు ఫీల్డర్ అడ్డుగా వస్తున్నాడంటూ అంపైర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే 16వ ఓవర్‌లో పేసర్ కెస్రిక్ విలియమ్స్ వేసిన యార్కర్‌ను లాంగాన్‌లో సిక్స్ బాదాక బ్యాట్‌ను కిందపెట్టి నోట్‌బుక్‌లో మూడుసార్లు టిక్ పెడుతున్నట్టు చేయడం హైలైట్‌గా నిలిచింది. 2017లో ఓసారి జమైకా వన్డేలో కోహ్లీని అవుట్ చేశాక విలియమ్స్ ఇలాగే చేశాడు. దీంతో దెబ్బకు దెబ్బ అన్నట్టుగా కోహ్లీ కూడా అలాగే బదులివ్వడం అభిమానులను ఆకట్టుకుంది.


వీవీఎస్ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు అజరుద్దీన్

## అజర్ 'స్టాండ్'ను ప్రారంభించిన లక్ష్మణ్

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి):** భారత మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు మహ్మద్ అజరుద్దీన్ పేరిట ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాండ్‌ను వీవీఎస్ లక్ష్మణ్ శుక్రవారం ప్రారంభించాడు. స్టేడియంలోని నార్త్ పెవిలియన్‌లోని నార్త్‌స్టాండ్‌ను ఈమేరకు నూతనంగా పునరుద్ధరించారు. కాగా, హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి దయానంద్ పేరిట సౌత్ పెవిలియన్‌లో లాంజ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీమిండియా మాజీ ఆఫ్ స్పిన్నర్ నోయల్ డేవిడ్, వెంకటపతిరాజు, పేసర్ మహ్మద్ సిరాజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ గౌరవం తనకు దక్కడం గర్వంగా ఉందని ఈ సందర్భంగా అజర్ అన్నాడు.

**1** అంతర్జాతీయ టీ20ల్లో ఎక్కువ హాఫ్ సెంచరీ (23)లు సాధించిన ఆటగాడిగా రోహిత్‌ను అధిగమించిన విరాట్ కోహ్లీ. అలాగే 12 మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లతో మహ్మద్ నబీతో కలిసి విరాట్ తొలి స్థానంలో ఉన్నాడు.

### స్కోరుబోర్డు

**వెస్టిండీస్:** సిమ్మన్స్ (సి) రోహిత్ (బి) దీపక్ 2; లూయిస్ (ఎల్బీ) వాషింగ్టన్ సుందర్ 40; బ్రాండన్ కింగ్ (స్టంప్) పంత్ (బి) జడేజా 31; హెట్‌మయెర్ (సి) రోహిత్ (బి) చాహల్ 56; పొలార్డ్ (బి) చాహల్ 37; హోల్డర్ (నాటౌట్) 24; రామ్‌దిన్ (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 207/5. వికెట్ల పతనం:** 1-13, 2-64, 3-101, 4-172, 5-173. **బౌలింగ్:** వాషింగ్టన్ సుందర్ 3-0-34-1; దీపక్ చాహర్ 4-0-56-1; భువనేశ్వర్ 4-0-36-0; జడేజా 4-0-30-1; చాహల్ 4-0-36-2; దూబే 1-0-13-0.

**భారత్:** రోహిత్ (సి) హెట్‌మయెర్ (బి) పియెర్ 8; రాహుల్ (సి) పొలార్డ్ (బి) పియెర్ 62; కోహ్లీ (నాటౌట్) 94; పంత్ (సి) హోల్డర్ (బి) కాట్రెల్ 18; శ్రేయాస్ (సి అండ్ బి) పొలార్డ్ 4; దూబే (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 23; మొత్తం: 18.4 ఓవర్లలో 209/4. వికెట్ల పతనం:** 1-30, 2-130, 3-178, 4-193. **బౌలింగ్:** కాట్రెల్ 4-0-24-1; హోల్డర్ 4-0-46-0; పియెర్ 4-0-44-2; వాల్ష్ 2-0-19-0; విలియమ్స్ 3.4-0-60-0; పొలార్డ్ 1-0-10-1.

### 'ఎన్‌కౌంటర్'పై క్రీడాలోకం హర్షం

**న్యూఢిల్లీ:** దిశపై హత్యాచారం చేసిన నలుగురు నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన హైదరాబాద్ పోలీసులపై దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వీరితో క్రీడా ప్రముఖులు కూడా గళం కలిపారు.

**న్యాయం చేశారు**



దిశకు తెలంగాణ పోలీసులు న్యాయం చేశారు. ఆమె ఆత్మకు శాంతి కలుగుతుంది.

**-పీవీ సింధు**

**అభినందనలు**

తెలంగాణ పోలీసులకు అభినందనలు. ప్రజలు వారిపై పూలవర్షం కురిపించడంలో అర్థముంది.

**-రెజ్లర్లు బబిత, గీత**

**మరెవరూ సాహసించరు**

తెలంగాణ పోలీసులు మంచి పని చేశారు. మరెవరూ ఇలాంటి ఘటనలకు పాల్పడే సాహసం చేయరు.

**-రెజ్లర్ యోగేశ్వర్ దత్**

**చెడుపై విజయం**



చెడుపై మంచి సాధించిన విజయమిది. పోలీసులు పోలీసుల్లా పనిచేసేందుకు అవకాశమిచ్చిన నాయకత్వానికి అభినందనలు.

**-మాజీ షూటర్ రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్**

## రవిశాస్త్రిపై కక్ష లేదు: గంగూలీ



**కోల్‌కతా:** టీమిండియా కోచ్ రవిశాస్త్రితో తాను కక్షపూరితంగా వ్యవహరిస్తాననడం అర్థంలేనిదిగా బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కొట్టిపారేశాడు. అవి వదంతులేనని స్పష్టంజేశాడు. తన హయాంలో.. ప్రదర్శనల ఆధారంగానే వ్యక్తుల పనితీరును అంచనా వేస్తామని చెప్పాడు. 2016లో భారత కోచ్ ఎంపిక సందర్భంగా గంగూలీ, శాస్త్రిమధ్య మాటల యుద్ధం జరిగిన సంగతి తెలిసిందే. నాడు ఆ పదవికి శాస్త్రి కూడా మరోసారి దరఖాస్తు చేశాడు. కానీ గంగూలీ సభ్యుడిగా గల క్రికెట్ సలహా కమిటీ కుంబ్లేను కోచ్‌గా ఎంపిక చేసింది. దాంతో ఆగ్రహించిన రవిశాస్త్రి తనకు పదవికి దక్కకపోవడానికి గంగూలీయే కారణమని విమర్శించాడు. తర్వాత.. కుంబ్లే రాజీనామా చేయగా..శాస్త్రి కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ప్రస్తుతం సౌరవ్ బీసీసీఐ చీఫ్‌గా ఎన్నికైన నేపథ్యంలో శాస్త్రిపట్ల దాదా కక్షతో వ్యవహరిస్తాడన్న వార్తలు వెలువడుతున్నాయి. అయితే వాటిని గంగూలీ తోసిపుచ్చాడు. 'అందుకే వాటిని ఊహాగానాలంటారు. ఆ ప్రశ్నలకు నావద్ద సమాధానం లేదు' అని సౌరవ్ అన్నాడు.

## 'టాప్' లేపిన భారత్

### ఐదోరోజు 41 పతకాలు ● సిరిల్‌కు స్వర్ణం, గాయత్రికి రజతం ● దక్షిణాసియా క్రీడలు


సిరిల్ వర్మ

**ఖాట్మండు/ఫొఖారా:** దక్షిణాసియా క్రీడల్లో భారత క్రీడాకారుల పతకాల జోరు ఊపందుకుంది. పోటీలకు ఐదోరోజైన శుక్రవారం 19 స్వర్ణాలు సహా 41 పతకాలు కొల్లగొట్టారు. దీంతో భారత్ ఓవరాల్‌గా 165 పతకాల (81 స్వర్ణాలు, 59 రజతాలు, 25 కాంస్యాలు)తో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆతిథ్య నేపాల్ 116 పతకాలతో రెండోస్థానంలో ఉంది. శుక్రవారం పోటీల్లో భారత షట్లర్లు నాలుగు పసిడి, రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో తెలుగు కుర్రాడు సిరిల్ వర్మ 17-21, 23-21, 21-13తో భారత్‌కే చెందిన ఆర్యమన్ టాండన్‌ను ఓడించి స్వర్ణం అందుకున్నాడు. మహిళల సింగిల్స్ ఫైనల్ చేరిన పుల్లెల గాయత్రి గోపీచంద్ రజతంతో సరిపెట్టుకుంది. భారత్‌కే చెందిన అస్మితా చాలియా 21-18, 25-23తో గాయత్రిపై గెలిచి పసిడి దక్కించుకుంది. పురుషుల డబుల్స్ ఫైనల్లో ధ్రువ్-కృష్ణ ప్రసాద్ జోడీ 21-19, 19-21, 21-18తో శ్రీలంక జంట సచిన్-బువనెకాపై, మిక్స్‌డ్‌లో టాప్‌సీడ్ ధ్రువ్-మేఘన ద్వయం 21-16, 21-14తో లంక జోడీ సచిన్-తిలిని ప్రమోదికపై గెలిచి స్వర్ణాలు సాధించారు. ఇక.. ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెటిక్స్‌లో అత్యధికంగా 12 పతకాలు భారత్ గెలుచుకుంది. ఇందులో రెండు స్వర్ణాలు షాట్‌పుట్ ఈవెంట్‌లో లభించాయి. పురుషుల షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్ సింగ్ తూర్ ఇనుపగుండును రికార్డుస్థాయిలో 20.03 మీటర్ల దూరం విసిరి పసిడి గెలుచుకున్నాడు. భారత్‌కే చెందిన ఓంప్రకాశ్ కర్హానా రజతం దక్కించుకున్నాడు. మహిళల షాట్‌పుట్‌లో భారత అమ్మాయి అభా ఖతువా 15.32 మీటర్ల దూరం గుండును విసిరి బంగారు పతకాన్ని ముద్దాడింది. మరో భారత అథ్లెట్ కచానా చౌదరి కాంస్యం సాధించింది. ఫెన్సింగ్‌లో భారత్‌కు మూడు స్వర్ణాలు, రెండు రజతాలు.. టేబుల్ టెన్నిస్‌లో ఓ స్వర్ణం, ఓ రజతం.. వెయిట్‌లిఫ్టింగ్‌లో మూడు స్వర్ణాలు, ఓ రజతం.. సైక్లింగ్‌లో రెండు స్వర్ణాలు, ఓ రజతం భారత్ ఖాతాలో చేరాయి.


పతకాలతో మేఘన, గాయత్రి

## ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆఖరు

### టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పనున్న వోజ్నియాకి



**పారిస్:** డెన్మార్క్ టెన్నిస్ బ్యూటీ కరోలిన్ వోజ్నియాకి ఆటకు వీడ్కోలు పలకనుంది. వచ్చేనెలలో జరగనున్న సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ తనకు ఆఖరి టోర్నీ కానుందని ప్రపంచ మాజీ నెంబర్‌వన్ అయిన వోజ్నియాకి ప్రకటించింది. 'కోర్టులో నేనేం చేయాలనుకున్నానో అది సాధించా. కెరీర్‌కు వీడ్కోలు పలికే సమయమొచ్చింది. వచ్చే ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో రిటైర్మెంట్ ప్రకటిస్తా. ఇక, కుటుంబానికి ప్రాధాన్యమివ్వాలనుకుంటున్నా' అని 29 ఏళ్ల వోజ్నియాకి సోషల్ మీడియాలో ప్రకటించింది. వోజ్నియాకి కెరీర్‌లో ఏకైక గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గతేడాది అందుకుంది.

## పీలే జెర్సీ @ 26 లక్షలు



**ట్యూరిన్ (ఇటలీ) :** బ్రెజిల్ ఫుట్‌బాల్ లెజెండ్ పీలే ధరించిన జెర్సీ రూ.26 లక్షలకు వేలంలో అమ్ముడైంది. పీలే ఈ జెర్సీని తన చివరి మ్యాచ్‌లో వేసుకున్నాడు. బ్రెజిల్, యుగోస్లావియా మధ్య ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ 1971 జులైలో రియో డి జనీరోలో జరిగింది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com


BIG C
225+ STORES | AP | TS | TN
SOUTH INDIA'S MOST TRUSTED MOBILE RETAIL CHAIN
SCRATCH & WIN*
12 CRORES
WORTH OF GIFTS*
AND ALSO GET*
5 CRORES
CASH POINTS*
17TH ANNIVERSARY
SALE*
*T&C Apply
GUARANTEED GIFT* + CASH POINTS*
Refrigerators
Washing Machines
32" LED HD Tvs
Laptops
Singer Ovens
Stainless Steel 2pcs
Killer duffle bags
Trolly Suitcases
Lotto Shoes
Cello Tiffins
5Lt Water Jugs
vivo V17 8GB+128GB
bookmyshow Movie Voucher ₹300 FREE
Pre - Book Now
vivo V17Pro
32MP Dual Pop-up Clear as Real
10% CASH BACK HDFC BANK
Down Payment 0
OPPO A9 2020
8GB + 128GB
5% CASH BACK HDFC BANK
OPPO Reno2 Series
See More, See Clear
Ultra dark mode
Ultra steady video
5% CASH BACK HDFC BANK
OnePlus 7T
₹37999
₹34999
+
upto ₹3000 HDFC BANK Instant Discount
iPhone 11 Pro
Pro cameras. Pro display. Pro performance
₹6000 CASH BACK HDFC BANK
EMI Non EMI Transaction
6 Months No Cost EMI
mi Redmi 7A
2GB+32GB
₹6399 ₹5499
+
₹300 CASH BACK HDFC BANK
Less than online price
realme X2 Pro
8GB + 128GB
12GB + 256GB
India's Fastest Charging Flagship
0 Down Payment
NEW ARRIVAL
NOKIA 7.2
4GB & 6GB
10% CASH BACK HDFC BANK
SAMSUNG
#GalaxyTurns10
Avail benefits* up to ₹29,000/-
*No other offer applicable
Galaxy A70s
Get Bluetooth Earphones worth ₹1,999/- Free*
Galaxy Note10+
Cashback ₹21,000/-* HDFC BANK
Galaxy S10e
Benefits up to ₹29,000/-* HDFC BANK
Galaxy A50s (6GB) ₹26,900/- ₹21,999/-
Galaxy A50s (4GB) ₹24,900/- ₹19,999/-
Galaxy A30s (4GB) ₹18,900/- ₹15,999/-
TCL SMART TVs
3 Years Warranty
Prize Starts from ₹8990
Sizes Available 32" | 43" | 55"
mi Xiaomi INDIA'S No.1 Smart TV Brand
Mi TV SAY IT. SEE IT.
Available @ all BIG C Stores
EMI AVAILABLE
Sizes Available 32" | 40" | 43" | 50" | 55" | 65"
0% Down Payment
Processing Fee
No Cost EMI
BAJAJ FINSERV
IDFC FIRST Bank
HDFC BANK
HDB FINANCIAL SERVICES
HOME CREDIT
Pine Labs
Helpline 1800 123 4578
www.bigcmobiles.com
for more offers
visit your nearest Big C Store
BIG C